www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 237 | శనివారం 17-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

- సంపులో దిగి 8 మంది కార్మికుల మృతి
- చిత్తూరు జిల్లా మొరం గ్రామంలో ఘటన
- మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం
- హేచరీపై చర్యలు తీసుకుంటాం : కలెక్టర్

మహా విషాదం



విశాలాంధ్ర-పలమనేరు :
చిత్తూరు జిల్లా పలమనేరు మండలంలోని మొరం గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక శ్రీవెంకటేశ్వర హేచరీస్‌లో శుక్రవారం భూగర్భ డ్రెయినేజీలో వ్యర్థాలను శుభ్రం చేస్తుండగా ఎనిమిది మంది కార్మికులు ఊపిరి ఆడక మృతి చెందారు. హేచరీస్‌లోని ఓ సంపులో ఫుట్‌బాల్ మరమ్మతుల కోసం కార్మికులు సంపులోకి దిగినపుడు ఈ ఘటన చోటు చేసుకుంది. శ్రీ వెంకటేశ్వర హేచరీస్‌లో కుళ్లిన గుడ్ల నీటిని ఓ సంపులోకి తరలిస్తారు. ఆ సంపులోని విషవాయువు నీటిని మిషన్ ద్వారా తోడేస్తారు. అయితే అందులో ఉన్న ఫుట్‌బాల్‌లో నీరు రాకపోవడం వల్ల సంపులోకి ఒక కార్మికుడిని దించారు. అతను బయటకు రాకపోవడంతో ఒక్కొక్కరిగా సంపులోకి దిగిపోవడంతో వారంతా ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో హేచరీస్ యాజమాన్యం జేసీబీని తీసుకొచ్చి సంపుపై ఉన్న సిమెంటు పైకప్పును తొలగించడంతో వారు అక్కడే నీటిలో మృతి చెంది ఉన్నారు. అయితే ప్రాణాలున్నాయని భావించి వారిని ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి వారంతా మృతి చెందారని తెలిపారు. మృతి చెందిన వారిలో విశ్వనాథ్ కుమారుడు రమేష్(32), చిన్నబ్బ కుమారుడు గోవిందస్వామి(45) కూర్మాయిగ్రామం, రమణ కుమారుడు రామచంద్రయ్య(23) శ్రీరంగరాజపురం, ఆవుల వెంకటప్ప కుమారుడు రెడ్డెప్ప(48)మొరం, లేట్ రంగప్ప కుమారుడు బాబు(35) తిమ్మనాయినపల్లి

- మిగతా 2 లో

ఏపికి జరిగిన అన్యాయంపై నిజనిర్ధారణకు

త్రిసభ్య కమిటీ

- 18న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం
- జేఎఫ్‌సీ భేటీలో నిర్ణయం



జేఎఫ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న పవన్. పక్కన రామకృష్ణ, మధు, జేపీ, గౌతమ్, చంద్రశేఖర్ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :
రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై నిజాలను వెలికితీసేందుకు జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(జేఎఫ్‌సీ) ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది.

ఈ కమిటీ రాష్ట్రానికి కేంద్రం నుండి ఇంత వరకు వచ్చిన నిధుల కేటాయింపులు, ఖర్చులు తదితర అంశాలపై నివేదికలను తయారు చేయనుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలకు అతీతంగా కార్యాచరణను రూపొందించనుంది. ఈ కమిటీలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు పద్మనాభయ్య, చంద్రశేఖర్, ఏపీ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావులు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాలపై శుక్రవారం నగరంలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జేఎఫ్‌సీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ, సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శి మధు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, చలసాని శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గౌతమ్‌తో పాటు మాజీ ఐఏఎస్

- మిగతా 2 లో



గీతాంజలి చోక్సీపై

సీబీఐ కేసు..!

పీఎన్‌బికి రూ.4,886 కోట్లు టోపీ

- 50 సంస్థల్లో తనిఖీలు
- నీరవ్, మెహుల్‌కు ఈడీ నోటీసులు
- ఇద్దరి పాస్‌పోర్టుల సస్పెన్షన్
- అమెరికాలో మోడీ జల్సా
- ఇంటర్‌పోల్‌కు సీబీఐ అభ్యర్థన

బ్యాంకుల్లో దాచుకున్న దేశ ప్రజల కష్టార్జితం వేల కోట్ల రూపాయలను కొల్లగొట్టి విదేశాలకు పారిపోయిన డైమండ్స్ టైకూన్ నీరవ్ మోడీ.. ఆయన భాగస్వామి గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీపై పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదుతో సీబీఐ తాజాగా మరో కేసు నమోదు చేసింది. అతడి ఆచూకీ కనుగొనాలని ఇంటర్ పోల్‌ను అభ్యర్థించింది. దేశంలోనే లేని వీరిద్దరినీ వారంలోగా తమ ఎదుట హాజరు కావాలంటూ ఈడీ సమన్లు జారీ చేసింది. శుక్రవారమూ గీతాంజలి గ్రూప్‌నకు చెందిన కార్యాలయాలపై సీబీఐ దాడులు కొనసాగాయి.

9లో

బ్యాంకు మోసాలు

రెట్టింపు

- ఎస్‌బీఐకి నీరవ్ రూ.1360కోట్ల టోపీ..!
- మొండి బకాయిలు 9.5లక్షల కోట్లకు పైమాటే

మోడీ హయాంలో 12వేలకుపైగా వంచన కేసులు



న్యూఢిల్లీ:
తాను అధికారంలోకి వచ్చిన తర్వాత బ్యాంకు రుణాలకు సంబంధించి రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని, మోసాలు జరగలేదనీ ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల పార్లమెంటులో చెప్పిన మాటలలో ఇసుమంత కూడా వాస్తవంలేదు. గత నాలుగేళ్లలో మొండి బకాయిలు (ఎగవేతలు) దాదాపు రెట్టింపయ్యాయని రాయిటర్స్ వార్తాసంస్థ పరిశీలనలో వెల్లడైంది. ఆర్థికమాంద్యం, అనేక సంవత్సరాలుగా అక్రమ పద్ధతుల్లో రుణాలివ్వడం కారణంగానే మొండిబకాయిలు అపారంగా పెరిగాయి. ఇప్పటికీ అవి పెరుగుతూనే ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.11,520 కోట్లు టోపీ పెట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ ఎస్‌బీఐకి కూడా రూ.1,360 కోట్లు ఎగనామం పెట్టినట్లుగా తెలిసింది. పీఎన్‌బీ ఇచ్చిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (హామీపత్రం) పైన తాము రూ.1,360 కోట్లు నీరవ్ మోడీకి రుణం అందజేసినట్లు ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ శుక్రవారం కొచ్చీలో విలేకరులకు తెలియజేశారు.

2017 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరం చివరినాటికి 9.5లక్షల కోట్లు మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు) ఉన్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడయ్యాయి. అయితే వాస్తవంగా ఈ బకాయిలు మరింత అధికంగా ఉన్నాయని సెంట్రల్ బ్యాంకు నిర్వహించిన వాణిజ్య బ్యాంకుల ఆడిట్లు ధృవీకరిస్తున్నాయని నిపుణులైన విశ్లేషకులు తెలియజేస్తున్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా రుణ బకాయిలను వసూలు చేయడంలో కఠినంగా వ్యవహరించాలని తాజాగా సెంట్రల్ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. కేంద్రంలోఉన్న కీలకమైన మంత్రులు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. ఈ ఆదేశాలు, హామీలు అమలుకాలేదని గత అనుభవాలు ప్రజలకు తెలియజేస్తున్నాయి.

2014-15 నుంచి 2016-17 వరకు బ్యాంకుల్లో జరిగిన మోసాల కేసులు 12వేలకు పైగా నమోదయ్యాయి. ఇందులో పంజాబ్ నేషనల్

- మిగతా 2 లో



'తంబి'లకు సుప్రీం షాక్

- కావేరీ జలాల్లో వాటా కోత
- కర్ణాటకలో ఆనందోత్సాహాలు
- తమిళనాడులో ఆగ్రహావేశాలు

11లో

రూ.12 కోట్ల అవినీతి

నన్నయ్య వర్సిటీ పనుల్లో అక్రమాలు

వర్కు ఆర్డరు నిలుపుదలకు ప్రభుత్వం ఆదేశం

11లో

ఉపాధి బూటకం

నిరుద్యోగ సమస్యపై చిన్నచూపు

- ఎన్నికల హామీలన్నీ గాలికి...
- 4 లక్షల దరఖాస్తులు.. 50 వేలమందికే రుణాలు
- మోడీ సర్కారు తీరు ఆందోళనకరం



విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి :
నరేంద్రమోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటీ సక్రమంగా అమలు జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. ఉద్యోగ, ఉపాధి హామీలు కొండెక్కాయి. విదేశాల్లో దాగిన నల్లడబ్బును స్వదేశానికి తీసుకొస్తానన్న హామీ అటకెక్కింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు గాలికి పోయాయి. ఇవన్నీ రాజకీయ పార్టీలు ప్రత్యేకించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు కాదు. నిరుద్యోగానికి సంబంధించి సాక్షాత్తు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదిక వెల్లడించింది. దేశంలో ఇది ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఏటా రెండు కోట్లమందికి ఉద్యోగాలిస్తామని మోడీ చెప్పిన మాటలు ఆచరణలో నిరుద్యోగాన్ని పెంచిందని ఐఎల్‌ఓ నివేదిక వెల్లడించింది. నాలుగేళ్లలో ఉపాధి అవకాశాలు పెరగలేదు సరికదా..2017లో ఉన్న ఉద్యోగాలు తుస్సుమన్నాయి. ఇది సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నది. 2016లో కల్పించిన ఉద్యోగాలు గడచిన పదేళ్లలో ఎన్నడూలేనంత తక్కువగా ఉన్నాయన్న వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి పరిస్థితుల్లో స్వయం ఉపాధి కల్పిస్తామంటూ మోడీ సర్కారు ఇచ్చిన హామీ నిరుద్యోగ యువతను మరింత నిరుత్సాహానికి గురిచేస్తున్నది. గడచిన ఎనిమిదేళ్లలో ఎన్నడూ లేనంతగా మోడీ పాలనలో నిరుద్యోగం తాండవిస్తోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. స్వయం ఉపాధికి మోడీ సర్కారు ఇచ్చిన రుణాలు చెప్పుకోదగినవేమీ కాదని తెలుస్తోంది. అటు ఉద్యోగాల కల్పనలేక.. ఇటు స్వయం ఉపాధిలేని నిరుద్యోగ యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. యువత తీవ్ర ఆందోళన చెందుతోంది. 2017 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పీఎంఈజీపీ కింద నాలుగు లక్షలకుపైగా యువత ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో కేవలం 50 వేలమందికి మాత్రమే రుణాలు లభించాయి. అంటే కేవలం 12 శాతం మందికి మాత్రమే రుణాలిచ్చినట్టు రికార్డులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



8న బడ్జెట్

- ఖరారైన మూహూర్తం
- 5నుంచి అసెంబ్లీ సమావేశాలు

సుస్థిర వృద్ధి, ప్రజల సంతృప్తే లక్ష్యం | సన్నాహక సమావేశంలో చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు మూహూర్తం ఖరారైంది. మార్చి 5వ తేదీ నుండి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని, 8వ తేదీ 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ శాఖాధిపతులు, కార్యదర్శులు, మంత్రులతో శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బడ్జెట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బడ్జెట్ తేదీలను ఖరారు చేసిన సీఎం అధికారులనుద్దేశించి మాట్లాడుతూ పాత పద్ధతులతో ఏమీ సాధించలేమని, కొత్త విధానాలతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఈ వాస్తవం తెలుసుకుని ప్రభుత్వ లక్ష్యాలకు తగ్గట్టు పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ శాఖల

- మిగతా 2 లో



బహిరంగ సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల. వేదికపైన రవీంద్రనాథ్, రావుల వెంకయ్య, మధు, ఓబులేసు తదితరులు

కేంద్రం మెడలు వంచైనా

ప్రత్యేక హోదా సాధిస్తాం

సీపీఐ తూర్పుగోదావరి జిల్లా మహాసభలో ముప్పాళ్ల, ఓబులేసు స్పష్టీకరణ

3లో

వెనుజులా సరిహద్దులో బ్రెజిల్ ఎమర్జెన్సీ

బ్రసీలియా : వెనుజులా సరిహద్దులో బ్రెజిల్ ఎమర్జెన్సీ విధించింది. వెనుజులా నుంచి ప్రజలు ఎక్కువగా తమ దేశంలో ప్రవేశిస్తున్నారంటూ ఆరోపిస్తూ బ్రెజిల్ సరిహద్దు ప్రాంతాల్లో ఎమర్జెన్సీని గురువారం ప్రకటించింది. సరిహద్దులకు తమ సైనిక దళాలను తరలించింది. సైనికులకు అవసరమైన వస్తువులు ఇతర సహాయాన్ని రెట్టింపు చేస్తున్నట్లుగా బ్రెజిల్ రక్షణ మంత్రి రాల్ జంగ్‌మన్ తెలిపారు. ఎమర్జెన్సీని విధించడానికి సంబంధించిన డిక్రీ పై కొద్దిరోజుల్లో సంతకాలు జరుగుతాయని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వెనుజులా నుంచి ఇంతవరకు తమ దేశంలోకి 40 వేల మంది ప్రవేశించారని బ్రెజిల్ ప్రభుత్వం ప్రకటించింది.

పెరూ సమ్మిట్‌కు మదురో

కారకాస్ : వెనుజులా అధ్యక్షుడు నికొలస్ మదురో పెరూలో ఏప్రిల్‌లోజరిగే లాటిన్ అమెరికా దేశాల సమ్మిట్‌కు హాజరు కానున్నారు. ఈ అంశాన్ని ఆయనే స్వయంగా తెలియదేశారు. లాటిన్ అమెరికాలో ప్రత్యేకించి అర్జంటైనా, కొలంబియా, పెరూ దేశాలు తమ ప్రభుత్వాన్ని కూల దోయాలని యత్నిస్తున్న అమెరికాకు అండగా నిలుస్తున్నాయని మదురో విమర్శించారు. పెరూలో జరిగే సమ్మిట్‌కు హాజరై వాస్తవ పరిస్థితులను వివరిస్తామని ఆయన వెల్లడించారు. తమ దేశంలో లభించే అపారమైన చమురు నిల్వలను స్వాధీనం చేసుకునేందుకే అమెరికా రకరకాల ఎత్తులు పన్నుతోందని మదురో విమర్శించారు. ప్రపంచంలోనే అత్యధికంగా ముడి చమురు నిల్వలు వెనుజులాలో



ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు గణనీయంగా పడిపోవడంతో వెనుజులా ఆదాయం తగ్గింది. అంతేకాకుండా వెనుజులాలో ప్రతిపక్షాలను ప్రోత్స హిస్తూ మదురో ప్రభుత్వాన్ని కూల్చి వేసేందుకు అమెరికా తన ప్రయత్నాలు కొనసాగిస్తునే ఉంది. పలురకాల ఆంక్షలూ విధించింది. దీంతో వెనుజులా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, నిత్యావసరవస్తువులు ధరలను పెరిగాయి. ద్రవ్యోల్బణం అధిక మైంది. వస్తువుల కొరత ఏర్పడింది. ఈ పరిస్థితులన్నింటినీ సృష్టించింది అమెరికా అయినప్పటికీ అది ఇంకా వెనుజులాను వెంటాడుతూనే ఉంది. లాటిన్ అమెరికాలో క్యూబా బొలీవియా, నికరాగ్వా తదితర దేశాలు మదురోకు అండగా నిలిచాయి.

ఇరాక్‌పై అమెరికా దాడికి వ్యతిరేకంగా

దశాబ్దిన్నరగా కొనసాగుతున్న నిరసన



ఐరాస : దశాబ్దిన్నర కాలం క్రితం అమెరికా ఇరాక్‌పై దాడి చేసి ఆదేశ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను హతమార్చడమే కాక, 10 లక్షల మందికి పైగా అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైంది. ఇరాక్‌లో రసాయిన ఆయుధాలు ఉన్నాయంటూ కుంటి సాకులు చెప్పి అమెరికా ఇరాక్‌పై దాడికి పూనుకుంది. ప్రపంచ దేశాలన్నీ అమెరికా దాడిని ఖండించాయి. ఐక్యరాజ్యసమితి సైతం ఈ దాడిని నిరసించింది. ఇరాక్‌లో చమురు నిక్షేపాల కోసమే అమెరికా కుయుక్తులు పన్నిందని విమర్శలు వెల్లువెత్తాయి. దాడిజరిగిన తర్వాత 2003 ఫిబ్రవరి 15 తేదీ తర్వాత రెండు రోజులపాటు ప్రపంచ వ్యాప్తంగా అమెరికా చర్యలను నిరశిస్తూ ప్రదర్శనలు జరిగాయి. ఈ ప్రదర్శనల్లో 3కోట్లమందికి పైగా ప్రజలు పాల్గొని ఉంటారని అంచనా వేశారు. ఇప్ప టికీ అమెరికా చర్యను ఎండగడుతూనే ఉన్నారు. అప్పుడు లండన్ వీధుల్లో లక్షలాదిమంది ప్రదర్శ నలు జరిపి అమెరికా చర్యను ఖండించారు. ఇరాక్‌పైన దాడిని నిలిపివేయాలని ప్రదర్శకులు ఎలుగెత్తి అరిచారు. అనాటి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్‌కి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కూడా మద్దతు పలికారు. దీంతో బ్రిటన్ అంతటా బ్లేయర్ వైఖరిని నిరసించారు. ఇరాక్ ప్రభుత్వం రసాయిన ఆయుధాలు కలిగి ఉన్నా యన్న అమెరికా ఆరోపణలు నిజం కాదని ఐక్య రాజ్యసమితి బృం దం దర్యాప్తు చేసి నిగ్గుతేల్చింది. అయినప్పటికీ తమ తప్పును అంగీకరించేందుకు దీర్ఘకాలం అమె రికా సిద్ధపడలేదు. బుష్ మాటలను, చేతలను వ్యతి రేకిస్తూ బ్రిటన్‌లో 20 లక్షల మందికి పైగా ప్రద ర్శన జరిపారు. ఇది బ్రిటన్ చరిత్రలోనే అపూర్వ మైంది. బ్రిటన్‌లో 25 కుటుంబాలకు కనీసం ఒక కుటుంబ సభ్యులైనా తమ నిరసన తెలియచేశారని ఆనాటి సర్వే తెలిపింది. పాఠశాలల నుంచి విశ్వవి ద్యాలయం వరకు పిల్లలు, విద్యార్థులు వీధులోకి వచ్చి నిరసన తెలిపారు. అయినప్పటికీ బ్రిటన్ ప్రధానిగా ఉన్న బ్లేయర్ బుష్‌కి మద్దతు తెలిపారు. 2003 ఫిబ్రవరి నెలంతా ప్రపంచ దేశాల్లో ఏదో ఒక మూల నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇరాక్‌ను దాదాపు ధ్వంసం చేసిన అమెరికా చివరికి తన చర్య పొరపాటేనని అంగీకరించింది. ఇరాక్ మీద దాడి చేసి తన సైన్యాన్ని సుదీర్ఘకాలం అక్కడే ఉంచడం మూలంగా లక్షల కోట్ల డాలర్లు ఖర్చు చేయవలసి వచ్చిందని కూడా అంతర్జాతీయ నిపుణులు అంచనా వేశారు.

టర్కీలో టిల్లర్సన్‌కు తీవ్ర నిరసన



అంకార : అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్‌టిల్లర సన్‌కు వ్యతిరేకంగా టర్కీ రాజధాని అంకారాలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. సిరియాలో కుర్దిష్ తిరుగుబాటు దారులకు అమెరికా మద్దతు తెలియచేయడాన్ని నిరసిస్తూ టిల్లర్‌సన్ తమ దేశంలోకి ప్రవేశించవద్దని నినాదాలు చేశారు. రాజకీయ, ఆర్థిక రంగాలు, అంతర్జాతీయ రంగంలోను టర్కీ ఎదుర్కొనే అన్ని రకాల సమస్యలకు అమెరికా సామ్రాజ్యవాదులే కారకులని నిరసనవాదులు విమర్శించారు. మా సైనికులను అమెరికా చంపివేసింది, కిల్లర్ టిల్లర్‌సన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు ప్రదర్శనకారులకు మధ్య పెనుగులాట జరిగింది. ఇటీవల కాలంలో అమెరికా-టర్కీ మధ్య ఏర్పడిన విభేదాలను పరిష్కరించుకునేందుకు టిల్లర్సన్ టర్కీలో పర్యటిస్తున్నారు.

ఇరుపక్షాల చర్చలు : టిల్లర్సన్ టర్కీ విదేశాంగ మంత్రి మెవలట్ కవోసొగ్లూతో గురువారం చర్చలు జరిపారు. అంతకు ముందు టిల్లర్సన్ టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్‌తోనూ చర్చలు జరిపారు. రెండు దేశాలమధ్య సాధారణ సంబంధాలు నెలకొల్పు కోవాలని ఈ చర్చల్లో అంగీకారం కుదిరినట్లు మెవ్‌లెట్ తెలిపారు. రెండు దేశాల మధ్య సంబంధాలు దిగజారడానికి గల కారణాలపై చర్చించేందుకు సంయుక్త యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని కూడా ఇరుపక్షాలు నిర్ణయించాయి. శుక్రవారం టిల్లర్ సన్ మెవ్‌లట్‌లు సంయుక్తంగా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెవ్‌లెట్ మాట్లాడుతూ సిరియాలో వందమందికి పైగా తమ పౌరులను అమెరికా దళాలు చంపివేశాయని ఇది తమకు అత్యంత ముఖ్యమైన సమస్యని అన్నారు. సిరియాలోని మన్‌బిజ్ నగరం నుంచి కుర్దిష్ దళాలను ఉపసంహరించుకుంటామని అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టిల్లర్సన్ మాట్లాడుతూ సిరియాలో తిరుగుబాటు దారులకు, కుర్దిష్‌లకు తమ తోడ్పాటు పరిమితమేనని చెబుతున్నారు. ఇటీవల టర్కీ దళాలు సిరియా అఫ్రిన్ ప్రాంతంలో దాడులు జరిపిన అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ తన సరిహద్దులను రక్షించుకునే హక్కు టర్కీకి ఉందని టిల్లర్సన్ అన్నారు.

బ్రెగ్జిట్ చర్చల్లో కార్మిక సమస్యల విస్మరణ

బ్రిటన్ కమ్యూనిస్టుల తీవ్ర విమర్శ

లండన్ : బ్రెగ్జిట్ చర్చల్లో కార్మిక సమస్యలను విస్మరిస్తున్నారని బ్రిటన్ కమ్యూనిస్టుల తీవ్రంగా విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో లండన్‌లో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ప్రధానకార్యదర్శి రాబర్ట్ గ్రిఫిత్స్ మాట్లాడుతూ కార్మిక వర్గ ప్రయోజనాలను గురించి ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. త్వరలో బ్రిటన్, యూరోపియన్ యూనియన్లు రెండవ దశ చర్చలు జరపనున్న నేపథ్యంలో ఆయన కార్మిక సమస్యలను చర్చించాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్యం నిర్వహి స్తున్న దేశాలు తమ సొంత వాణిజ్య ఆర్థిక, పారిశ్రామిక ,ఇమిగ్రేషన్ విధానాలను వదులుకోకుండానే తమ హక్కులను కాపాడు కుంటున్నాయి. ఇదే సమయంలో బ్రిటన్‌లో ఉన్న బడా వాణిజ్యవేత్తలు మాత్రం యూరోపియన్ యూనియన్‌లోని సింగిల్ మార్కెట్లో కొనసాగాలని కోరుకుంటున్నారు. ఎందుకంటే పెట్టుబడులు, వస్తువులు కార్మికులు స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం కావాలని ఆశిస్తున్నారు. తమకు అవసరమైన దేశాలను ఎంచుకొని ఆయా దేశాల్లో అవకాశాలను ఉపయోగించుకొని గరిష్ట లాభాలను పొందేందుకు వాణిజ్యవేత్తలు ప్రయత్నిస్తున్నారని గ్రిఫిత్స్ అన్నారు. భవిష్యత్‌లో లేబర్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకునేందుకు ఈయూ ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. ఎన్నికైన ప్రభుత్వాల ట్రేడ్ యూనియన్ల హక్కులను పరిమితం చేసేందుకు యూరోపియన్ కోర్టు తీర్పులు ఇస్తోందని ఆయన విమర్శించారు.



ముస్లిం దేశాలపై నిషిద్ధం రాజ్యాంగ విరుద్ధం

వాషింగ్టన్ : ఆరు ముస్లిందేశాలకు చెందిన ప్రజలు తమ దేశంలోకి ప్రవేశించరాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన నిషేధం రాజ్యాంగ విరుద్ధమని గురువారం ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తీర్పు చెప్పింది. ఇస్లాం మతంపై ద్వేషంతోనే ఈ నిషేధాన్ని విధించారని కోర్టు ప్రకటించింది. ట్రంప్ విధానానికి ఇది మరో షాక్. అమెరికా నాలుగవ అప్పీల్స్ సర్క్యూట్ కోర్టులో ధర్మాసనం ఈ తీర్పు చెప్పింది. తీర్పుకు అనుకూలంగా 9 మంది వ్యతిరేకంగా నలుగురు న్యాయమూర్తులు నిలిచారు. దేశంలో మత స్వేచ్ఛ, సహనం ఉన్నాయని అందువల్ల ఈ నిషేధం చెల్లదని కోర్టు తెలిపింది. గత డిసెంబరులో 9వ సర్క్యూట్ కోర్టు ట్రంప్ తన అధికార పరిధిని దాటి నిషేధం విధించినట్లుగా వ్యాఖ్యానించింది. ఛాద్, ఇరాన్, లిబియా, సోమాలియా,సిరియా, ఎమెన్‌ల నుంచి ప్రజలు అమెరికాలోకి ప్రవేశించరాదని విధించిన నిషేధంపై మేరీ ల్యాండ్ ఫెడరల్ జడ్జి ఇంజెక్షన్ జారీ చేశారు. నాలుగవ సర్క్యూట్ కోర్టు దానిని సమర్థిస్తూ తీర్పు చెప్పింది. నిషేధం విధించడం వల్ల మరింత హానికరమైన పరిణామాలు ఉంటాయని కోర్టు వ్యాఖ్యానించింది.

ప్రధాని న్యాయమూర్తి రోగర్ గ్రెగోరి మెజార్టీ న్యాయమూర్తులు తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. అమెరికా పౌరహక్కుల యూనియన్ డిప్యూటీ లీగల్ డైరెక్టర్ సిసిలియా వాంగ్ మాట్లాడుతూ కోర్టు తీర్పు తనను ఆశ్చర్యపరచలేదని అన్నారు. మత వ్యతిరేకమైన ప్రభుత్వ చర్యలను రాజ్యాంగం సైతం తిరస్కరిస్తుందని ఆమె అన్నారు.

ఉపాధి బూటకం

(మొదటిపేజీ తరువాయి)

ధ్రువీకరిస్తున్నాయి. మిగతా 88 శాతం మంది నిరుద్యోగుల దరఖాస్తులను తిరస్కరించారు. వాస్తవంగా పీఎంఈజీపీ పథకం 2008-09లో ప్రారంభమైంది. యువతకు స్వయం ఉపాధి కల్పన కోసం దీనిని తీసుకొచ్చారు. ఈ పథకం కింద 18 ఏళ్లకు పైబడిన నిరుద్యోగులు ఉపాధి కోసం రూ. ఐదు లక్షల నుంచి రూ. పది లక్షల వరకు, ఉత్పత్తి రంగమైతే రూ. పది లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు రుణాలు తీసుకోవచ్చు. ఈ పథకం కింద 90 శాతం వరకు రుణం మంజూరవుతుంది. ప్రాజెక్టు వ్యయం 25 శాతం, అర్బన్ ప్రాంతాల్లో 15 శాతం సబ్సిడీని ప్రభుత్వం సమకూరుస్తుంది. పీఎంఈజీపీ పోర్టల్ ప్రకారం 2017 ఏప్రిల్ నుంచి 2018 ఫిబ్రవరి 13 వరకు 4,03,988 మంది యువకులు ఉపాధిరుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 3,49,208 దరఖాస్తులు కలెక్టర్ల నేతృత్వంలో ఏర్పడిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీల ముందుకువచ్చాయి. అందులో 2,52,536 దరఖాస్తులను మంజూరుచేస్తూ బ్యాంకులకు పంపారు. వాటిలో కేవలం 49,721 దరఖాస్తులకు మాత్రమే ఆయా బ్యాంకు అధికారులు రుణాలకు అనుమతులిచ్చారు. బ్యాంకులు రుణ అనుమతికి నిరాకరించడంపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్(ఫిస్మో) ప్రధాన కార్యదర్శి భరద్వాజ స్పందించారు. బ్యాంకుల్లో ప్రాసెసింగ్ విధానం సరళతరంగా ఉండదని, దీన్ని నిరుద్యోగ యువత పూర్తి చేయలేకపోతుందని ఆయన వివరించారు. ఈ ప్రాసెస్‌లో ప్రధానంగా అవినీతి కీలకపాత్ర పోషిస్తున్నదని, అధికారులు పలు సాకులు చూపించడంతో నిరుద్యోగ యువతకు రుణాలు దక్కటం లేదని ఆయన తెలిపారు.

వాస్తవంగా బడ్జెట్‌లో కొంత మేరకు కేటాయింపులున్నా ప్రయోజనం కనిపించడం లేదు. నిరుద్యోగం, ఉపాధి అంశాల్లో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న మోడీ సర్కారు పీఎంఈజీపీ టార్గెట్‌ను గణనీయంగా పెంచింది. 2018 బడ్జెట్‌లో పీఎంఈజీపీకి రూ. 1,800 కోట్ల కేటాయించారు. 2017లో కేవలం రూ. 1,024 కోట్లే ఇచ్చారు. అంటే 2018లో రూ. 776 కోట్లు అధికంగా పెంచింది. 2018-19లో 7.04లక్షలమందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, గత బడ్జెట్‌లో 56,500 మైక్రో యూనిట్లు, 4.52 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యాలను నిర్దేశించింది. బడ్జెట్ కేటాయింపులు పెంచుకుంటూ మోడీ సర్కారు మురిసిపోతోంది.

కానీ యువతకు ఉపాధి ఏ విధంగా దొరుకుతుందో అర్థం కావటంలేదని నిరుద్యోగ సంఘాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. నరేంద్రమోడీ ప్రభుత్వం పథకాల గురించి ప్రచారం చేసుకోవడమే కాదు...దాన్ని సద్వినియోగం చేసుకునే మార్గదర్శకాలపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరమున్నది. స్వయం ఉపాధిపట్ల చిత్తశుద్ధి ఉంటే..యువత నిలదొక్కుకునేలా కేంద్రం చొరవ తీసుకోవాల్సిన అవసరముందని నిరుద్యోగ సంఘాలు డిమాండు చేస్తున్నాయి.

బ్యాంకు మోసాలు రెట్టింపు

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకులో జరిగిన భారీ మోసం కేసు ఒకటి. గత మూడేళ్ల కాలంలోనే మోసాల కేసులు 12,778 నమోదయ్యాయని ప్రభుత్వం అందించిన సమాచారమే తెలియజేస్తున్నది. ఈ సమాచారాన్ని ప్రభుత్వమే లోక్‌సభలో వెల్లడించింది. ప్రభుత్వరంగ బ్యాంకులలో మోసం కేసులు 8,622 నమోదుకాగా ప్రైవేటు బ్యాంకులలో 4,156 కేసులు నమోదయ్యాయి. బ్యాంకు సిబ్బంది పాత్ర కారణంగా 13శాతం మోసం కేసులు ఉన్నాయి. నాలుగు ప్రభుత్వరంగ బ్యాంకులలో ఏడాదికి 500కుపైగా మోసం కేసులు నమోదవుతున్నాయి. 15 బ్యాంకులలో 200కుపైగా కేసులు నమోదయ్యాయి. 2017 జనవరి-మార్చి మధ్యకాలంలో 5,200మంది బ్యాంకు ఉద్యోగులపైన చర్యలు తీసుకున్నట్లుగా లోక్‌సభలో ప్రభుత్వం తెలియజేసింది. ఇదే కాలంలో చెక్కులు, డెబిట్,క్రెడిట్ కార్డుల మోసాలకు సంబంధించి 4,000కుపైగా కేసులు నమోదయ్యాయని, ప్రతికేసులోనూ లక్షరూపాయలు.., ఆపైన మొత్తం ఉన్నదని ఒక ప్రశ్నకు సమాధానంగా లోక్‌సభలో ప్రభుత్వం తెలిపింది. నమోదైన ఈ కేసుల విలువ సుమారు రూ.200కోట్లు ఉండవచ్చునని అంచనా.

8న బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

పనితీరుపై వివిధ ఏజెన్సీలు ఇస్తున్న ర్యాంకింగులను పరిగణనలోకి తీసుకుని మెరుగుపరచు కోవాలని స్పష్టం చేశారు. కాలంచెల్లిన చట్టాలను రద్దు చేసి..కాలానుగుణంగా సరికొత్త విధానాలు రూపొందిస్తున్నామని, ఇది మనకు పరీక్షా సమయమని ముఖ్యమంత్రి చెప్పారు. సుస్థిర వృద్ధి, ప్రజల సంతృప్తి అంతిమ లక్ష్యంగా బడ్జెట్ రూపొందాలని మార్గదర్శనం చేశారు. ఎంతమేర నిధులు అవసరమో ప్రభుత్వ శాఖలు అంచనాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల్లో సంస్కరణలు తీసుకొస్తున్నా, కొన్ని శాఖల్లో ఇంకా ఆశించిన పురోగతి కనిపించడం లేదన్నారు. విద్యుత్, వ్యవసాయం, జలవనరులు తదితర శాఖలలో తీసుకున్న నిర్ణయాలు సానుకూల ఫలితాలనిచ్చాయని చెప్పారు. ఇదే విషయంలో మనకంటే ముందే సంస్కరణలు తెచ్చిన ఒడిశా రాష్ట్రం విఫలమైందని వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా పంచాయతీరాజ్ శాఖ ఎన్నో పురస్కారాలు దక్కించుకుందని చెప్పారు. జలవనరుల శాఖలో ప్రవేశపెట్టిన విధానాలు, చేపట్టిన కార్యక్రమాలతో భూగర్భజలాలు పెంచగలిగామని, దీంతో వర్షపాతం తక్కువ నమోదైనా వ్యవసాయ విద్యుత్ వినియోగం బాగా తగ్గిందన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఇంటర్నేషనల్ బెంచ్ మార్క్ చేరుకోవడానికి కృషి చేస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి- సీఐఐ భాగస్వామ్య సదస్సులో దీనిపై ప్రత్యేకంగా ఒక సెషన్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల మేరకు కేంద్రం నుంచి సక్రమంగా సాయం అందడం లేదని చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అన్ని వనరులు ఉన్నప్పటికీ వృద్ధిలో మాత్రం వెనుకబడి ఉన్నాయని, సమగ్ర దృష్టి, సరైన దృక్పథం లేకపోవడమే ఈ జిల్లాల వెనుకబాటుకు కారణమన్నారు. ఏపీని విజ్ఞాన భాండాగారంగా మలచాలనేదే తన లక్ష్యమని, ఇందుకోసం రాజీ పడేది లేదన్నారు. ఓడీఎఫ్ తరహాలో రాష్ట్రంలో పీహెచ్ఎఫ్ (పాట్ హోల్స్ ఫ్రీ)కి వెళ్లాలని నిర్దేశించుకున్నట్టు వెల్లడించారు. మార్చి తొలివారంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభించి 5న గవర్నర్ ప్రసంగం, 8న రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

త్రిసభ్య కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు పద్మనాభయ్య, చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో రెండు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నేటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు, ప్రత్యేక హోదాతోపాటు ఇటీవల బడ్జెట్‌లో కూడా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఏపీ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అదే సమయంలో కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరు అయోమయంగా ఉందని రామకృష్ణ తెలిపారు. ఈ నెల 18వ తేదీన విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై చర్చించడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నామన్నారు.

పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రానికి న్యాయం చేసేందుకు వివిధ రాజకీయ పక్షాలతో పాటు వివిధ హోదాల్లో పని చేసిన రిటైర్డ్ ఉన్నతాధికారులు ముందుకు వస్తున్నారని తెలిపారు. పాలకులు చేసిన తప్పులకు ప్రజలను శిక్షించారని, దీని పర్యవసానాలు కింది స్థాయిలో చాలా దారుణంగా ఉంటాయన్నారు.

ప్రజల ప్రమేయం లేకుండా రాష్ట్రాన్ని విభజించారని, న్యాయం జరగనప్పుడు ప్రభుత్వంపై కోపం వస్తుందన్నారు. ఏ ప్రాంతాన్నైనా దీర్ఘకాలం వెనుకబాటుతనం పీడిస్తే దేశ సమగ్రతకే ప్రమాదం ఏర్పడుతుందని, దీంతో ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్రం చెప్పాలని, ప్రజల్లో ఆశలు కల్పించి, కాదంటే అశాంతి రగులుతుందన్నారు. రిజర్వేషన్ల విషయంలో ఉత్తరాంధ్రలో రెండు జాతుల మధ్య ప్రభుత్వమే చిచ్చుపెట్టిందని పవన్‌కల్యాణ్ ఆరోపించారు. జేపీ, ఉండవల్లి, మధు, గౌతమ్‌లు మాట్లాడుతూ పవన్ అధ్వర్యంలో ప్రజలకు వాస్తవాలను తెలియజేసేందుకు వేదికను ఏర్పాటు చేయడం శుభపరిణామమని, ఈ అంశాలను నెలల తరబడి కాకుండా వారాల్లో పూర్తి చేసేందుకు అన్ని రకాలు ప్రయత్నాలు చేస్తామన్నారు. గత నాలుగు సంవత్సరాల్లో రెండు రాష్ట్రాల మధ్య ప్రజలు శాంతియుతంగా ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా సామరస్యంగా ముందుకు సాగడం మంచి పరిణామంగా భావించాలన్నారు. రెండు రాష్ట్రాల అభివృద్ధి కోసం అప్పటి విభజన చట్టంలో ఉన్న హామీలను నెరవేర్చేందుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని పక్షాలతో కలిసి ముందుకు సాగుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కేటాయించిన నిధులకు సంబంధించిన నివేదికను అధికారికంగా ప్రకటించాలని వారు డిమాండు చేశారు. ఈ పోరాటంలో అన్ని రాజకీయ పక్షాలు కలిసివచ్చి, ఏకాభిప్రాయంతో ముందుకు సాగి ప్రజలకు మేలు చేసేందుకు సహకరించాలని వారు ఆకాంక్షించారు.

నేడు 11 అంశాలపై చర్చ

రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు, ప్రత్యేక హోదా, బడ్జెట్ కేటాయింపులపై శుక్రవారంనాటి సమావేశంలో చర్చ జరిగింది. శనివారం రెండో దఫాలో రాష్ట్ర ఆర్థిక లోటు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు సమస్యలు, పన్నుల రాయితీ, రాష్ట్రంలో వివిధ సంస్థల ఏర్పాటు, రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కేంద్రం తీసుకున్న, తీసుకోవాల్సిన చర్యలు, ప్రత్యేక రైల్వే జోన్, ప్రత్యేక ప్రతిపత్తి లేదా హోదా, రాజధాని నిర్మాణ ఏర్పాటు వంటి 11 అంశాలపై శనివారం చర్చించనున్నారు. శనివారం కూడా వివిధ పార్టీల నాయకులతో పాటు మేధావులు సమావేశానికి హాజరవుతారని పవన్ తెలిపారు.

మహావిషాదం

(మొదటిపేజీ తరువాయి)



ములభాగల్‌తాలుకా, మణి కుమారుడు కేశవ(20) అయ్యింరెడ్డిపల్లి, వెంకటరాజు(25) అరిగేపల్లి చంద్రగిరిమండలం, అదే హెచ్చరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శివకుమార్(29)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టు నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి ప్రాంగణం మృతుల బంధువులు, గ్రామస్తుల ఆర్తనాదాలతో దద్దరిల్లింది. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ చౌడేశ్వరి ఆస్పత్రి వద్దకు చేరుకుని మృతుల బంధువులను ఓదార్చారు.

జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు, సబ్ కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ-2 చంద్రమౌళి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు అన్నివిధాలా సహాయం చేస్తామని తెలిపారు. 8 మంది కార్మికులు మృతికి కారకులైన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్పీ చెప్పారు. కాగా విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి అమరనాథరెడ్డి ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకుని బాధిత కుటుంబాలకు సహాయం చేస్తామని తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా : కలెక్టర్ ప్రద్యుమ్న

ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హేచరీస్‌లో మృతి చెందిన కుటుంబాలు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు, చంద్రన్న బీమా రూ.5 లక్షలు, హేచరీస్ తరఫున రూ.15 లక్షలు కలిపి రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియాను జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న ప్రకటించారు. మృతుల్లో కర్ణాటకవాసి ఒకరికి చంద్రన్న బీమా వర్తించకపోవడంతో హేచరీస్ తరఫున రూ.15 లక్షల పరిహారం అందజేస్తారు. కుటుంబ సభ్యులకు పెన్షన్, పిల్లలను చదివిస్తామని తెలిపారు. హేచరీస్‌పై విచారణ జరుగుతుందని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : సీపీఐ డిమాండు

మొరం గ్రామంలోని హేచరీస్‌లో కార్మికులు మృతి చెందిన ఘటనకు బాధ్యులయిన వారిపై చర్యలు చేపట్టి, అరెస్టు చేయాలని సీపీఐ డివిజన్ నాయకుడు చెన్నకేశవులు డిమాండు చేశారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలన్నారు.

కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఎకరం పొలం ఇవ్వాలని డిమాండు చేశారు. మంజుల, గుర్రప్ప, యుగంధర్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

కాగా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ డిమాండు చేశారు. ప్రభుత్వం తక్షణం సహాయం క్రింద రూ.5 లక్షలు, రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట సమన్వయకర్త సివికుమార్, వైసీపీ నాయకులు మండీ సుధ, చెంగారెడ్డి, ప్రహల్లాద, శశిధర్, రవి, ఆదిశేఖర్ ఉన్నారు.

త్వరలో కేంద్ర నిధులపై శ్వేతపత్రం

మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రానికి కేంద్రమిచ్చిన నిధులపై త్వరలో శ్వేతపత్రం ఇస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ నిధులపై బీజేపీ నేతలతో చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ప్లానింగ్ బోర్డు కమిషన్ వైస్ చైర్మన్ కుటుంబరావుతో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ బీజేపీ శాఖ అధ్యక్షులు, ఎంపీ హరిబాబు ఢిల్లీలో మరోసారి నిర్వహించిన విలేకరుల సమావేశంలో గతంలో ప్రకటించిన వివరాలనే తెలిపారన్నారు. తిరుపతి ఎన్నికల బహిరంగ సమావేశంలో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్న ప్రధాని మోడీ ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ప్రధాన మంత్రి ఆ హామీకి కట్టుబడి ఉండాలని మంత్రి కోరారు. 7 ఇన్‌స్టిట్యూట్‌లకు గానూ 5 మాత్రమే ప్రారంభమయ్యాయని, వాటి తరగతులు సొంత భవనాల్లో జరగడంలేదన్నారు. కర్నూలుకు కేటాయించిన తరగతులు తమిళనా డులోని కాంచీపురంలో నిర్వహిస్తున్నాం న్నారు. గిరిజన విశ్వవిద్యాలయం, సెంట్రల్ వర్శిటీకి ఇంత వరకూ కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలపలేద న్నారు. 7 ఇన్‌స్టిట్యూట్లకు 2015-16లో రూ.103 కోట్లు, 2016-17లో రూ.158 కోట్లు, 17-18లో రూ.260 కోట్లు, రాబోయే 18-19 బడ్జెట్ లో రూ.245 కోట్లు మాత్రమే కేటాయిం చారని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఈ విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు విలువ చేసే 2,401 ఎకరాలు కేటాయించిం దన్నారు. అదే సమయంలో ఈ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.72 కోట్ల వరకూ వెచ్చించిందన్నారు. ఏపీకి ఎయిర్ పోర్టు, దూరదర్శన్, పాస్ పోర్టు కేంద్రాలు ఇచ్చినట్లు బీజేపీ నేతలు చెబుతుండటం హాస్యాస్పదమని, ఏ రాష్ట్రానికయినా వాటిని మంజూరు చేయడం సాధారణ విషయమన్నారు. నేటి వరకూ రాష్ట్రానికి కేంద్రమిచ్చిన నిధులపై త్వరలో 4, 5 శ్వేతపత్రాలు ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. అదనంగా తామేమీ కోరడం లేదని పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలుచేయాలని మాత్రమే కోరుతున్నామని మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు.



సమగ్ర రవాణా వ్యవస్థపై
జపాన్‌లో సీఆర్‌డీఏ అధ్యయనం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : అమరావతి రాజధాని ప్రాంతంలో సమగ్ర రవాణా వ్యవస్థ ప్రణాళికను అమలు చేసేందుకు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం జపాన్‌లో పర్యటించింది. టోక్యోలోని పోలీస్ డిపార్ట్‌మెంట్ మెట్రోపాలిటన్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్‌ను శుక్రవారం ఈ బృందం సందర్శించి, అధికార బృందంతో ట్రాఫిక్ మేనేజిమెంట్ విధానం పై సమీక్షించింది. టోక్యోలో ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దినట్లు అక్కడి అధికారులు వివరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నలింగ్, కంట్రోల్, ఆయా విభాగాల సమన్వయం, ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే వాటిని ఏవిధంగా పరిష్కరిస్తారు, మెట్రో, బస్ రూటింగ్ పర్యవేక్షణ వ్యవస్థలను సీఆర్‌డీఏ బృందం పరిశీలించింది. అనంతరం ఎంబసీ ఆఫ్ ఇండియా అంబాసిడర్‌తో సమావేశమైంది. అమరావతి అభివృద్ధిలో జపాన్ వాసులు పెట్టుబడులను పెట్టేందుకు ప్రోత్సహిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ బృందంలో విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్, సీఆర్‌డీఏ ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్టేషన్ ప్రిన్సిపల్ ప్లానర్ ఎన్ఆర్ అరవింద్ తదితరులున్నారు. ఈ బృందం 19 వరకూ జపాన్‌లో పర్యటించనుంది.

శాంతి బోధనలు అవసరం : అఖిల ప్రియ

విశాలాంధ్ర అమరావతి : బుద్ధుడి శాంతి బోధనలు మానవాళికి ఎంతో అవసరమని మంత్రి అఖిల ప్రియ వెల్లడించారు. విజయవాడలో బౌద్ధ ధర్మానికి విస్తరిం చడానికి బుద్ధ విహారం ఏర్పాటు చేయాలని, ఇందుకోసం స్థలాన్ని పర్యాటకశాఖ తరపున కేటాయించాలని ధమ్మధజ భంతేజీ, గోళ్ల నారాయణరావు మంత్రి అఖిల ప్రియను కోరారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి భూమా అఖిల ప్రియతో బౌద్ధ గురువు ధమ్మధజ భంతేజీ, విజయవాడ బుద్ధ విహార ప్రతినిధి గోళ్ళ నారాయణరావు తదితరులు సమావేశ మయ్యారు. విజయవాడ నగరంతో పాటు అమరావతి, భట్టిప్రోలు, ఘంటశాల వంటి క్షేత్రాలకు బౌద్ధుల రాక పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. బుద్ధుడి బోధనలతో ముద్రించిన సద్ధర్మ ఉపోస్త క్యాలెండర్‌ను అఖిల ప్రియ ఆవిష్కరించారు. బుద్ధ ధర్మ సంఘం తరపున నరేంద్ర నాథ్ మంత్రికి కాలమ సూక్తం, ధర్మావరణం, సమ్మావాచ పుస్తకాలను బహూకరించారు.

తెలంగాణ టూరిజం కాన్ క్లేవ్‌కు ఆహ్వానం..

ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణా ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టూరిజం కాంక్లేవ్ -2018కు అతిథిగా రావాలని ఏపీ పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియను ఆరాష్ట్ర ఫ్యాప్సీ డైరెక్టర్ పి. వైదేహి, ఛైర్మన్ వాల్మీకి హరికృష్ణ ఆహ్వానాన్ని అందిం చారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య పర్యా టకం అభివృద్ధికి పరస్పర సహకారాన్ని కోరుతున్నామని డైరెక్టర్ వైదేహి వివరించారు. సెప్టెంబరులో నిర్వహించే ఏపీ టూరిజం కాంక్లేవ్ కు తెలంగాణా నుంచి తాము పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు.

బడ్జెట్‌లోనే అడగండి

సీఎం హామీలు, ప్రజల ఫిర్యాదుల పనులకు నిధులిస్తాం

అదనం కావాలంటే...మూడో త్రైమాసికంలోనే..

ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు



విశాలాంధ్ర-అమరావతి : మొదటి త్రైమాసికంలో అదనపు బడ్జెట్ అడగవద్దని, ముఖ్యమైన ప్రాజెక్టులు ఏమైనా ఉంటే బడ్జెట్‌లోనే పెట్టుకోవాలని, అదనపు బడ్జెట్ చివరి త్రైమాసికంలోనే ఇస్తామని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అధికారులకు స్పష్టం చేశారు. సచివాలయంలో శుక్రవారం వివిధ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రి సమీక్షించారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులను అవసరాన్ని బట్టి ఇతర పథకాలు, ప్రాజెక్టులకు వినియోగించుకునే వెసులుబాటు ఇచ్చామన్నారు. అయితే స్థిరాస్తులకు కేటాయించిన నిధులను రెవెన్యూ ఖర్చులకు మళ్లించకూడదని ఆదేశించారు. నిధులు ఖర్చు చేసిన తరువాత మాత్రమే అదనపు నిధులు అడగాలన్నారు. ప్రతి శాఖ ముఖ్యమంత్రి హామీలను, ఇంటింటికి కార్యక్రమంలో ప్రజల ఫిర్యాదులకు సంబంధించిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని, అందుకు అవసరమైన నిధులు ఇస్తామని చెప్పారు. రోడ్లు, తాగునీరు, భూగర్భ మురుగునీటిపారుదల పనులను పూర్తి చేయాలని చెప్పారు.

పంచాయతీలు, మున్సిపాలిటీలలో అప్పటికి ఉన్న జనాభా ప్రాతిపదికన నీటి పథకాలను రూపొందిస్తారని, జనాభా పెరిగిన తరువాత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పథకాలను చేపట్టాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే పథకాలకు నిష్పత్తి ప్రకారం ఎంత ఖర్చయినా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మానవాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో ఉంచాలని, డాక్టర్ పోస్టులను త్వరగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో 80 శాతం సీసీ రోడ్లు పూర్తి అయినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యునికేషన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. ఐటీ విభాగంలో వచ్చే ఏడాది కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నామని, జీఎస్‌టీ, విద్యుత్, ఉత్పత్తి ఇన్సెంటివ్స్ వంటి రాయితీలు ఇవ్వవలసి ఉన్నందున అదనపు నిధులు కేటాయించాలని మంత్రి కోరారు. వైద్య ఆరోగ్య సేవలు ప్రజలందరికీ అందుబాటులో ఉన్నట్లు ఆ శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పారు. తాము చేపట్టిన ప్రాజెక్టుల ద్వారా ఖరీఫ్‌లో కోటి ఎకరాలకు నీరందించినట్లు జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. ఎన్టీఆర్ సుజల పథకానికి, లెడ్ బల్బులకు నిధులు పెంచమని పంచాయతీరాజ్ శాఖ అధికారులు కోరారు. ఐటీ, ఎలక్ట్రానిక్ పాలసీలతోపాటు సైబర్, డీటీపీ వంటి కొత్త పాలసీలు ప్రకటించామని, ఈ-ప్రగతి, స్టార్ట్ అప్ కంపెనీలు, మౌలిక వసతులు, సబ్సిడీలు తదితరాలకు అవసరం ఉన్నందున తమ శాఖకు ఎక్కువ నిధులు కేటాయించాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్స్ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ కోరారు. ఆయాశాఖల అధికారులు తమ శాఖకు అవసరమైన నిధులు ఇవ్వాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రావలసిన నిధులు, నరేగా, ఇతర కేంద్ర ప్రభుత్వ నిధులు, నాబార్డు రుణాలు, వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్, బీమా, 104 ఉద్యోగుల జీతాలు, మహాప్రస్థానం పథకం, తెలుగు గంగ తదితర అంశాలు కూడా చర్చకు వచ్చాయి. సమావేశంలో ఆయాశాఖల అధికారులు ఎం.రవిచంద్ర, పూనం మాలకొండయ్య, కె.ఎస్.జవహర్ రెడ్డి, శశిభూషణ్ కుమార్, రామాంజనేయులు, కె.వి.వి.సత్యనారాయణ, హేమా మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి చంద్రగ్రహణం: వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు చంద్రగ్రహణం పట్టిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయాలను అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. తాను వ్యాపారం మానేశానని, వ్యాపారాలతో తనకెలాంటి సంబంధం లేదని చంద్రబాబు చెబుతున్నారని, కానీ చంద్రబాబు భార్య, కుమారుడు, కోడలు వ్యాపారాలు చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. దీంతో పాటు చంద్రబాబు తన తల్లి పేరు మీద పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేస్తున్నా, వ్యాపారాలతో తనకు సంబంధం లేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. శుక్రవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంవత్సరం లోపు ఏదైనా స్థానం ఖాళీ అయితే ఎన్నికలు అక్కర్లేదని ఎన్నికల కమిషన్ చెబుతోందని, కానీ ఇప్పుడు ఈసీ రూల్స్ ప్రకారం 15 నెలల ముందుగానే ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న వైఎస్ఆర్ సీపీ ఎంపీలం రాజీనామా చేస్తున్నామన్నారు. ఎంపీల పదవికాలం జూన్ 6వరకు ఉంటుందని, ఎన్నికల చట్టం రూల్స్ ప్రకారం ముందస్తు ఎన్నికలకు వెళతామని పేర్ని నాని స్పష్టం చేశారు. వైసీపీ ఎంపీల రాజీనామా ప్రకటనతో టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, అందుకే హోదా కోసం చేస్తున్న ఎంపీల రాజీనామా అంశాన్ని తప్పుదారి పట్టిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. నిరుద్యోగుల భవిష్యత్‌కు ప్రత్యేక హోదా పునాదిలా పనికొస్తుందని, హోదా వల్ల పెట్టుబడులు వస్తే పలు కంపెనీల్లో వేల, లక్షల ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ ఎంపీలు మంత్రులుగా కొనసాగుతున్నా, ఏపీ ప్రయోజనాల కోసం పోరాడకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం తాము సైతం అసహనం వ్యక్తం చేస్తున్నట్లు డ్రామాలాడుతున్నారని నాని విమర్శించారు.

బాబుకు ప్రజలే గుణపాఠం చెబుతారు...

వైసీపీ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధనంలో విఫలమైన సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వైసీపీ రాష్ట్ర నాయకుడు ఎమ్మెల్సీ గోపాలరెడ్డి పేర్కొన్నారు.విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా 15 ఏళ్లు తెస్తామంటూ రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేడు ఏ అధికారంతో ప్యాకేజీకి ఆయన ఒప్పుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. ఉద్యోగస్తులకు చెందిన 11వ పీఆర్‌సీని ఈ ఏడాదిలో వేయాల్సి ఉన్నప్పటికీ, దానిపై ప్రభుత్వం ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి రాగానే, ఉద్యోగులకు పాత పెన్షను విధానాన్ని అమలు చేస్తామని పార్టీ అధినేత జగన్ ప్రకటించారని తెలిపారు.



55,400 ఎంటీ సామర్థ్య గోదాముల పూర్తి

ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎల్‌విఎస్‌ఆర్‌కే ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 55, 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను ఏడాదిలో పూర్తి చేశామని ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎల్‌వీఎస్‌ఆర్‌కే ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం విజయవాడ కానూరు వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో 193వ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాలోని పొందూరులో 10వేల మెట్రిక్ టన్నుల గోదాములను, భామిని-10వేలు, నెల్లూరు జిల్లాలోని చంద్రశేఖరపురం-14వేలు, కావలి-3వేలు, ప్రకాశంజిల్లా పర్చూరు-5వేలు, విశాఖపట్నం జిల్లాలోని పీఎస్ బోనంగి-10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించామన్నారు. గుంటూరుజిల్లా ఎడ్లపాడులోని స్పైసెస్ పార్కులో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో మిర్చి, పసుపు కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని వివరించారు. పట్టిసీమ నుంచి కృష్ణాడెల్టాకు నీరు రావడంతో గోదాముల ఏర్పాటుకు మరింత డిమాండు నెలకొందన్నారు. రాష్ట్రంలో మరో 3.5లక్షల మెట్రిక్ సామర్థ్యంగల గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశానికి మేనేజింగ్ డైరెక్టర్లు కేవీ రమణ, డైరెక్టర్లు బీవీఎన్ మణిశంకర్ నాయుడు, మెట్ల వెంకట రమణ, గంగోడు నాగేశ్వరరావు, డి.రాజవర్ధన్‌రెడ్డి, ఎన్‌టీ చౌదరి, శామ్యూల్ ప్రవీణ్‌కుమార్, దాస్ హాజరయ్యారు.

కేంద్రం మెడలు వంచైనా ప్రత్యేక హోదా సాధిస్తాం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : కేంద్రం మెడలు వంచైనా సరే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించి తీరుతామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీపీఐ 24వ జిల్లా మహాసభలను స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ప్రజానాట్య మండలి కళాకారులు ప్రజాకళాకారులు గరికపాటి రాజారావు విగ్రహానికి పూలమాలలు చేసి విప్లవ గీతాలను ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముప్పాళ్ల మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారని, ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను వంచించాయని దుయ్యబట్టారు. సీపీఐ, వామపక్షాల పిలుపు మేరకు ఈనెల 8న నిర్వహించిన బంద్ విజయవంతం కావడమే ప్రత్యేక హోదాపై ప్రజల ఆకాంక్షకు నిదర్శనమన్నారు.పోలవరం ప్రాజెక్టు కోసం స్థలాలు ఇస్తున్నా నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించడంలో ప్రభుత్వాలు జాప్యం చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. రాష్ట్రానికి లోటు బడ్జెట్‌ను పూడ్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మార్చి 5 నాటికి కేంద్రం దిగిరాకపోతే పోలవరం నిర్వాసితులు, తర్వాత ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఢిల్లీలో నిర్వాసితులతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కోసం ఏఐటీయూసీ నిరంతర పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఇప్పటివరకూ చేసిన అనేక ఉద్యమాల కారణంగా వచ్చిన ఫలితాలను సమీక్షించుకుంటామన్నారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 6 నుంచి 10 వరకూ కడపలో జరుగుతాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పని తీరుపై చర్చ జరుగుతుందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతిఆయోగ్‌ను ప్రవేశపెట్టిన నరేంద్ర మోడీ కారణంగా దేశ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దళితులను కుక్కలుగా ప్రకటించిన వారిని సమర్థించిన మోడీని గద్దెదించడమే తక్షణ కర్తవ్యమన్నారు. మార్చి 5న టీడీపీ, ఏప్రిల్ 5న వైసీపీ ఎంపీల రాజీనామా నాటకాలకు తెరలేపారని దుయ్యబట్టారు. జగన్ ప్రతిపక్షంలా వ్యవహరిం చడం లేదని, చట్ట సభల్లో కమ్యూనిస్టులు ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.రవీంద్రనాథ్, నగర కార్యదర్శి నల్లా రామారావు, పార్టీ కార్యవర్గ సభ్యులు తోకల ప్రసాద్, నక్కా కిషోర్, మండా దుర్గా ప్రసాద్, కె.సత్తిబాబు, వంగమూడి కొండలరావు, జుత్తుగ కుమార్, దేవ రాజేంద్ర ప్రసాద్, కె.మంగరాజు, ఎం.నాగమణి, నల్లా భ్రమరాంబ, పి.సత్యనారాయణ, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల కోసం గృహమిత్రలు ...

విశాలాంధ్ర అమరావతి : గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులను,గృహనిర్మాణ వర్కు ఇన్స్పెక్టర్లను అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇందుకోసం10వ తరగతి విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతను గృహమిత్రలుగా నియమించేందుకు పీడీలు వారి అభిప్రాయాలను తెలియచేయాలని మంత్రి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డెరెక్టర్లతో గృహనిర్మాణ పథకాలపై సమీక్షించారు. వచ్చే జూన్ 8నాటికి రాష్ట్రంలో 5లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు,గ్రామీణ గృహ నిర్మాణ శాఖా మంత్రి కాలవ శ్రీనివాసులు ఆశాఖ అధికారులను ఆదేశించారు. 2016-17 మంజూరు చేసిన ఇళ్లను ఏప్రిల్ నాటికి,2017-18లో మంజూరైన ఇళ్లన్నిటినీ జూన్ లోగా పూర్తి చేయడానికి వీలుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎన్టీఆర్ గృహనిర్మాణం పథకం అమలులోకి రాక ముందు చేపట్టిన ఇళ్లన్నింటినీ నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలని, నిర్మాణం పూర్తి చేసిన ఇళ్లకు లబ్దిదారులతో ఫొటోలు తీసి జియో ట్యాగింగ్ పూర్తిచేసి ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలన్నారు.పూర్తయిన ఇళ్లకు బిల్లులు చెల్లించడంలో ఎలాంటి జాప్యం చేయవద్దని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో గృహనిర్మాణ సంస్థ సీఈ మల్లికార్జున్, ఎసీఈలు శ్రీరాములు,వెంకట రెడ్డి, జీయంలు సాయినాథ్,భాస్కర్,వివిధ జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక హోదా- ఆంధ్రుల హక్కు

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌డీ అఫ్సర్, ఎన్.లెనిన్‌బాబు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యశాఖ : కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజన చేసిన నేపథ్యంలో పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక హోదా, విభజన హామీలు ఇచ్చిన వాటిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌డి అఫ్సర్, ఎన్.లెనిన్‌బాబు మండిపడ్డారు. శుక్రవారం గుంటూరు కొత్తపేట భగత్‌సింగ్ విగ్రహం వద్ద అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్సర్, లెనిన్‌బాబు మాట్లాడుతూ, నూతన రాజధాని నిర్మాణం కోసం కేంద్రం అరకొర నిధులు విడుదల చేయడం దారుణమని మండిపడ్డారు. పోలవరం నిర్మాణ పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ సరైన నిధులు విడుదల చేయకుండా తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలలో నూతన పరిశ్రమలు, కేంద్రీయ విద్యాసంస్థల స్థాపన అంశాలపై నిర్లక్ష్యంగా ఉందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రమైన అన్యాయం చేసిన బీజేపీ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల సత్తా చూపించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీలు పార్లమెంట్‌లో పోరాడాలని, ఇక్కడ విద్యార్థులు, యువకులు, కార్మికులు అండగా ఉంటారని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుబ్బారావు, జి.రంగన్నలు ప్రసంగించారు. ఈ ధర్నాలో గుంటూరు జిల్లా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.సుబ్బా రావు, వి.సాగర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు యు.కరుమంచి, సంతోష్, అరుణ్‌కుమార్, పి.నరేష్, బి.ప్రభాకరరావు, పి.గోపి, అప్పన్న, అమర్‌నాథ్, పులిశేఖర్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇక డిజిటల్ రిజర్వేషన్ చార్టులు

తెలుగు రాష్ట్రాల్లో 34 రైల్వేస్టేషన్ల ఎంపిక

పైలెట్ ప్రాజెక్టుగా మార్చి 1 నుంచి అమలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కాగిత రహిత పాలనలో భాగంగా రిజర్వేషన్ చార్టులను రైల్వేస్టేషన్లు, రైళ్లకు అతికించే విధానానికి రైల్వే స్వస్తి పలకనుంది. దేశవ్యాప్తంగా వివిధ రైళ్లలో బెర్తులు, సీట్లను రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణీకుల సౌకర్యార్థం రిజర్వేషన్ చార్టులను రైలు బోగీలకు అతికించేవారు. కార్యాలయంలో ఫైలింగ్ సహా నాలుగైదు సెట్లలో ఈ చార్టులను తీసేందుకు రైల్వేశాఖ టన్నుల కొద్దీ కాగితాన్ని వినియోగించేది. అయితే ఈ విధానానికి స్వస్తి చెప్పి డిజిటల్ చార్టులను తీసుకురావాలని రైల్వేమంత్రిత్వశాఖ ఏడాది క్రితం నిర్ణయించింది. తొలుత దేశ రాజధాని న్యూఢిల్లీ సహా హజరత్ నిజాముద్దీన్, ముంబై సెంట్రల్, చెన్నై సెంట్రల్, హౌరా, సెల్దా స్టేషన్లలో మూడు నెలల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలించి చూసింది. ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దేశంలోని ఏ1, ఏ, బీ కేటగిరి స్టేషన్లలో మార్చి 1వ తేదీ నుంచి ఆరు నెలలపాటు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా మొత్తం 408 స్టేషన్లను ఎంపిక చేయగా తెలుగు రాష్ట్రాల్లో 34 స్టేషన్లు ఉన్నాయి. వీటిలో సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం.. ఇలా అనేక స్టేషన్లలో ప్లాట్‌ఫారాలపై డిజిటల్ విధానంలో రిజర్వేషన్ చార్టులను ప్రదర్శించనున్నారు. ఆయా రైళ్లకు చేయించుకున్న రిజర్వేషన్‌కు సంబంధించి కోచ్, బెర్తుల నెంబర్లతో కూడిన వివరాలను ప్లాస్మా టీవీల్లో ప్రయాణీకులు చూడవచ్చు. ఈవిధంగా పైలెట్ ప్రాజెక్టులో ప్లాట్‌ఫారాలు, రైలు బోగీలకు కాగితాలను అతికించే విధానానికి అధికారులు త్వరలో స్వస్తి చెప్పనున్నారు.



ఎంపికైన స్టేషన్లు ఇవే.. : ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి,సత్యసాయి ప్రశాంతి నిలయం, పలాస, శ్రీకాకుళంరోడ్, విజయనగరం, అనంతపూర్, అనకాపల్లి, భీమవరంటౌన్, చీరాల, కడప, ఏలూరు, గూడూరు, గుంతకల్, గుంటూరు, కాకినాడ టౌన్, కర్నూలుటౌన్, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, రేణిగుంట, సామర్లకోట, తాడేపల్లిగూడెం, తెనాలి, తుని. తెలంగాణాలో సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, కాజీపేట, ఖమ్మం,మంచిర్యాల, నిజామాబాద్, వరంగల్.

రైల్వేశాఖ దృష్టిలో ఇంకా ఉమ్మడి రాష్ట్రమే

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి దాదాపు నాలుగేళ్లు కావస్తోంది. అయినప్పటికీ రైల్వేమంత్రిత్వశాఖ దృష్టిలో తెలంగాణ లేకపోవడం గమనార్హం. డిజిటల్ రిజర్వేషన్ చార్ట్‌ల విధానాన్ని అమలు చేసేందుకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన స్టేషన్ల జాబితాలో తెలంగాణలోని స్టేషన్లను ఇంకా ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నట్లుగా పేర్కొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 34 స్టేషన్లను ఏపీలో ఉన్నట్లు జాబితాలో పొందుపరచింది.

పార్వతీపురం పోస్టల్ బీమాకు జాతీయ రికార్డు

విశాలాంధ్ర-మక్కువ : విజయనగరం జిల్లా పార్వతీపురం డివిజన్ తపాలశాఖ జనవరిలో 1800 మంది ఖాతాదారుల నుంచి రూ 1.49 కోట్లు ప్రీమియం వసూలుచేసి జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి పొందిందని ఆ శాఖ పార్వతీపురం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ అధికారి జె.ప్రసాద్‌బాబు తెలిపారు.

కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన స్థానిక ఎస్‌ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి మనోజ్‌సేన సూచనలమేర ఈ పాలసీల కోసం పార్వతీపురం, అరకు, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులను కలిశామన్నారు. పౌర విమానశాఖ మంత్రి పి. అశోక్‌గజపతిరాజు, ఎంపీ కొత్తపల్లిగీత, శ్రీకాకుళం ఎంపీ కె. రామ్మోహన్‌నాయుడు తపాలాభీమాకు సాయం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. దేశంలో మార్చి 27న ప్రారంభం కానున్న 626 పోస్టల్ పేమెంట్ బ్యాంకుల్లో పార్వతీపురం, విజయనగం, శ్రీకాకుళంలో కూడా



ఎస్పీ ప్రసాద్ బాబు

ప్రారంభం అవుతాయని, పార్వతీపురం, చీపురుపల్లిలో ఇప్పటికే ఏటీఎంలు సేవలు అందిస్తున్నాయన్నారు. ఆన్‌లైన్ సౌకర్యం కల్పించేందుకు త్వరలో పెదబొండపల్లి సబ్ పోస్టాఫీసును బంద లు ప్పికి మార్పు చేస్తామని ప్రసాదుబాబు వెల్లడించారు. కార్యక్రమంలో సాలూరు ఐపీవో కేఎం ఎంస్ కుమార్, మక్కువ ఎస్‌పీఎం, జిరాధ, బీవోల పోస్టు మాస్టర్లు పాల్గొన్నారు.

21న డీఎల్-కామర్స్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ల(డీఎల్) భర్తీ ప్రక్రియలో భాగంగా ఈ నెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు కామర్స్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది.రాత పరీక్షల్లో మార్కుల ఆధారంగా ఇద్దరు అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు.విజయవాడ బందరురోడ్డులోని ఏపీపీఎస్సీ కమిషన్(సెకండ్ ఫ్లోర్) కార్యాలయానికి సకాలంలో అభ్యర్థులు హాజరు కావాలని కమిషన్ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.ఇప్పటికే అర్హులైన అభ్యర్థులకు కాల్‌లెటర్లను పంపారు.

కట్టుదిట్టంగా 'లింగ నిర్ధారణ' చట్టం అమలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో లింగనిర్ధారణ ఎంపికలు కొనసాగకుండా అమలులో ఉన్న చట్టాన్ని మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.మాలకొండయ్య శుక్రవారం జీవో నంబరు-10ని విడుదల చేశారు.ప్రొహిబిషన్ ఆఫ్ సెక్స్ సెలక్షన్ చట్టం 19(ఏ)ను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని జిల్లాల వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ ఎంపికలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పొరుగు రాష్ట్రాల్లో..
ఏపీ టెట్‌కు 24 పరీక్షా కేంద్రాలు

మొత్తం 183 పరీక్షా కేంద్రాలు-ఏపీలో 159 ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)కు ఇతర రాష్ట్రాల్లో 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఈ నెల 21 నుంచి మార్చి 3 వరకూ టెట్ పేపర్-1,2,3 పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు మొత్తంగా 183 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు.ఇందులో రాష్ట్రంలోని 13 జిల్లాలకు 159 కేటాయించారు.ఆంధ్రప్రదేశ్‌కు సమీపంలోని చెన్నయ్, బెంగుళూరు, హైదరాబాద్ నగరాలలో 24 పరీక్షా కేంద్రాలు కేటాయించారు.ఇందులో హైదరాబాద్-7, బెంగుళూరు-10, చెన్నయ్-7 వున్నాయి.పరీక్షా కేంద్రాల కొరత కారణంగా ఏపీకి చెందిన దాదాపు 15వేల మంది విద్యార్థులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి పరీక్ష రాయాల్సి వుంది. టెట్ పేపర్-1,2,3 పరీక్షలకు మొత్తంగా 4,46,833 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.ఇందులో ఇప్పటివరకూ దాదాపు 4లక్షల మంది వరకూ హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడింగ్ చేసుకున్నట్లు తెలిసింది.పొరుగు రాష్ట్రాలలో పరీక్షా కేంద్రాలపై ఆసక్తి చూపని అభ్యర్థుల కోసం ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించింది. వారంతా ఏపీలో కోరిన జిల్లాల్లో పరీక్షా కేంద్రం ఎంపికకు అవకాశం కల్పించిన విషయం విదితమే.ప్రతిరోజూ రెండు విడతలుగా కొనసాగే టెట్ పరీక్షలకు దాదాపు 52వేల మంది అభ్యర్థులు హాజరవుతారని భావిస్తున్నారు.

సంపాదకీయం

పీఎన్‌బీ విలాపం

జనం సొమ్ము హారతి కర్పూరంలా మార్చడంలో బ్యాంకులు, ప్రభుత్వాలు పోటీపడి పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది. గత అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్వని వ్యవస్థాగత అలసత్వమే కుంభకోణాల పరంపర కొనసాగడానికి ప్రధాన కారణం. దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణం వెలుగులోకి రావడం సామాన్యులను దిగ్భ్రాంతిపరుస్తోంది. బ్యాంకర్లతో కుమ్మక్కై స్టాక్‌మార్కెట్ కుంభకోణానికి పాల్పడిన హర్షద్ మెహతా మోసం, ఖాతాలో పైసా లేకుండా పే ఆర్డర్లతో బ్యాంకుల్ని బురిడీ కొట్టించిన కేతన్ పరేఖ్ చౌర్యం, కోట్లకు కుచ్చుటోపీ పెట్టి లలిత్ మోడీ, విజయ్ మాల్యాలు విదేశాలకు గుట్టుచప్పుడు కాకుండా పారిపోయిన నేరం.. ఇప్పుడు ఇవన్నీ నీరవ్ మోడీ ముందు దిగదుడుపు అయ్యాయి. స్టేట్ బ్యాంకు తర్వాత రెండో అతి పెద్ద బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)కి వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన బంధువులు బ్యాంకు అధికారులతో చేతులు కలిపి రూ.11,300 కోట్లకుపైగా కుచ్చుటోపీ పెట్టారు. బ్యాంకులో రూ.280 కోట్ల మేర మోసం జరిగిందన్న ఫిర్యాదు మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థ చేపట్టిన విచారణతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది పీఎన్‌బీ ఆర్జించిన లాభానికి ఇది ఎనిమింతలు ఎక్కువ. నకిలీ బ్యాంకు గ్యారంటీలతో పీఎన్‌బీ ముంబై శాఖ నుంచి ఈ మొత్తాన్ని దోచేశారు. గతంలో విజయ్ మాల్యా రూ.9వేల కోట్ల రుణాల్ని ఎగవేసి విదేశాలకు పారిపోతే, దాన్ని మించి చేతివాటంతో నీరవ్ మోడీ ఆయన బాటనే అనుసరించారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు జనాన్ని భ్రమల్లో ముంచెత్తుతున్నాయి. వాస్తవానికి 80వ దశకం నుంచే బ్యాంకుల కుంభకోణాలు ప్రారంభమయ్యాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో పూడ్చాల్సిన కంతల్ని అలానే యథేచ్ఛగా వదిలేయడం, సరైన పర్యవేక్షణ కొరవడడం వల్లే ఈ ఎగవేతల పరంపర జోరందుకొంది. నీరవ్ మోడీ బ్యాంకులను అత్యంత సులభంగా మోసగించిన తీరు మన బ్యాంకింగ్ వ్యవస్థలో భద్రత డొల్లతనాన్ని పట్టిస్తోంది. బ్యాంకులో ఎక్కడా వివరాలు నమోదు కాకుండా నీరవ్ సంస్థల్లోకి రూ.280కోట్లు వెళ్లేలా చేసుకోగలిగాడు. ఇందుకు బ్యాంకు సిబ్బందే తప్పుడు గ్యారంటీలు సృష్టించారు. 2011 నుంచి పీఎన్‌బీ ముంబై శాఖలో ఈ తరహా అవకతవకలు యథేచ్ఛగా సాగుతున్నాయని తేలింది. పీఎన్‌బీ ఇచ్చిన లెటర్స్ ఆఫ్ అండర్‌స్టాండింగ్(ఎల్‌ఓయూ) ఆధారంగా విదేశాలలోని రెండు ఇతర బ్యాంకుల శాఖల నుంచి సొమ్ము తీసుకున్నారు. అయితే ఈ లేఖలు ఇచ్చినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు మూల సమాచారంలో ఎక్కడా నమోదు కాకుండా జాగ్రత్త పడ్డారు.అయితే బ్యాంకు పెద్దలకు తెలియకుండా వేల కోట్ల రూపాయల మోసం చేయడం సాధ్యమా అనే ప్రశ్న తలెత్తుతున్నది. నీరవ్ మోడీ దేశం విడిచి వెళ్లడానికి ఉద్దేశపూర్వకంగా వెసులుబాటు కల్పించిన తర్వాతనే, ఈ కేసు నమోదు తతంగం సాగిందా? నీరవ్ మోడీపై ప్రధాని కార్యాలయం (పీఎంఓ)కు 2015లోనే ఫిర్యాదు అందినా పట్టించుకోలేదని ఈ కుంభకోణాన్ని బయటపెట్టిన వ్యక్తి చెబుతున్నారు. నీరవ్ ఒక్కడికే ఈ దేశ పౌరసత్వం ఉంది. ఆయన భార్య అమీకి అమెరికా పౌరసత్వం, సోదరుడు నిషాల్‌కు బెల్జియం పౌరసత్వం ఉన్నాయి. వారిని ఇక్కడకు రప్పించడం అంత తేలికకాదు. ఈ తరహా బాగోతం పీఎన్‌బీకి ఇదేం మొదటిసారి కాదు. ఐదేళ్ల కిందట విన్‌సమ్ గ్రూప్ వజ్రాల వ్యాపార సంస్థ స్టాండ్‌బై క్రెడిట్ లెటర్స్‌ను ఉపయోగించి రూ.1600కోట్లు టోకరా వేసింది. ఆ గ్రూప్ యజమానులు కూడా విదేశాలకు పారిపోయి ఇప్పటివరకూ దేశంలోకి అడుగుపెట్టలేదు. దీనిపై సీబీఐ దర్యాప్తు సాగుతూనే ఉంది. ఈ బ్యాంకింగ్ కుంభకోణాల పరంపరను చూసినప్పుడు రిజర్వుబ్యాంకు కూడా తన బాధ్యత, వైఫల్యం నుంచి తప్పించుకోలేదు. అలాగే ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో (సీఈఐబీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) వంటి పర్యవేక్షణా సంస్థల పనితీరు ప్రశ్నార్థకమవుతోంది. జనం డబ్బు ఎటు పోతున్నా, ఎలా పోతున్నా మన పాలకులకు పట్టడంలేదని బోధపడుతోంది. ఎంతమంది ఎన్ని సార్లు బ్యాంకులను మోసగిస్తున్నా బ్యాంకింగ్ వ్యవస్థకు జవాబుదారీతనం నేర్పాలన్న ఆలోచన ఈ ప్రభుత్వాలకు కలగడంలేదు. ఆర్‌బీఐ సైతం బ్యాంకింగ్ వ్యవస్థను చక్కదిద్దేందుకు తగిన చర్యలు చేపట్టలేదని అర్థమవుతోంది. అలా జరిగి ఉన్నట్లయితే నీరవ్ మోడీ చేసిన ఎల్‌ఓయూ మోసం ఎప్పుడో బయటపడి ఉండేది. అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీల్లో వినియోగించే ఈ ఎల్‌ఓయూకు తగిన మొత్తంలో ఆస్తులను బ్యాంకుకు హామీగా చూపాలి. ఈ లావాదేవీల్లో ఎల్‌ఓయూ జారీ చేసిన బ్యాంకు, స్వీకరించిన బ్యాంకు, సరకు తీసుకునే సంస్థ, దాని ద్వారా లబ్ధిపొందుతున్న సంస్థ ఉంటాయి. ఈ సంస్థలకు డబ్బు ఎన్ని రూపాల్లో వస్తుంది, ఎన్ని రూపాల్లో బయటకు పోతుందీ బ్యాంకులకు తెలుస్తుంది. ఏయే దశల్లో మోసం జరగడానికి ఆస్కారం ఉందో, వాటి నివారణకు ఎలాంటి తనిఖీలు అవసరమో, దానికి పర్యవేక్షణ ఎలా ఉండాలో నిర్ధారించుకోవడం కష్టం ఏమీ కాదు. అలా జరిగి ఉన్నట్లయితే ఈ ఏడేళ్లలో ఈ నాలుగు చోట్ల జరిగే లావాదేవీల్లో ఏ ఒక్కచోటైనా మోసం చేస్తున్నట్లు తెలిసిపోయేది. ఈ మోసాలను అరికట్టలేని పాలకులు కష్టాల్లో కూరుకుపోయిన బ్యాంకులను ఆదుకునేందుకు రెండు మార్గాలను అనుసరించాలనుకుంటున్నారు. ఒకటి బెయిలవుట్ విధానం- ప్రజాధనంతో బ్యాంకులను ఆదుకోవడం. రెండేళ్లలో రూ.2.11 లక్షల కోట్లు ఇవ్వాలని నిరుడు అక్టోబరులో కేంద్ర సర్కారు నిర్ణయించింది. మొన్న డిసెంబరులో కేంద్రం రూ.7,577 కోట్లు విడుదల చేసింది. మరో లక్ష కోట్ల రూపాయలు కూడా మార్చినాటికి విడుదల చేయాలని నిర్ణయించినట్లు ఇటీవలే జైట్లీ ప్రకటించారు. రెండోది బెయిలిన్ విధానం- బడాబాబులు ఎగవేసిన సొమ్ము కారణంగా బ్యాంకులు నష్టపోతే, దాన్ని ఖాతాదారుల సొమ్ము కాజేయడం ద్వారా భర్తీ చేయడం. దీన్ని మోడీ సర్కారు ఇటీవల ప్రతిపాదించింది. అంటే బ్యాంకులు తమ ఇష్టానుసారంగా దొంగలకు, దోపిడీదారులకు భారీ మొత్తంలో అడ్డగోలుగా రుణాలు ఇచ్చి నష్టపోయిన డబ్బయినా, దాన్ని భర్తీచేసేందుకు కేంద్రం ఇచ్చేదైనా మొత్తంగా ప్రజాధనమే. బ్యాంకులు, పాలకులు చేసిన తప్పిదాలకు జనం సొమ్ము హారతి కర్పూరంలా కరిగిస్తారన్నమాట. ఈ నేపథ్యంలో బ్యాంకులపైనే ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. ఏ బ్యాంకులో ఏయే శాఖలో ఎంత మేరకు గల్లంతయిందో, అది ఎప్పుడు వెలుగు చూస్తుందో చెప్పలేని దురవస్థ నెలకొంది. ఇటువంటి కుంభకోణాలు జరగకుండా బ్యాంకులు సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కుంభకోణాలు బయటపడినప్పుడు ముందుగా అక్రమాలకు, అవకతవకలకు ఆస్కారం కల్పించిన బ్యాంకు పెద్దలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడం, బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచడం వంటి చర్యలు తీసుకోవాల్సిన ప్రధాన కర్తవ్యం పాలకులదే. పారుబాకీలు, అధికార సిబ్బంది చేతివాటంతో పెచ్చరిల్లుతున్న అవకతవకలపై గట్టి నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకునేందుకు రిజర్వు బ్యాంకు పూనుకోవాలి.

చురక

అగ్రరాజ్యమైతేనేమి
ఆయుధాల సంస్కృతి
అసువులు దీస్తుంది ప్రజల
అదుపులేని దుష్కృతి

అమెరికా ప్రజాస్వామ్య
అందమైన రక్ష మేడ
అడుగడుగున తుపాకులు
ఆవరించే స్వేచ్ఛ నీడ

- వేల్పుల నారాయణ

చరిత్ర వక్రీకరణ క్షమార్హం కాదు

పాళెం చెన్నకేశవరెడ్డి

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్న సూక్తితో సాక్షాత్తు దేశ ప్రధాని మోడీ లోక్‌సభలో తన ప్రసంగాన్ని ఆర్భాటంగా తనదైన శైలిలో కొనసాగించారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అప్రదిష్టపాలు చేయడమే లక్ష్యంగా, పనిలో పనిగా విభజన చట్టంలోని అంశాలను తుంగలోతొక్కి, ఏపీ తెలుగు ప్రజల ఆగ్రహజ్వాలల సమస్యను మరుగుపరిచేందుకు విఫలయత్నం చేశారు. ఇటీవల గుజరాత్ ఎన్నికలలో ప్రాబల్యం తగ్గిన బీజేపీ గుణపాఠం నేర్చుకోకపోగా 2019 ఎన్నికలలో ఆంధ్రలో తమ పార్టీకి తామే సమాధి కట్టడానికి పూనుకున్నారు.అసలు విషయానికొస్తే మోడీ తన పార్లమెంటు ప్రసంగంలో మహాత్మాగాంధీ ఆశీస్సులతో దేశ ప్రథమ ప్రధాని అయినట్టి జవహర్‌లాల్ నెహ్రూను అప్రదిష్టపాలు చేయడానికి కుతంత్రం చేశారు. సెక్యులర్ ప్రజాస్వామ్య పద్ధతులలో సోషలిస్టు భావాలలో ప్రపంచ దేశాల మన్నన పొందిన నెహ్రూపాత్రను తక్కువ చేయడానికి విశ్వప్రయత్నం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో సమున్నతమైన పాత్రను పోషించి, జాతి ప్రియతమ నాయకుడిగా పేరొందిన నెహ్రూ పాలనను వక్రీకరిస్తూ సర్దార్ వల్లభాయ్ పటేల్ నెహ్రూ స్థానంలో ప్రధాని అయివుంటే కాశ్మీర్ మొత్తం భారత్‌లోనే వుండి వుండేదని ఊహాజనిత సొంత పైత్యాన్ని భారతదేశ జనావళికి ఎక్కించే వ్యర్థప్రయత్నం చేశాడు.

73 సంవత్సరాల స్వతంత్ర భారతంలో ఏ ప్రధాని కూడా ఈ స్థాయిలో దిగజారి చరిత్రను వక్రీకరించలేదు. సంపన్న కుటుంబానికి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్య పోరాటంలో, స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ సోషలిస్ట్ పంథాలో పాలన సాగించడానికి కృషి చేశారు. అలీనదేశాల కూటమిలో నెహ్రూ చారిత్రాత్మకమైన భూమిక నిర్వహించారు. సోవియట్ యూనియన్‌తో మైత్రి బంధం కొనసాగించి తద్వారా సోవియట్ నుండి పారిశ్రామిక, రక్షణ, సాంస్కృతిక రంగాలలో చారిత్రాత్మకమైన సహకారం పొందగలిగారు.

అమెరికా భారత్‌పైకి దాడి చేయడానికి సప్తమ నౌకాదళంతో బయలుదేరగా, సోవియట్ రష్యా హెచ్చరికతో అమెరికా తోకముడిచి వెనక్కి వెళ్లింది. భారత్, రష్యా మైత్రి నెహ్రూ హయాంలో మొగ్గ తొడిగి వికసించింది. నెహ్రూ తర్వాత కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణలాంటి సాహసోపేతమైన చర్యలు చేపట్టడమేకాక జాతి సమైక్యత కోసం సిక్కుల తీవ్రవాదానికి బలైంది. స్వాతంత్ర్య పోరాటంలో తన పాత్ర బొత్తిగా లేని బీజేపీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పుట్టిన మోడీ ఇలాంటి అవాకులు, చవాకులు కాక చారిత్రక వాస్తవాలు మాట్లాడగలరని ఆశించలేము.మోడీ తప్పిదాల నిర్వాకం కొనసాగుతూనే వుంది. అమరావతి రాజధాని శంకుస్థాపనకు వచ్చిన మోడీ ప్రత్యేక హోదా గురించి ప్రకటన చేస్తాడని ఆంధ్రరాష్ట్ర ప్రజలు ఆశించగా ఆ విషయాన్ని బొత్తిగా ప్రస్తావించక చెంబుడు నీళ్లు, ముంత మట్టిని ఇచ్చి వెళ్లిపోయారు. విభజన చట్టం అంశాలను అటకెక్కిస్తున్నానని చెప్పకనే చెప్పాడు.

జాతి యావత్తును కుదేలు చేసే సంఘటనలకు శ్రీకారం చుట్టాడు. పెద్దనోట్ల రద్దుతో సామాన్యజనాన్ని ఇక్కట్లపాలు చేశాడు. సొంతపనులు వదులుకొని రోజుల తరబడి సామాన్యులు క్యూలో నిలబడగా వృద్ధులు ఎందరో క్యూలో గంటలకొద్దీ నిలబడలేక ప్రాణాలు కోల్పోయారు. సంపన్నుల నుండి నల్లధనం వెలికితీయడానికి ఆయన చేసిన ప్రయోగం విఫలమయ్యింది. బ్యాంకు అధికారులతో బడాబాబులు లాలూచీపడి నల్లధనాన్ని చెలామణి చేసుకున్నారు. ఈ చర్యకు ముందు ఏటీఎంలు జనానికి నిత్యం అందుబాటులో వుండేవి. నోట్ల రద్దు తర్వాత ఏటీఎంలు ఎప్పుడు పనిచేస్తాయో, వాటిలో క్యాష్ వుంటుందో వుండదో తెలియని దుస్థితి నెలకొంది. తాజాగా ప్రవేశపెట్టిన జీఎస్టీతో సామాన్యుల మీద పరోక్షపన్నుల దోపిడీ ప్రారంభమైంది. వస్తు సేవల పన్ను నిస్సందేహంగా సామాన్యుల నడ్డి విరుస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తుకాగా విభజన చట్టాన్ని తుంగలో తొక్కుతున్న తీరులో నిస్సందేహంగా బీజేపీకి ఆంధ్రలో నూకలు చెల్లినట్లే.

వ్యాస రచయిత సెల్ నెం. 8341117825

సందర్భం

చోడ్ దో మైడాస్ మార్గ్

chod do ! midas marg !!

అక్కినేని చంద్రరావు

"పట్టిందల్లా బంగారం కావాలి". యిది అత్యాశ. అంతం లేనిది. క్రీ.పూ. గ్రీకురాజు మైడాస్, ఫిజియా అనే ప్రాంతానికి అధిపతి. భూగోళంలో అత్యంత ధనవంతుడిని కావాలని కోర్కె కలిగింది. నాటి రాజ్యాల ఆక్రమణలు, అతిక్రమణలు అన్నీ "బంగారం" చుట్టూనే తిరిగేవి. "బంగారం" ఎంత ఎక్కువ ఉంటే అంత గొప్పవాడు. అందరికంటే తన దగ్గరే ఎక్కువ బంగారం ఉండాలని మైడాస్ వాంఛించాడు. తన దైవాన్ని కోరుకున్నాడు. తను పట్టిందల్లా బంగారం కావాలని. దేవుడు వరమిచ్చాడు. యిది నిజరూపం ధరించింది. దీంతో మైడాస్ ఒక్క రోజులోనే భూమండలంలోకెల్లా, అత్యంత ధనవంతుడయ్యాడు. అత్యంత ఆనందంతో భోజనానికి కూర్చున్నాడు. తన స్పర్శతో అన్నంకూడా బంగారంగా మారింది. దీంతో మైడాస్‌కు చావు దగ్గర పడింది. ప్రాణం పోయే దశలో తనదైవాన్ని వేడుకున్నాడు. "ఓదైవమా! నాకీబంగారం, సంపద వద్దు! నీవే వెన్నక్కి తీసుకో! నాకు బతకటానికి ఏది అవసరమో అది చాలు" అని చావును తప్పించుకున్నాడు. గ్రీకు జానపదకథలలో ఒకనాటి అత్యాశకు సారాంశం యిది. నాటి చరిత్ర.

2000 సం॥లకు పూర్వం ఏం జరిగిందో అది మరో రూపంలో నేడు భూగోళాన్ని ఆవరించింది. మన దేశానికి కూడా బాగా ఒంట బట్టింది. అదే! సంపద మీద ఆశ, అంతులేని దురాశ. రూపంలో ఎలా ఉన్నా పరవాలేదు. వాంఛ నెరవేరితే చాలు. 2000 సం॥లుగా శక్తి లేని చోట కంటే శక్తి (Power) ఉన్న చోటే యిది ఘనీభవించింది. ఒకనాటి "బార్టర్ సిస్టమ్" నుండి నేడు "బరువు" దశకు చేరుకుంది.

ముతగ్గా ఉన్న "బరువు" పదానికి "బ్రైబ్" అనే ఆంగ్లపదం నేటి అలంకారం.

విసుగెత్తిన రాజ్యాంగ నిపుణులు దీని నియంత్రణకు ఒక యంత్రాంగాన్ని సమకూర్చారు. అది తన పని తాను చేసుకుంటూపోతుంది అప్పుడప్పుడు అడ్డుకట్టలు దాటు కుంటూ.. ఇదిలా ఉండగా "బ్రైబ్" మాత్రం తనలాగానే నడుస్తున్నది. చివరకు మార్చలేని అలవాటుగా మార్చబడింది. పుట్టుక నుండి గిట్టే వరకు దీని స్పర్శకు తలొగ్గాల్సిందే.

ఈ "బ్రైబ్" తన ఉనికికి ఒక గీత గీసింది. గీతకు ఒకపక్క అధికారం (Power)), మరో ప్రక్క అనధికారం.

అధికారం తన గీత ద్వారా అనధికారం రాత (fate) ను నియంత్రించడం దీని విశేషం. సమాజం మీద ఒత్తిడి పెంచింది. నలిగిపోయే కంటే నాలుగు రాళ్ళు పారేస్తే సరిపోతుంది. అనధికారం అలా సరిపెట్టుకుంది.

> 1. 99% బానిసలు 1 శాతం యజమానులకు దాసోహం అన్నట్లు..
> 2. 95% రైతులు 5 శాతం భూస్వామికి దాసోహమన్నట్లు..
> 3. 1 శాతం సంపద 99 శాతాన్ని దోచుకుంటున్నట్లు..
> 4. 10 మంది రౌడీలు 10 లక్షల జనాభాను నియంత్రిస్తున్నట్లు..
> 5. ఒక నియంత ఒక దేశాన్ని భయపెడుతున్నట్లు...
> 6. 5 శాతం బ్యూరోక్రసీ 130 కోట్ల జనాభాను లొంగదీసుకుంటున్నట్లు..
> 7. 5 శాతం కార్బన్ డయాక్సైడ్ 95 శాతం ఆక్సిజన్‌ను స్వాహా చేస్తున్నట్లు..
>
> "బ్రైబ్" అనే ఒక్క పదం, 'న్యాయాన్ని' తన గుప్పెట్లో పెట్టుకోవటం..
> దీనికి ముగింపు ఎక్కడ? ఎక్కడ?

"పారేసే రాళ్ళు" దాచుకోలేనంతగా పోగుపడడం సహజం. "బ్రైబ్"కు వావి వరస లేదు కాబట్టి. "పోగులు", "గుట్టలు", "కట్టలు" - దాచుకునే మార్గం లేక బజారున పడ్డాయి. సమాజం విస్తుపోలేదు! ఆశ్చర్యపడలేదు. ప్రశ్నిం చలేదు. స్వాహాదారుమాత్రం నిశ్చింతగానే ఉన్నాడు. ఎందుకంటే తను నాగరిక "మైడాస్". "గ్రీకు మైడాస్" తన అనాగరికతకు భయపడ్డాడు. మన మైడాస్ గ్రేట్. పాల నుండి నీటిని వేరు చేయగలడు. దాన్ని కలపగలడు. తిమ్మిని బమ్మిని చేయగల సిద్ధహస్తుడు. ఈ "బాట" పట్టని వాడు పనికిరానివాడు. వీడికి "ముద్ర" వేయడం రాదు; పది రాళ్ళు పోగేయటం చేతకాదు; నేర్పించినా నేర్చుకోడు; కాబట్టే వీడు సమర్థస్థానంలోని అసమర్థుడు.

సమాజం తన సామర్థ్యానికి "నాలుగు స్తంభాలను" నిలబెట్టింది. "శాసనవ్యవస్థ" న్యాయవ్యవస్థ", కార్యనిర్వా హాక వ్యవస్థ" ఈ మూడు స్థంభాలకు-సమాజానికి ముఖ్య అనుసంధాన కర్తగా "ప్రసార మాధ్యమ వ్యవస్థ" (మీడియా) నాలుగవ స్థంభంగా స్థానం పొందింది. ఈ నాలుగు స్థంభాలను నియంత్రించేదే "రాజ్యాంగం".

"మాగ్నకార్టా" (1812-జూన్15న లండన్‌లో జరిగిన మొదటి హక్కుల ఒప్పందం) నుండి "లాహోర్ డిక్లరేషన్" (భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కోరిన సందర్భం అక్టోబరు 31, 1929) వరకు జరిగిన ప్రపంచ రాజ్యాంగ రచనలకు జాన్ మిల్టన్, స్పినోజా, థామస్‌పెయిన్, జాన్‌స్టు వార్ట్‌మిల్, అబ్రహం లింకన్, హెరాల్డ్ జెలాస్కీ, ఆర్.హెచ్.తానే, మోహన్ దాస్ కరమ్‌చంద్‌గాంధీ లాంటి వారందరూ "మానవహక్కులు" కేంద్రంగా రాజ్యాంగాల పొందికను సూచించారు.

వీటన్నిటికలయికలో భాగమే బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన "భారత రాజ్యాంగం". మన నాలుగు స్థంభాలకు, వాటినడకకు దార్శనికం. కాని, స్థంభాలనడక దారి తప్పుతూ వచ్చింది. దీనికి "బ్రైబ్" కేంద్రబిందువు. మానవ ఇతిహాసం చాలారుగ్మ తలను జయించుకుంటూ నడుస్తున్నది. "బ్రైబ్" రుగ్మతను మాత్రం నివారించలేకపోయింది.

ఇది యిప్పుడు సర్వాంతర్యామి. "అధికారముద్ర"కే యిది అధికారి. ఈ ముద్ర (సీల్) కు గ్రామస్థాయినుండి, ప్రపంచస్థాయివరకు "రేటు" నిర్ణయించబడుతుంది. ఇది సంపదకు రూటుగా మారింది. "కాలం" ముద్రకు దాహా న్ని పెంచింది. అందుకే అది "మైడాస్‌మార్గం" పట్టింది. "ఇది అనాగరికం" అని సమాజం కేకపెట్టాలి.రంగస్థలం ఏదైనా "చోడ్‌దో! మైడాస్‌మార్గ్!" ఇది ప్రపంచ శబ్దం కావాలి!

ఉన్నత "మిథ్య"



పచ్చల రాజేష్

ఇటీవల కేంద్రం ప్రతిపాదించిన భారత దేశ బడ్జెట్ లో ఉన్నత విద్యకి కేటాయింపులు చూసుకుంటూ , ఈ తలరాతలు ఎప్పుడు మారతాయా అని దేశవ్యాప్తంగా ఆలోచనలు చేసుకుంటున్న భారత దేశ యువతను అకస్మాత్తుగా యుజీసీ నుండి వచ్చిన 84 పేజీల చిత్తు ప్రతి (డ్రాఫ్ట్) ఆందోళనలోకి నెట్టేసింది. భారత దేశంలోని వర్సిటీలలో , డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల నియామానికి, ఇప్పటికే ఉన్నవారికి పదోన్నతులకు సంబధించిన ప్రతిపాదనలు అవి . ఈనెల 28వ తేదీ దాకా అభిప్రాయాలు తెలపమని సమయం కూడా ఇచ్చింది . అయితే వీటిలోని కొన్ని అంశాలు ఆశావహులకు తీవ్ర నిరాశ కలిగించేలా ఉన్నాయి. అవి ఒకటి, 2021 జూలై కల్లా పీహెచ్డీ పూర్తి చేసిన వారికే టీచింగ్ లో ఎంట్రీ లెవెల్ పోస్టులు అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కు అర్హత ఉన్నట్టు. రెండు, అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూ కి అర్హత సాధించడానికివారి విద్యా జీవితంలో పొందిన డిగ్రీలలో వచ్చిన మార్కుల శాతాన్ని బట్టి వారికి మార్కులు కేటాయించడం. వాస్తవానికి2021 జూలై కల్లా పీహెచ్డీ తప్పనిసరి చేయడం ఒక పెద్ద జాతీయ విద్యా విపత్తు. ఇప్పటిదాకా నెట్ వంటి జాతీయ అర్హత పరీక్ష , సెట్ వంటి రాష్ట్ర స్థాయి అర్హత పరీక్షఈ రెండూకాని పక్షం లో 2009 యుజీసీ గైడ్ లైన్స్ ప్రకారం పీహెచ్డీ పూర్తి చేసినవారికిఅధ్యాపకులుగా అవకాశం కల్పిస్తూ ఉన్నారు. ఇప్పుడు వీటితో పాటు పీహెచ్డీ ని కూడా తప్పనిసరి చేయడం వల్ల ఒరిగే ప్రయోజనమేమీ లేకపోగా అసలే అధ్యాపక ఉద్యోగాల భర్తీ జరగక కునారిల్లుతున్న ఉన్నత విద్య,ప్రమాణాల పరంగా మరింత దిగజారుతుంది. ఒక పీహెచ్డీ పూర్తి చేయడం డిగ్రీ పీజీ పూర్తి చేయడం వంటి ప్రక్రియ కాదు, అంత తొందరగా విద్యార్థిగా నమోదు చేసుకోగల అవకాశమూ లేదు. పైగా అధిక సమయం పట్టే విషయం. ఒక పీహెచ్డీ అడ్మిషన్ పొందాలంటే పీజీ పూర్తి చేసి ఉండాలి. నెట్ మరియు సెట్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి అర్హత పరీక్షల ద్వారా గానీ, లేదా యూనివర్సిటీల ప్రవేశ పరీక్ష ద్వారా గానీ మాత్రమే పీహెచ్డీ అడ్మిషన్ పొందగలం . దేశంలోని కేంద్రీయ విశ్వ విద్యాలయాలు ఏటా పీహెచ్డీ అడ్మిషన్ల ప్రవేశ పరీక్ష ను నిర్వహిస్తాయి . తర్వాత ఇంటర్వ్యూ ల ద్వారా సంబంధిత సబ్జెక్టుల్లో ప్రవేశాలు చేపడతాయి. ప్రతి సబ్జెక్టులో అక్కడున్న అధ్యాపకుల అర్హతను బట్టి అప్పటికే తమ వద్ద ఉన్న ఖాళీలను బట్టి సీట్ల సంఖ్య ఉంటుంది. అందుకే వాటి సంఖ్య చాలా తక్కువ . ఇక రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో పీహెచ్డీ ప్రవేశ పరీక్ష ఏటా జరగదు . రెండేళ్లకోసారి, మూడేళ్లకోసారి నిర్వహిస్తుంటారు.

కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో ఎంఫిల్, పీహెచ్డీ చేసే వారికి నెలకు 5 వేలు మరియు 8 వేలు ఉపకార వేతనం అందజేయబడుతుంది . కానీరాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఇవేమీ ఉండవు. అందువల్ల ఎక్కువమంది అడ్మిషన్ పొందాక బయట తమ జీవనోపాధి చూసుకుంటూ పీహెచ్డీ అధ్యయనం చేస్తారు. దానితో వారికి ఈ డిగ్రీ పొందడానికి ఎక్కువ సమయం పడుతుంది. సాధారణంగా పీహెచ్డీ పట్టా పొందాలంటే ఒక ప్రక్రియ ఉంటుంది . ఎవరైనా తమ సిద్ధాంత గ్రంథాలు 3 సంవత్సరాల తర్వాత సమర్పించొచ్చు. వాటిని పరిశీలనకు పంపడం తరువాత ఆ సిద్ధాంతాన్ని డిఫెండ్ చేసుకునే వైవా ఇవన్నీ జరుగుతాయి. ఇదంతా జరగడానికి కనీసం 4 ఏళ్ళు పడుతుంది . అది కూడా వేగంగా చేసినట్లైతే. కొన్ని సార్లు ఆలస్యమయ్యి ఆ సమయం 7 లేదా 8 ఏళ్ళు పట్టే వారు ఉన్నారు. ఒకోసారి నిర్దేశిత సమయం ముగిసిపోయి మరలా పునఃప్రవేశం పొందేవారూ ఉంటారు. ఇంత సమయం పట్టే ఒక డిగ్రీని అధ్యాపక ఉద్యోగాల నియామకానికి అర్హతగా పెట్టడం వల్ల ఏమి సాధించాలని కోరుకుంటున్నట్టు? పీహెచ్డీ వంటి ఉన్నత విద్య పై ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవగాహన ఏర్పడుతున్న నేపథ్యంలో ఆ డిగ్రీనే ఒక నిర్దేశిత సమయానికి తప్పనిసరి చేసినట్లైతే వారి హక్కులు ఎలా కాపాడగలం. నిజంగానే ఈ అర్హత తప్పనిసరి చేస్తే ఇప్పుడు పీహెచ్డీ అడ్మిషన్ పొందే విద్యార్థులు కూడా 2021 కి డిగ్రీ పొందలేరు. అదొక్కటైతే 2021 జూలై తరువాత,ఇప్పుడు అర్హతలుగా ఉన్న నెట్ మరియు సెట్ వంటి పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు పీహెచ్డీ పూర్తి చేసేదాకా అధ్యాపక ఉద్యోగాలకు అర్హులే కారు . ఇదెలా న్యాయం . ఇప్పుడు ఈ రూల్ పెట్టడం వల్ల, కొండంత ఆశతో జాతీయ స్థాయి అర్హత పరీక్ష లో ఉత్తీర్ణులయ్యి టీచింగ్ వైపు మళ్లాలి అనుకునే ప్రస్తుత డిగ్రీ, పీజీ విద్యార్థుల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది ఈ నిర్ణయం. దానితో ఇప్పటికే ఉన్న దానికంటే మరింత మానవ వనరు కొరత ఏర్పడుతుంది ఉన్నత విద్యా రంగంలో .

పీహెచ్‌డీ సిద్దాంత గ్రంథాలలోని విషయాలు చౌర్యానికి గురవడం , కొందరు వీటిని డబ్బులు తెచ్చిపెట్టే మార్గంలా భావించడం తో పీహెచ్డీ సిద్దాంత గ్రంథాలు ఒక ఆదాయ వనరుగా మారాయి అన్న వాదన ఉన్నత విద్యా వర్గాల్లో బలంగా వినిపిస్తుంది. అటువంటి వారికి విద్యను బోధించడం ఎలా తెలుస్తుంది అని నెట్ వంటి జాతీయ స్థాయి అర్హత పొంది ఉద్యోగాలు కోరుకునే వారు వాదిస్తుంటే , కేవలంమల్టిపుల్ చాయిస్ ప్రశ్నా పత్రాలకు సమాధానమిచ్చి టీచర్లు ఎలా అయిపోతారు అనే వాదన పీహెచ్డీ ని సమర్థించే వారిలో ఉంది . యుజీసీ మాత్రం ఈ ఇద్దరి జుట్లకు ముడేస్తే పోతుంది అన్నట్టు వ్యవహరిస్తుంది .

దేశంలో జాతీయ విశ్వ విద్యాలయాలు మొదలుకుంటే రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కాలేజీల్లో ఖాళీలు కలిపితే సంఖ్య వేలల్లో తేలుతుంది. నిధులు లేక రాష్ట్ర విశ్వ విద్యాలయాలు మూలుగుతున్నాయి . అధ్యాపక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడం, అభ్యర్థుల నుండి ఫీజు వసులు చేయడం ఎదొక కారణంతో వాయిదా వేయడం ఇలా అభ్యర్థుల జేబులు గుల్ల కావడం తప్ప భర్తీ జరిగిందే లేదు. ఇప్పటికీ జాతీయ స్థాయిలో విద్యాలయాల్లో కూడా కాంట్రాక్ట్ టీచర్లతో బోధిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణమో అర్థం చేసుకోవచ్చు. ఒకవేళకొంత భర్తీ చేశారనే అనుకుందాం, భర్తీ అయిన పోస్టుల్లో కూడా పీహెచ్డీ ఉండి మూడేళ్ళ బోధనా అనుభవం ఉన్నవారే పీహెచ్డీ పర్యవేక్షకులుగా ఉండాలి. మరి భర్తీ అయి కూడా మూడేళ్ళ అనుభవం లేని వారు పర్యవేక్షకులుగా ఉండే అవకాశం లేనప్పుడు అవసరమైన మేర పీహెచ్డీ పరిశోధకులను ఎలా తయారు చేయగలం?. ఇవేమీయుజీసీ ఆలోచనకు తట్టకపోవడం మరీ విడ్డూరం. ఒకసారి తెలుగు రాష్ట్రాలోని పరిస్థితి గమనిస్తే ఆంధ్రా, తెలంగాణలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది . నియామకాలకు ఏవో చట్టపరమైన కారణాలు అడ్డుపడుతూనే ఉన్నాయి. ఒక దశాబ్దం క్రితమే నెలకొల్పబడిన విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత కొత్తగా చెప్పాల్సిందేమీ లేదు . రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పీహెచ్డీ అడ్మిషన్లు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా ఇవ్వాలి అనే ప్రతిపాదనల్లో ఉన్నాయి . ఇవెప్పటికి జరిగేనో తెలియదు . వీరంతా2021 జూలై కల్లా పీహెచ్డీ పూర్తి అవ్వాలి అనే నిబంధన బాధితులుగా మారతారనడంలో సందేహం లేదు. ఇక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులను ఇంటర్వ్యూ కి షార్ట్ లిస్టు చేయడానికి విద్యా జీవితంలో పొందిన డిగ్రీల మార్కుల శాతం ని బట్టి ఇచ్చే ప్రాధాన్యం లో కూడా కొంత గందరగోళానికి తెరతీసింది. వర్సిటీలలో భర్తీ చేసే ఉద్యోగాలకు పీహెచ్డీ కి ఇచ్చే మార్కులు 30 గా నిర్ణయిస్తే, కాలేజీల్లో అధ్యాపకుల భర్తీకి పీహెచ్డీకి 20 మార్కులు కేటాయించారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నెట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి వర్సిటీల్లో 7 మార్కులు కేటాయిస్తే కాలేజీల్లో భర్తీకి 10 మార్కులు కేటాయించారు . ఒకే తరహా ఉద్యోగాలకు ఒక డిగ్రీకి వేరు వేరు మార్కులు ఎందుకో ఇప్పటికీ అర్థం కాని పరిస్థితి.

అలాగే డిగ్రీ, పీజీ లలో పొందిన మార్కుల శాతాన్ని బట్టి కూడా మార్కులు ఇవ్వడం జరుగుతుంది. ఒకప్పుడు 50 శాతంసాధించడం గొప్ప అయితే ఇప్పుడు 80 శాతం సాధించడం గొప్ప. కాలానుగుణంగా మారిన పోటీలో అర్హులైన వారంతా ఒక దశాబ్ద కాలంలోని విద్యార్థులే అయినప్పుడు వారి మధ్యే గత మార్కుల బట్టి నిర్ణయం భాధాకరం. దేశమంతా విద్యా వ్యవస్థ ఒకటిగా ఉన్నప్పుడు ఒకే రకమైన సదుపాయాలు, అర్హత కలిగిన అధ్యాపకులు ఉన్నప్పుడు చేయాల్సిన పనిని అస్తవ్యస్తంగా ప్రాంతాలను బట్టి ప్రాధాన్యతలు మారిపోయే దేశంలో ఒక ఉన్నత స్థాయి కాలేజీ నుండి వచ్చిన వారికి, సదుపాయాలు లేని ప్రదేశాల నుండి అసలు చదువుకునే హక్కే త్రునీకరించబడ్డ వర్గాల నుండి కష్టపడి చదువుకొన్న వారి మధ్య డిగ్రీ, పీజీ మార్కుల శాతం ఏమి సాధిస్తుంది. అందరూ అర్హత కలిగిన వారే. ఉన్నత జీవితం వైపు అడుగులెయ్యాలని ఉన్నత విద్య వైపు మరలే వారిని అర్థం లేని ప్రక్రియలతో అనర్హులను చేయడం , విద్యా వ్యవస్థ మరింత నిర్వీర్యమయ్యే ప్రతిపాదనలు చేయడం అర్థరహితం. ఇది కంప్యూటర్ సరఫరా చేయకుండా సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అవ్వు అన్నట్టుంది.

ఒక మనిషి నిరంతరం నేర్చుకుంటూనే ఉంటాడు. నేర్చుకోవడం అంటే జీవితంలో విలువలు, "అత్యున్నత స్థాయి ప్రమాణాలు" అలవరచుకోవడమే. టీచింగ్లో కూడా లెర్నింగ్ కు అర్థమిదే. కాబట్టి మార్కులు శాతాలు అనే నిర్ణయం , ఒకే ఉద్యోగానికి వేరు వేరు మార్కుల నిర్ణయం , భవిష్యత్తులోతీసుకోవాల్సిన పీహెచ్డీ తప్పనిసరి అనే నిర్ణయం అర్థరహితం. ఉన్నత విద్యా వ్యవస్థ పటిష్టం చేసి అధ్యాపకులు నియామకం జరిపి , పీహెచ్డీ లు పర్యవేక్షించడానికి అవసరమైన మేర అర్హత కలిగిన అధ్యాపకులు దేశంలో సిద్ధమయ్యాక తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడం తప్పకుండా ఒకజాతీయ విద్యా విపత్తుకి దారి తీస్తుంది. ఆ అత్యవసరతలో పీహెచ్డీ సిద్దాంత గ్రంథం ఖచ్చితంగా ఒక విద్య వ్యాపార వస్తువుగా మారుతుంది అనడం లో సందేహం లేదు .

అధ్యాపకుల నియామకాలకు అర్హతలు నిర్దేశిస్తున్న యుజీసీ అసలు అధ్యాపకుల నియామకం జరుగుతుందో లేదో చూడకపోవడం బాధాకరం. కాంట్రాక్ట్ అధ్యాపకులుగా ఏళ్ళ తరబడి బోధన చేస్తున్న వారు పడే ఇబ్బందుల గురించి ఆలోచించకపోవడం బాధాకరం . చాలా వర్సిటీల్లో కాంట్రాక్టీచర్స్ గా ఉన్న వారి కింద పరిశోధన చేస్తున్న విద్యార్థులకి వచ్చే ఫెలోషిప్ కంటే అధ్యాపకులకు వచ్చే నెలవారీ జీతాలు తక్కువ అంటే అదుపు తప్పిన ఈ పరిస్థితి అంచనా వేయొచ్చు. అధ్యాపకుల నియామకాల్లో అవినీతి జరుగుతుంది అంటూ రోజూ పత్రికల్లో చూస్తూనే ఉంటాం. భారతీయార్ వర్సిటీ వీసీ ఒక అధ్యాపక పోస్టు ఇవ్వడానికి 30 లక్షల లంచం డిమాండ్ చేసి ఇటీవల ఏసీబీ కి దొరికిపోవడం చూసాం, అధ్యాపకుల నియమకాల్లో అవకతవకలు అంటూ ఇంటర్వ్యూ ప్రక్రియనే నిలిపేసిన సంఘటనలు ఆంధ్రాలో చూశాం , ఇంటర్వ్యూలో మార్కుల మాయాజాలం అంటూ తెలంగాణా నుండి వార్తలు చూశాం , పేరు గాంచిన ఢిల్లీ వర్సిటీలోలా అధ్యాపకుల నియామకాల్లో అవకతవకలు అంటూ టీచర్ల సంఘం ఆందోళన చూసాం, మూడునాలుగేళ్ళుగా నోటిఫికేషన్లు ఇస్తూ వర్సిటీలు అధ్యాపకుల నుండి ఫీజు వసూలు చేస్తూ నోటిఫికేషన్లు రద్దు చేస్తున్న సంగతి చూస్తున్నాం. ఒకవైపు శాశ్వత ఉద్యోగాల కోసం నెట్, సెట్ మరియు పీహెచ్డీ వంటి అర్హతలతో అభ్యర్థులు కుస్తీ పడుతుంటే అర్హత లేని అభ్యర్థులతో ప్రైవేట్ విద్యా సంస్థలు పబ్బం గడుపుకుంటున్నాయి ఇదీ దేశ ఉన్నత విద్యలోని దయనీయ పరిస్థితి . కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో6000పైగా బోధనా ఖాళీలు ఉన్నాయని సాక్షాత్తూ కేంద్రమే ప్రకటించాక ఇంత దారుణంగా పరిస్థితి ఉంటే చక్కదిద్దే పని చేయకుండా నేటి పరిస్థితికి ఎటువంటి ఉపయోగం చేయని నిబంధనలతో ఉన్నత విద్యను ఉత్త విద్యగా మార్చేసే నిర్ణయాలు ప్రతిపాదించడం పూర్తిగా అనవసరం.

వ్యాస రచయిత సెల్ : 8331823086.

విశాలాంధ్ర

బతుకు
The Life

శనివారం
17 ఫిబ్రవరి 2018



మ్యూజియం కాదు మంచు!

శీతాకాలం మంచు అమెరికాను ముంచెత్తుతోంది. అందుకు ప్రతక్ష్య నిదర్శనమే ఈ చిత్రం. ఒక ఇంటిపక్కన మంచు దిబ్బలా ఏర్పడిన ఈ దృశ్యం బోస్టన్‌లోది.









రవీ! ఏంటిరా! వెంకట్‌ని తల పగలకొట్టావు. వాడేం చేశాడని అంతలా కొట్టావు అంటూ అడిగాడు రవిని తండ్రి. ఏం చేశాడా వాడు నేను క్లాసులో సైన్స్ పాఠం చదువుకుంటుంటే అప్పడే వచ్చిన మాస్టారితో వీడు ఇంటి దగ్గర చదవకుండా ఇక్కడికి వచ్చి చదువుతున్నాడు సార్ అంటూ ఫిర్యాదు చేశాడు నాన్నా! అందుకే కోపం వచ్చి తన్నాను అన్నాడు రవీ ఘనకార్యం చేసినట్టుగా తండ్రితో. ఇది ఒక్క రవి విషయమే కాదు టీనేజ్ లేక కౌమారంలో ఉన్న పిల్లలు అనేక నేరఘటనల్లో భాగస్వాములవుతున్నారు. ఇవేకాదు, అత్యాచారాలు, దొంగతనాలు, దారిదోపిడీలు చేయటానికి కూడా వెనుకాడటం లేదు. ఎంతోమంది అనేక నేరాలకు పాల్పడి తమ బంగారు భవితను ముళ్ళమయం చేసుకుంటున్నారు దీనికి కారణం ఆలోచిస్తే..

టీనేజ్ పిల్లలు నేర స్వభావం..

తల్లిదండ్రులు పిల్లలను పెంచే విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను రోజూ పాఠశాలకు, కాలేజీకి పంపిస్తున్నామంటే సరిపోదు. ఇంటి నుంచి వెళ్ళిన పిల్లలు ఏం చేస్తున్నారో గమనించుకోవాలి. పిల్లలకు కావసినంత పాకెట్ మనీ ఇస్తున్నాం, వారి అవసరాలు తీరుస్తున్నాం కదా అనుకునే తల్లిదండ్రులూ ఉన్నారు. డబ్బులు ఇచ్చినంత మాత్రాన పిల్లలకు కావలసిన సౌకర్యాలన్నీ సమకూరవు. అవి చెడుసావాసాలను పురిగొల్పుతాయనటంలో ఎటువంటి సందేహంలేదు. ఆ డబ్బులు సరిగా అందని రోజున ఆ పిల్లలు నేరాలకు పాల్పడుతున్నారు.

వారి జల్సాలను తీర్చుకోవటానికి ఎటువంటి హాని చేయటానికైనా వెనుకాడరు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఇందుకు నిదర్శనం. ఈ పరిస్థితులు రాకుండా ఉండాలంటే కౌమారదశ దాటే వరకు పిల్లలపై దృష్టి పెట్టాలి. వారిని గమనిస్తున్నట్టుగా వారికి తెలియకుండానే గమనించాలి. పిల్లలు ఎవరితో స్నేహాలు చేస్తున్నారో, ఆ స్నేహితులు ఎలాంటివారు అని తెలుసుకోవాలి. అధికంగా డబ్బులు ఇవ్వకూడదు. ఒక్కొక్కసారి డబ్బే పిల్లల పతనానికి దారితీస్తుంది. ఇళ్ళల్లో సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్లు ప్రస్తుత కాలంలో తప్పనిసరవు తున్నాయి. అయితే వాటిని వాడుకునే విధానంలోనే మెళకువలు పాటించాలి. కంప్యూటర్లు ఓపెన్‌గా హాల్లో ఉండే ఏర్పాట్లు చేసుకోవాలి. పిల్లలు సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్లు వాడుతున్నపుడు వారు ఎలాంటి సైట్‌లను చూస్తున్నారో పెద్దలు గమనించుకోవాలి. సాధారణంగా కౌమార వయసులోని పిల్లలకు పట్టుదల, పౌరుషం ఎక్కువగా ఉంటాయి. అన్నింటివైపు తొందరగా ఆకర్షించే స్వభావం కలిగి ఉంటారు. ఏ పని అయితే చేయకూడదని పెద్దలు నిర్బంధిస్తారో దానివైపు ఎక్కువగా ఆకర్షితులవుతారు. ఒకరకంగా సెల్‌ఫోన్‌లు టీనేజ్‌పిల్లల పాలిట హెల్‌ఫోన్‌లుగా మారుతున్నాయి.

చిన్నవయసులోనే మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారు. సామాన్యంగా మత్తుపదార్థాలు తీసుకునే వారిలో నేరస్వభావం ఎక్కువగా ఉంటుంది. ఇటీవల కాలంలో ఉన్నతాదాయ వర్గాల వారి పిల్లలు కూడా నేరాలకు పాల్పడే వారిలో ఎక్కువగా ఉంటున్నారు. సాధారణంగా 18ఏళ్ళలోపు ఎవరినైనా మైనర్లుగా చెబుతారు. కానీ ఇటీవల ఘటనలను చూస్తుంటే అతిచిన్న వయసులో అంటే పాఠశాల స్థాయిలోనే నేరాలకు పాల్పడుతున్నారు. ఆ నేరాలు ఎలా ఉంటున్నాయంటే ప్రేమ పేరుతో బాలికలను తీసుకెళ్ళే వరకూ వస్తున్నాయి. అయితే వీటిని అధిగమించాలంటే తల్లిదండ్రులు పిల్లల విషయంలో కొన్ని జాగ్రత్తలను తీసుకోవాలి.

ప్రస్తుత పరిస్థితులలో తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులుగా ఉంటున్నారు. వారికి పిల్లలతో గడిపే తీరిక ఉండటంలేదు అంటున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. కొంత సమయాన్ని కల్పించుకుని పిల్లలతో గడపాలి. కనీసం రోజులో ఒకసారైనా కుటుంబ సభ్యులందరూ కలిసి భోజనం చేయాలి. కౌమార వయసు ఆకర్షణకు లోనయ్యే వయసు. ముందు వారిని ప్రేమపూర్వకంగా దగ్గరకు తీసుకుని అన్ని విషయాలు తెలపాలి. తల్లిదండ్రులు పిల్లల ముందు ఘర్షణ పడకూడదు. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలి. వారు చెప్పేది పూర్తిగా వినాలి. వారికి సమస్యలు ఉంటే చెప్పుకునేంతటి ధైర్యాన్ని తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాలి. వారికి టీనేజ్‌లో కలిగే ప్రేమలపై అర్థమయ్యే రీతిలో అవగాహన కలిగించాలి. వారికి ఇతర వ్యాపకాలు కల్పించాలి. ఈ వయసులో ఆలోచనలు చంచలంగా ఉంటాయి. ఆ ఆలోచనా విధానంలో మార్పు రావడానికి తల్లిదండ్రులు కృషిచేయాలి. ధ్యానం, వ్యాయామం వంటివి పిల్లలను చేయమని చెప్పాలి. ధ్యానం, యోగాలాంటి వాటివల్ల ఏకాగ్రత పెరుగుతుందని తెలియజేయాలి. పెద్దలు ఆ దిశగా పిల్లలను మళ్ళించాలి. అడిగారు కదాని ప్రతి వస్తువు కొనివ్వకూడదు. ఏ వస్తువు ఎంత మేరకు అవసరమవుతుందో గమనించి వారికి ఆ వస్తువును కొనివ్వాలి. కొన్ని చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటూ వారితో ఘర్షణకు దిగకుండా వారి ఆలోచనలకు మెరుగులద్దాలి. వారి ఆలోచనలతో ఎన్నెన్నో బంగారు సౌధాలు నిర్మించవచ్చు. పిల్లలలో మంచి ఆలోచనలకు తల్లిదండ్రులు బీజాలు వేయాలి. ఆ బీజాలు మొలకెత్తి బంగారుపంటను ఇవ్వగలిగేలా ప్రతి తల్లిదండ్రీ కృషిచేయాలి.

– రిషి



చర్మానికి యాపిల్ గుజ్జు !

యాపిల్‌ను తినడమే కాదు. దాని గుజ్జును చర్మానికీ రాసుకోవచ్చు. వీటిల్లో ఉండే మినరల్స్, విటమిన్లు దేహానికి కొత్త మెరుపుని ఇస్తాయి. అరటి, బొప్పాయి గుజ్జు మాదిరిగానే యాపిల్ గుజ్జు చర్మానికి గొప్ప ఔషధంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ ఏ చర్మకేన్సర్ రాకుండా కాపాడుతుంది. నిర్జీవంగా మారిన చర్మానికి యాపిల్ గుజ్జు తేజస్సును ఇస్తుంది. దీనిని వాడుకునేందుకూ కొన్ని పద్ధతులు ఉన్నాయి. అవేమిటో చూద్దామా!

1. యాపిల్‌ను ముక్కలుగా చేసి దానిని మిక్సీలో వేసి గుజ్జులా చేయండి. అవసరమైతే కొంచెం నీళ్ళు పోయండి. దీనిని ముఖానికి రాసి పావుగంట ఉంచండి. తర్వాత చల్లని నీటితో కడిగేయండి.

2. యాపిల్ తొక్క తీసుకోండి. ఇందులో ఒక టీ స్పూన్ తేనె వేసి మిక్సీలో వేసి పేస్ట్‌లా చేయండి. దీనిని ముఖానికి పట్టించి పావుగంట ఉంచండి తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. దీనివల్ల మేనుఛాయ పెరుగుతుంది.

3. ఒక యాపిల్, ఒక టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ నిమ్మరసం తీసుకోండి. యాపిల్‌ని తురిమి రసం తీయండి. ఇందులో తేనె, నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి 20 నిముషాలు ఉంచండి. తర్వాత చల్లని నీటితో కడిగేయండి. వారానికి రెండుసార్లు అయినా ఈ చిట్కాని పాటించి చూడండి. ఈ ముఖంలో వచ్చే మార్పుని గమనించండి.

4. యాపిల్ సగం చెక్క, ఒక టీ స్పూన్ ఓట్‌మీల్ పొడి, ఒక టీ స్పూన్ తేనె, ఒక గుడ్డు సొన తీసుకోండి. యాపిల్‌ని బాగా సన్నగా తురిమి ఇందులో ఓట్‌మీల్ పొడి, తేనె, గుడ్డు సొన కలపండి. దీనిని ముఖానికి పూతలా వేసి పది నిముషాలు ఉంచండి. తర్వాత చల్లని నీళ్ళతో కడిగేయండి. ఈ చిట్కా పొడి చర్మం గలవారికి బాగా ఉపయోగపడుతుంది. దీనివల్ల చర్మానికి కావలసిన తేమ అందుతుంది.





ఆఫ్ఘన్ బిర్యానీ

ఎండాకాలం వచ్చేసింది. ఇకపై బిర్యానీలు, మసాలాలతో కూడిన నాన్‌వెజ్ వంటకాలు తినాలంటే కొంచెం భయపడాల్సిందే. అందుకే, ఎండలు ముదరకముందే ఇలాంటి వంటకాలు ఓసారి తయారుచేసుకుని మనసారా లాగించేయండి. మరి తయారుచేయాలంటే వెరైటీ వంటకాల గురించి తెలుసుండాలి కదా! మీరు చాలా రకాల బిర్యానీలు తిని ఉంటారు కదా! ఆఫ్ఘన్ బిర్యానీ తిన్నారా! దీని తయారీ గురించి తెలుసా! లేదంటే ఇప్పుడు తెలుసుకుందాం.



కావలసిన పదార్థాలు

మటన్ కిలో, , రైస్ కిలో, ఉల్లిపాయలు మూడు, టమాటాలు రెండు, ఎండుమిర్చి పొడి ఒక టేబుల్ స్పూన్, అల్లం, వెల్లుల్లి పేస్ట్ రెండు టేబుల్ స్పూన్‌లు, గరం మసాలా రెండు టేబుల్ స్పూన్‌లు, పచ్చిమిర్చి నాలుగు, క్యారట్లు మూడు, ఉప్పు తగినంత ఆయిల్ అరకప్పు, బాదం, కిస్‌మిస్‌లు అరకప్పు

తయారీ విధానం

ఒక పెద్ద గిన్నె తీసుకుని అందులో మటన్, అల్లంవెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, సగం ఉల్లిపాయ ముక్కలు, కొన్ని పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పుతో పాటు నాలుగు గ్లాసుల నీళ్ళు పోసి బాగా కలపండి. ఈ గిన్నె పొయ్యి మీద పెట్టి అరగంట ఉడకనివ్వండి. ఇందులో నుంచి మటన్ ముక్కలు తీసి వేరుచేసి పక్కన పెట్టుకోండి. మరో పెద్ద పాన్ తీసుకుని ఆయిల్ వేసి వేడి చేయండి. నూనె కాగిన తర్వాత మిగిలిన ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా వేగనివ్వండి. తర్వాత గరం మసాలా వేయండి. ఐదు నిముషాల తర్వాత మాంసం, టమాటా ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, ఎండుమిర్చి పొడి, ఉప్పు వేసి వేగనివ్వండి. చివరగా ఇందులో ఉడికించిన అన్నం, మాంసంతో పాటు ఉడికించిన మసాలా మిశ్రమం వేసి బాగా కలపండి. పైన మూత పెట్టి ఐదు, పది నిముషాలు ఉంచండి. మరో పాన్ తీసుకుని రెండు టేబుల్‌స్పూన్‌ల ఆయిల్ వేసి కాగనివ్వండి. ఇందులో కిస్‌మిస్, బాదం, క్యారట్లు వేసి వేయించండి. చివరగా కొన్ని ఉల్లిపాయ ముక్కలు ఇందులో వేసి వేయించండి. వీటిని అన్నం మీద వేసి అలంకరించడమే. అంతే ఆఫ్ఘన్ బిర్యానీ రెడీ. వేడివేడిగా ఆరగించడమే ఆలస్యం.

చికెన్-బాదం పసంద్!

బాదం మామూలు కూరల్లో ఉపయోగించి ఉంటారు. మరి నాన్‌వెజ్ వంటకాల్లో అదీ చికెన్‌లో ఎప్పుడైనా ఉపయోగించారా? లేదంటే ఇప్పుడు వేసి చూడండి. చికెన్-బాదం పసంద్ తయారు చేసి చూడండి. ఈ పేరు వింటేనే నోరూరుతోంది కదా! మరి ఇంకెందుకు ఆలస్యం దీని తయారీ విధానం తెలుసుకుందాం.



కావలసిన పదార్థాలు

బోన్‌లెస్ చికెన్ కిలో, నెయ్యి లేదా బటర్ పది పెద్ద స్పూన్‌లు, పెరుగు పావుకిలో, నల్ల మిరియాల పొడి ఒక టేబుల్ స్పూన్, లవంగాలు పది, యాలకులు ఐదు, జీలకర్ర రెండు చెంచాలు, గరం మసాలా రెండు చెంచాలు, కారం మూడు స్పూన్‌లు, వెల్లుల్లి పేస్ట్ నాలుగు చెంచాలు, ఉప్పు తగినంత, ఉడికించిన బాదం పప్పులు తగినన్ని. మీ అభిరుచికి సరిపడ, మీకు ఇష్టమైనన్ని బాదం పప్పులు వాడుకోవచ్చు.

తయారీవిధానం

బాదం పప్పులు ముందుగా ఉడికించి తొక్కతీసి ఉంచుకోవాలి. చికెన్‌ను సన్నని, పలచని ముక్కలు చేసుకోవాలి. మందపాటి అల్యూమినియం గిన్నె లేదా కడాయి తీసుకుని అందులో చికెన్ ముక్కలు బాదంతో పాటు పైన చెప్పుకున్న పదార్థాలన్నీ వేసి కలపండి. ఈ గిన్నె పొయ్యి మీద పెట్టి మంట హైలో ఉంచి పది నిముషాలు ఉంచండి. తర్వాత మంట స్విమ్‌లో ఉంచి మరో పావుగంట ఉడకనివ్వండి. చికెన్ ముక్కలు బాగా ఉడికేవరకూ పొయ్యి మీద ఉంచాలి. అంతే స్పైసీ చికెన్ బాదం పసంద్ రెడీ. ఉడకబెట్టిన బాదం గింజలతో పైన అలంకరించండి. ఇష్టమైనవారు పైన క్రీమ్ కూడా వేసుకోవచ్చు. నోరూరించే చికెన్, బాదం పసంద్ సిద్ధమైనట్టే. ఇక తినడమే తరువాయి.





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఆ రోజు పుదుచ్చేరిలో ఆ మిల్లువాళ్ళని రాక్షసులు సైతానులనే తిట్టింది శాంతం. అన్నయ్యకీ ఇరవై లక్షలున్నాయి - నాకు పది లక్షలన్నాయి. అన్నయ్య దుర్మార్గుడా - రాక్షసా? నేను దుర్మార్గుణ్ణా - మదాంధుణ్ణా? - వద్దు మొర్రో - అంటూ తోసేస్తున్నా - డబ్బు వొళ్ళో వచ్చి పడుతూంటే - యేం చెయ్యం? అసలు ముప్పైవేలు రొక్కం బ్యాంకిలోనించి తీసి యీ సీమప్రయాణం ఖర్చు పెట్టమంటేనే పీక పిసుక్కున్నట్టుంది కదా నాకు - అటువంటిది నా కష్టార్జితం అందరికీ పంచి పెట్టేయ మంటే నా కెంత యేడుపుగా వుంటుంది?... మొన్న బెంగాలులో బొగ్గుగని పేలి పది మంది కూలివాళ్ళు అందులో కప్పడిపోయి చచ్చిపోయారు. ఆ బొగ్గుగని పాణీంద్రబోసుది. పాణీ నేను లండనులో కలిసి చదువుకున్నాం. పాణీ యెంత మంచివాడంటే - అంత మంచివాడు. ఒక దోమనిగాని నల్లినిగానీ చంపడానికి అతనికి చెయ్యిరాదు, శ్రీమంతుడని చెప్పి అతన్ని దుర్మార్గుడు క్రూరుడు అంటే న్యాయమేనా?...

(నిన్నటి సంచిక తరువాయి)

శాంతం లాఠీచార్జీలో దెబ్బలు తిన్నప్పుడు పెరుమాళు మొదలియారు అధికారి. వెన్నలాంటిది అతనిహృదయం. దేవేంద్ర పాళయం మొఖాసాదారుకొడుకు, ఆగర్భ శ్రీమంతుడు. బ్రాహ్మడు కాకపోయినా నాచునీచు వేలువేసేనా ముట్టుకోడు. కొసకి వుల్లిపాయకూడా కాశీలో వదిలేశాడు. సిగరెట్టుపొగ తగిల్తే వాంతి చేసుకుంటాడు. మరావేళ ఉద్యోగరీత్యా కఠినమైన ఉత్తరువు యివ్వలసిసొచ్చింది. ఆవేళే అతని భార్య నీళ్ళాడిందట. ఏడుస్తూనే ఇచ్చానని చెప్పాడు నాతో తరవాత పాపం! అతనిగుండె రాయా? పాషాణమా అనీ - తను మనిషికాడు మృగం అనీ తిడితే ఎలాగు - అని నేనే అతన్ని వెనకేసుకొస్తాను...సైలేంద్ర బావ వున్నాడు. నాతోనే మిడిల్ టెంపిల్లో చేరాడు - నాతోనే ప్యాసయాడు. ఇద్దరం ఒక్క బసలోనే వున్నాం మూడేళ్ళన్నూ. లక్ష్మణుడు సీతమ్మవారి పాదాలనే చూసేవాడుట. అలాగ్గా సైలేంద్రుడు పరస్త్రీని కన్నెత్తి చూసి యెరుగడు - చూస్తే యెక్కడ మతి చలించిపోతుందో అని. అంత పవిత్రమైన మనస్సు అతనిది. అస్సాములో వాళ్ళ కెన్నో తేయాకు తోటలున్నాయి. అతని వంతుకు సాలీనా నలభై వేలొస్తాయి. తోటల్లో కూలివాళ్ళు మగ ఆడ పిల్లజెల్ల ఒక్కొక్కరు నెలకి యేడెనిమిది రూపాయలు గడించుకుంటూ హాయిగా వుంటారు. కాని - పాపం - వాళ్ళ ఒక్కరితోటల్లోనే సంవత్స రానికి రెండు మూడువందల కూలీలు మలేరియా జ్వరంతో బాధపడి చనిపోతారు. అలాగని చెప్పి - వీళ్ళందరి చావుకీ యితనే కారకుడు - వాళ్ళరక్తాన్నితడు పీల్చేస్తున్నాడు - నరహంతకుడు అని ఆడిపోస్తే న్యాయమేనా?

...జర్మనీలోనూ ఇటలీలోనూ నిరుద్యోగం లేదు - అక్కడ పరిస్థితులు మంచి ఉత్సాహంగా వుంటాయి. అక్కడ చూపిస్తాను శాంతానికి పారి శ్రామిక నాగరికత మహిమ సంపదాన్నూ... లండ నులో కొన్ని స్థలాలు చూపించకూడదు శాంతానికి. ఈస్టెండు - డాక్ల్యాండు - పోప్లరు - కేనను స్ట్రీటు - ఆ దుర్గంధం - కళ్ళు - దరిద్రం - ఛండాలం అధోగతి చూస్తే ఎవరికేనా నిరుత్సాహమే వేస్తుంది... లండనులో బ్రిటిష్ మ్యూజియం - వెస్టెండు రీజంటు స్ట్రీటు - పిక్కడిల్లీ - భూమి అడుగున రైలు - రాత్రిపూట అక్సుఫర్డు సర్కసులో ఎలెక్ట్రిక్కు ఎడ్వరుటైజుమెంట్లు - బాండుస్ట్రీటులో షాపులు రెస్టారెంటులో హోటేళ్ళు రాజభవనాలు - ఇవిచూస్తే - శాంతం గుమ్మైపోతుంది. "మరెక్కడికీ వెళ్ళొద్దు - శాశ్వతంగా ఇక్కడే కాపురం వుండిపోదాం" అంటుందేమో కూడాను...శాకాహార వ్రతం - మంచితీర్థం నియమం - శాంతతో గట్టిచిక్కు వచ్చిపడింది. అక్కడ మాత్రం వ్రతభంగం అవుతుందని సత్యాగ్రహం చెయ్యకుండా చూడాలి. నేను యేర్పాట్లన్నీ బహుజాగ్రత్తగా చెయ్యాలి...నా పాత స్నేహితు రాంద్రు యిప్పుడు ఎవరున్నారో అక్కడ? మేరీ గార్డను యింకా ఆ సిగరెట్టు షాపులోనే వుంటుందా? సౌందర్యానికి నిజంగా సత్యభామే కాని ఆ టక్కరితనానికి మళ్ళీ రెండో చిత్రాంగే. సేడీమించిన్ యింకా వైటుహాలులో టైపిస్టుగానే కూచుంటుందీ?



యే సెక్రటరీనో యెరపెట్టి వలలో పడేసుకుని వుంటుంది. అచ్చు మంథరే - గడుసు ఖడవ! జీను హేండ్సు యీ పాటికి హోటేలు మేనేజరైపోతుంది. ఆవేళ రిచ్మిమందు పార్కులో నన్ను వెర్రెత్తిం చేసిందిగా - నంగనాచి! మార్జిసింగిల్టన్నుకి నేనింకా జ్ఞాపకం వుంటానా? కాలేజీలో నా ప్రక్కనే కూర్చునేది - చాపకింద నీరు లాగుండేది - అటువంటిది ఆవేళ వాటరూల్లో పదిమంది ముందర నన్ను ముద్దుపెట్టుకుంటే బెంబేలెత్తి పోయాను. రూపంలో రంభతో సమానం అయినా సత్యకాలపు కుర్రది పాపం - ఎడ్నా యెక్కడుందో? ఆ ఉలూచి డివన్ షైరులోనే వుంటే - అటువైపే వెళ్ళకూడదు. నేను. వెళితే మళ్ళీ చుట్టుకుంటుంది - ఎందు కొచ్చిన ఘోష! అయినా వీళ్ళందరినీ శాంతానికీ చూపించేదేమిటి? పాపం - వేరా జాన్స్టన్ చచ్చి పోయింది! శాంతానికి ఆ అమ్మాయి సమాధి గోల్డర్సు గ్రీన్లో చూపిస్తాను.

ఇటలీ వెళితే హెన్నీని కలుసుకోవాలి! కౌంటెస్సుకదా - శాంతానితో పరిచయం చేసినా తప్పులేదు - అందులోకీ ఈమధ్య ముస్సోలినీ క్రింది మంత్రికూడా అయాడు - హెన్నీ పెనిమిటి! అన్నట్టు బొంబాయినుంచి హెన్నీకి టెలిగ్రాం వేసి బ్రిండిసీ దగ్గిర కలుసుకోమనాలి - ఇటలీలో మనకి ఖర్చు కలిసొస్తుంది: మంత్రిగారి దగ్గిరనుంచి వుత్తరాలు తీసుకువెళితే - జర్మనీలో మనకి బ్రహ్మరథం పడతారు. మనకు కానీ చేతిది తగలదు కూడా! హిట్లరు జర్మనీని చూసిందంటే - అప్పుడు బోధపడిపోతుంది శాంతానికి - నాజీ సోషలిజానికిన్నీ నకిలీ సోషలిజానికిన్నీ వున్న తేడా? అసలు ఇంగ్లండులోనే కొందరు హిట్లరుని చూసి మెచ్చుకుంటూంటే - మనం వాళ్ళని చూసేనా నేర్చుకోవద్దా?.... శాంతం హిట్లరుని చూడనంటుందేమో?


....అన్నట్టు అశ్వత్థనారాయణమూర్తీ తీర్థగిరీ యిద్దరరూ సుభమీద కన్నువేసి నట్టుంది. కరటక దమనకులు - వీళ్ళిద్దరూ దాంతో యీ మధ్య తరచుగా బాతాఖాని చెయ్యడం కనిపెట్టాను. పరాయివాళ్ళు అని నయం భయం లేకుండా వాళ్ళిద్దరితోనూ తొణుకూ బెణుకూ లేకుండా ఇంగ్లీషున మాట్లాడేసేస్తుంది. దాంతో మాటలాడడానికి వాళ్ళకేం సంగతులుంటాయో? ఏముంది, ఒకటే సంగతి - ఒకటే పల్లవి - ఒకటే రాగం! తమాషా - సుభ యవ్వనం యీ కుర్రవాళ్ళ కళ్ళకి మిరుమిట్లు కొలుపుతూంది. కుర్రాళ్ళేమిటి - పెద్దాళ్ళేమిటి - యీ అమ్మాయి ఇంట్లో తిరుగు తూండడం చూస్తుంటే హనుమంతుడికే మతిపోతుంది. భీష్ముడి చిత్తమే చిత్తయి పోతుంది! వేరా జాన్స్టన్ - హెన్నీ సల్లివన్ - లేడీ అయ్యంగారు - ఊర్వశీమిత్ర - వీళ్ళందరినీ దూరంగా వుంచగలిగేను. అసలు పిరికివాడిని కాబట్టి నాకు ఫరవాలేదు. శాంతం అంటే అది వేరేకథ. శాంతం అపరంజి; చింతామణి; కామధేనువు; కల్పతరువు; సంజీవి! నేను మొదటే అన్నాను శాంతంతో - మనకేనా మంచిదికాదు - ఎదిగినపిల్లని యింట్లో పెట్టుకుంటే - లోకానికీ వ్యగ్రతా వుంటుంది - అని. శాంతంతో చెప్పి యీ కుర్రాళ్ళు నిద్దరినీ కొంచెం ప్రోత్సాహం చేస్తే - ఎవరో ఒకరు సుభని చేసేసుకుంటారు - దాంతో ఒక చికాకు తీరిపోతుంది. యిద్దరూ స్మార్తులేకూడాన్ను. శాంతం ప్రావిడెంటు ఫండు ఐదువేలున్నూ తను సుభ వొంటిమీదకి చేయించిన జవాహరీ ఐదువేలున్ను కట్నం కింద సాలంకృత కన్యాదానం చేస్తాం అంటే మొగ్గలేసుకుంటూ పందేలు వేసుకుని పరుగెత్తుకొస్తారు. అందులోకి - యూరప్ వెళ్ళి వచ్చిందంటేను - ఆ ఇంగ్లీషు మాటలకి తోడు ఫ్రెంచి ముక్కలు నాలుగు జతచేసి మాట్లాడిం దంటేను - యే ఇంపీరియల్ సర్వీసు అల్లుడు దొరికితే!

అప్పుడే హోట్టీ దాటిపోయాం. ఈ సీమ ప్రయాణమంతా సరిగ్గా జరిగిపోతే బాగుండును. సరిగ్గా అంటే - ఒకటి: ఈ ఐదారు నెలలూ శాంతంతో హాయిగా సరదాగా గడపడం. రెండు: ఈ వ్యాజ్యం గెలవడం. దాల్లో నాకు సుతారం సందేహంలేదు. నా వాదనలని విష్ణుమూర్తి సహా పాంచజన్యం పూరించి, సుదర్శనాన్ని త్రిప్పి, కౌమోదకిని విసరి, నందకంతో సాముచేసి, శారంగాన్ని వదలినా ఖండించడానికి వీలులేదు. మూడు: నేనీ వకాల్తీ పట్టడంలో చూపించిన స్వార్థ రాహిత్యం - చాణక్య తంత్రం - యుగంధరయుక్తీ సణలీకృతం కావడం. ఈ రాజకీయం చూస్తుంటే యేదదీ యేలాగు తేలుతుందో అగమ్యగోచరంగా వుంది. బ్రిటిష్‌వాడిదే కనక క్రిందచెయ్యి అయిపోతేనే, వాడు కాళ్ళబేరానికి వచ్చేసి - ఈ మహారాజులనీ రాజాధిరాజులనీ చల్లగా జార్చేస్తాడు. వీళ్ళ ప్రాపకం నేను అప్పుడు వదులుకుంటే మునిగిపోతూన్న నావని ఎలుకలు వదిలేసినట్టు బయటపడిపోతాను. స్వార్థత్యాగం చూపించి యిప్పుడుగనుక మనం యిటువైపు మొగ్గితే గొప్ప దేశభక్తి చూపించి బీద రైతులని వెనుక వేసుకొచ్చిన వాళ్ళలో జమ అవుతాం. యీ ప్రాయశ్చిత్తకర్మతో వెనుకచేసిన పాపాలన్నీ కొట్టుకుపోతాయి. దేవుడు మేలుచేసి - రైలుదగ్గిర కురవిళ్ళ అన్నట్టు రేపు స్థాపించబోయే ఫెడరల్ కోర్టు బెంచిమీదే కూర్చోవచ్చు! అథవా తెల్లవాడిదే పైచెయ్యి అవుతుందీ - "లా" లో నా తెలివితేటలూ నా ఏలేశ్వరోపాధ్యాయత్వం గ్రహించి వాడే నన్ను పిలిపించీ; "అబ్బాయి - నువ్వు ఉపద్రుడవు - మాకు పక్కలో బల్లెంలాగున్నావు. నీకే వరం కావలిస్తే ఆ వరం యిస్తాం కోరుకో!" అంటాడు. అప్పుడు నేను యేకంగా - హనుమంతుడు ఒక్క గెంతున వారధి దాటి లంకాపట్నంలో పడ్డట్టు - హైకోర్టు ఫెడరల్ కోర్టు సుప్రీంకోర్టు అన్నీ ఒక్క లఘువులో దాటేసి ప్రివీ కౌన్సిలు బెంచి మీదే - మధ్యే తిష్ఠతి మాధవః అన్నట్టు - బైఠాయించొచ్చు: అప్పుడు శాంతం మాత్రం యేమంటుంది? శభాష్ అని మెచ్చుకుంటుంది:

రైలు నట్టడివిలోంచి పోతూంది. కీకారణ్యం, దండ కారణ్యం, సెలయేరు, యేటి మధ్యని చాపరాయి, విశ్వనాథవారి కిన్నెరసాని పాట జ్ఞాపకం వచ్చింది: "వనరులను దాటి - వన్నెల బయలుదాటి - తోటపులనుదాటి - దుర్గమాద్రులనుదాటి - పులుల యడుగులు నడుగులు కలుపుకొనుచు రాళ్ళవాగుదాటి పథాంతరములుదాటి"...

- ఇంకా వుంది.

విపత్తుల నిర్వహణలో రిమోట్ సెన్సింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు



టీఆర్‌టీ జనరల్ నాలెడ్జ్

- విపత్తు దుర్భలత్వ ప్రాంతాలను గుర్తించి, మ్యాపులు కలిగిన అట్లాస్‌లను రూపొందిస్తుంది.
- భూకంప ప్రదేశాల పటాలను రూపొందిస్తుంది.
- వరద ప్రభావిత ప్రాంత పటాలను అందిస్తుంది.
- ఓషన్‌శాట్ : సముద్ర వాతావరణాన్ని మత్స్యసంపద వివరాలను తెలియజేస్తుంది.
- కార్టోశాట్ - II : మ్యాపుల తయారీకి ఉపయోగపడుతుంది.
- మెట్‌శాట్- (కల్పన - 1) - వాతావరణ ఉపగ్రహం, రుతుపవన ఆగమనం, తుపాను రాకల గురించి సమాచారాన్ని అందజేస్తుంది.
- రిసోర్స్‌శాట్, సహజ వనరులు, పంటలు, అడవుల సర్వేకు ఉపయోగపడుతుంది.
- Technology Experiment Satillite (TES) సైనికులు కదలికలు మొదలగు రక్షణశాఖ నిఘా వ్యవస్థ కోసం రూపొందించబడింది.
- గ్రామ్‌శాట్ : గ్రామీణ ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రాంతీయ భాషల్లో కార్యక్రమాలను ప్రసారం చేయటం.
- 1999 అక్టోబర్ 29న ఒరిస్సాలో అతి భయంకరమైన తుపాను వచ్చినపుడు విపరీతమైన ఆస్తి, ప్రాణనష్టాలు సంభవించాయి. ఏ ప్రాంతం ఎక్కువగా లేదా తక్కువగా నష్టాన్ని పొందినదీ తెలుసుకోవడానికి రిమోట్ సెన్సింగ్ విధానం ద్వారా సర్వే చేశారు.
- మహారాష్ట్రలో 1993 సెప్టెంబర్ నెలలో లాతూర్‌లో 2001 జనవరి 26న గుజరాత్‌లోని భుజ్ అనే ప్రాంతంలో భూకంపం వచ్చినపుడు జరిగిన నష్టాన్ని రిమోట్ సెన్సింగ్ ద్వారా అంచనా వేశారు.
- 1984-92 సంవత్సరాల మధ్య హిమాలయ ప్రాంతాలలో మంచు కరిగే రేటును అధ్యయనం చేశారు.
- మురుగునీటితో కాలుష్యం బారిన పడిన శారదా నదిని అధ్యయనం చేశారు.
- ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో ఉన్న వివిధ కర్మాగారాల నుంచి వెలువడే కాలుష్య కారకాలను, వాటి పరిమాణాన్ని ఐఆర్‌ఎస్ ఉపగ్రహ సమాచారం ద్వారా అంచనా వేశారు.
- రాజస్థాన్‌లో భూగర్భంలో అంతర్ధానమైన సరస్వతి నది ఆనవాళ్లను ఐఆర్‌ఎస్ ఉపగ్రహ చిత్రాల ద్వారా కనుగొన్నారు.
- రుతుపవనాలకు ముందు, తరువాత పంజాబ్ భూభాగంలో శీతోష్ణ పరిస్థితులల కలిగే మార్పులను అధ్యయనం చేయడానికి ఐఆర్‌ఎస్ ఉపగ్రహ సమాచారాన్ని వినియోగించారు.
- గుజరాత్ సముద్రతీర ప్రాంతంలోని సముద్ర గర్భంలో ద్వారక పట్టణ శిధిలాలను కనుగొన్నారు.
- 2004లో సునామీ సృష్టించిన నష్టాన్ని, సముద్రంలో మునిగిపోయిన తీరప్రాంతాలపై అధ్యయనం చేశారు.

రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు

- సర్వసాధారణంగా సాంప్రదాయ రాడార్ ఏరియల్ ట్రాఫిక్ కంట్రోల్ ముందస్తు హెచ్చరిక, ఇతర అతిపెద్ద వాతావరణ డేటాతో కూడి ఉంటుంది.
- డాప్లర్ రాడార్‌ను పోలీసు, ఇతర శాంతిభద్రతలను అమలుచేసే చట్టబద్ధమైన సంస్థలు వినియోగించుకుంటాయి.
- డాప్లర్ రాడార్ ద్వారా వేగపరిమితులు, గాలివేగం, వాతావరణంలో గాలి దిశ, వర్షపాతం, దాని తీవ్రతను అంచనా వేయడానికి డాప్లర్ రాడార్‌ను వినియోగించడం జరుగుతుంది.
- వీటితోపాటు అయనోస్ఫియర్‌లో ప్లాస్మాలను కూడా వినియోగించడం జరుగుతుంది.
- భారీస్థాయి ప్రదేశాలకు సంబంధించి చిన్నపాటి డిజిటల్ ఎలివేషన్ నమూనాలను రూపొందించడానికి ఇంటర్ ఫెరోమెట్రిక్ సింథటిక్ అపెర్చ్యూర్ రాడార్‌ను వినియోగిస్తారు.
- శాటిలైట్లలో ఉండే లేజర్, రాడార్ అల్టీమీటర్లు విస్తృత శ్రేణిలో డేటాను అందిస్తాయి. గురుత్వాకర్షణ వలన ఏర్పడే నీటి బుడగలను కొలవడం ద్వారా ఇవి సముద్రస్తరం యొక్క లక్షణాలను ఒకమైలు లేదా అంతకుమించిన రిజొల్యూషన్‌తో మ్యాపును రూపొందించగలవు.
- మహాసముద్రపు అలల తరంగ దైర్ఘ్యాలను, ఎత్తును కొలవడంద్వార అల్టీమీటర్లు గాలి వేగాన్ని, దిశను, ఉపరితల సముద్ర ప్రవాహాలు, దిశలను కొలుస్తాయి.
- అల్ట్రాసౌండ్, రాడార్ టైడ్ గేజ్‌లు తీరప్రాంతాల్లో సముద్ర మట్టాన్ని, తరంగ దిశలను అంచనా వేస్తాయి.
- వెజిటేషన్ రిమోట్ సెన్సింగ్ అనేది రాడార్‌కు చెందిన ఒక ముఖ్యమైన అప్లికేషన్
- విస్తృత శ్రేణిలో పౌన:పుణ్యాలను పరావర్తనం, ఉద్గారం చెందిన వికిరణాన్ని సేకరించడంలో రేడియోమీటర్లు, ఫోటోమీటర్లు అత్యంత సాధారణ సాధనంగా ఉపయోగపడతాయి.
- ఫొటోగ్రాఫిక్ మ్యాపులను తయారుచేయడానికి స్టీరియోగ్రాఫిక్ ఏరియల్ ఫొటోగ్రాఫులను తరచుగా ఉపయోగిస్తారు.
- వాతావరణ శాటిలైట్లను మెటియోరాలజీ, క్లైమటాలజీలో వినియోగిస్తారు.

భారతదేశంలో రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ల ఉపయోగాలు

- వ్యవసాయ సాగుభూమి విస్తీర్ణం తెలుసుకోవడానికి
- ఖనిజ వనరుల అన్వేషణకు
- బంజరు భూములు, బీడు భూముల సర్వే కోసం
- పంట ఉత్పాదకతను అంచనా వేయడం కోసం
- భారీ డ్యాం నాణ్యతను పరీక్షించడానికి
- ఆయకట్టు నిర్వహణకు
- అడవుల విస్తీర్ణం కనుగొనడానికి
- వాతావరణ అధ్యయనానికి
- అన్ని రకాల మేపింగ్‌ల తయారీకి
- రిజర్వాయర్లలో నీటి నిర్వహణకు
- సముద్ర జలాల్లోని మత్స్యసంపద నిర్ధారణకు
- ఉపరితల నీటి వనరుల పరిమాణం నిర్ధారణకు
- పంట తెగుళ్ళను అరికట్టడానికి, పంటలను పాడుచేసే మిడుతల దండును కనిపెట్టడం మొదలైన విషయాలను ఐఆర్‌ఎస్ ద్వారా గుర్తించవచ్చు.

భారత రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు

- ఐఆర్‌ఎస్ (1998 మార్చి 20)
- టెక్నాలజీ ఎక్స్‌పరిమెంట్ శాటిలైట్ (టీఈఎస్)
- రిసోర్స్‌శాట్ - 1
- కార్టోశాట్ - 1
- కార్టోశాట్ - 2
- కార్టోశాట్ - 2 ఎ
- రిశాట్ - 2
- ఓషన్‌శాట్ - 2
- కార్టోశాట్ - 2బి
- రిసోర్స్‌శాట్- 2

సెయిల్‌లో 382 మేనేజ్‌మెంట్ ట్రైనీపోస్టులు



స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్ఏఐఎల్:సెయిల్).. 382 మేనేజ్‌మెంట్ ట్రైనీ(టెక్నికల్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హతలు : కనీసం 65 శాతం(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు 55శాతం) మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ(మెకానికల్/ మెటలర్జీ/ ఎలక్ట్రికల్/ కెమికల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ మైనింగ్)తోపాటు సంబంధిత విభాగంలో గేట్-2018 ఉత్తీర్ణత స్కోర్ కార్డ్, నిర్దేశిత శారీరక ప్రమాణాలు(బరువు-కనీసం 45 కిలోలు, ఎత్తు-కనీసం 155 సెం.మీ....) ఉండాలి.

వయోపరిమితి : 28 ఏళ్లు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో

దరఖాస్తు చివరి తేదీ : ఫిబ్రవరి 21, 2018.


వెబ్‌సైట్ : www.sailcareers.com, www.sail.co.in

టీఎస్‌పీఎస్సీ 423 పోస్టులకు నోటిఫికేషన్



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)... డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (డీపీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్‌లోని 423 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నాలుగు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది.

ఖాళీలు : ఫార్మసిస్ట్ గ్రేడ్ (2) (డీపీహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ)-125; ఫార్మసిస్ట్ గ్రేడ్ (2) (డీఎంఈ)-58; ఫార్మసిస్ట్ గ్రేడ్ (2)(టీవీవీపీ)-55; ఏఎన్ఎం/ఎంపీహెచ్ఏ (ఎఫ్) (టీవీ వీపీ)-152; హార్టికల్చర్ ఆఫీసర్ (హెచ్‌వో) (అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్)-27; అసిస్టెంట్ లైబ్రేరియన్ (డీఎంఈ)-6.



వేతనశ్రేణి : ఫార్మసిస్ట్ గ్రేడ్ (2), ఏఎన్ఎం/ఎంపీహెచ్ఏ (ఎఫ్)-రూ.21,230-రూ.63,010; హార్టికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ లైబ్రేరియన్-రూ.35, 120-రూ.87,130.

అర్హతలు : ఫార్మసిస్ట్ గ్రేడ్ (2)కి ఇంటర్మీడియెట్‌తో పాటు డీఫార్మసీ ఉత్తీర్ణత. అలాగే ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్; ఏఎన్ఎం/ఎంపీహెచ్ఏ (ఎఫ్)కు పదోతరగతితోపాటు ఏపీ/ తెలంగాణ ప్రభుత్వ ఎంపీహెచ్ఏ (ఎఫ్) కోర్సు ఉత్తీర్ణత, ఏపీ/తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్లో రిజిస్ట్రేషన్; హార్టికల్చర్ ఆఫీసర్‌కు డిగ్రీ (హార్టికల్చర్) ఉత్తీర్ణత ఉండాలి. ఈ కోర్సు అభ్యర్థులు లేకపోతే హార్టికల్చర్ స్పెషలైజేషన్‌తో ఎంఎస్సీ (అగ్రికల్చర్) ఉత్తీర్ణులైన వారిని పరి గణిస్తారు. అలాగే ఎస్సీ/ఎస్టీ కేటగిరీ పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు డిగ్రీ (హార్టికల్చర్)లో లేకపోతే డిగ్రీ (అగ్రికల్చర్) చేసిన వారిని పరిగణ నలోకి తీసుకుంటారు. అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు బీఏ/ బీకామ్/ బీఎస్సీతోపాటు బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్సెస్ (బీఎల్ఎస్సీ) ఉండాలి. డిగ్రీ (బయాలజీ) ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ డేటాబేస్‌లో ప్రావీణ్యం అభిలషణీయం.

వయసు : 2018, జూలై 1 నాటికి 18-44 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక : ఫార్మసిస్ట్ గ్రేడ్ (2), ఏఎన్ఎం/ ఎంపీహెచ్ఏ (ఎఫ్) పోస్టులకు రాతపరీక్ష (70 శాతం వెయిటేజీ+ ప్రభుత్వ సర్వీసులో ఉద్యోగా నుభవం (30 శాతం వెయిటేజీ); హార్టికల్చర్ ఆఫీ సర్ పోస్టులకు రాతపరీక్ష+ ఇంటర్వ్యూ; అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులకు రాతపరీక్ష ద్వారా.

రాతపరీక్ష విధానం : దీన్ని రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. పోస్టుల వారీ పేపర్లు, ప్రశ్నలు, ఫార్మసిస్ట్ గ్రేడ్ (2)కు మొత్తం 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో పేపర్-1లో జనరల్ ఎబిలిటీస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ట మార్కులు 50. పేపర్-2లో ఫార్మసీ (డిగ్రీ స్థాయి) నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ట మార్కులు 100.

ఏఎన్ఎం/ ఎంపీహెచ్ఏ (ఎఫ్)కు మొత్తం 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో పేపర్-1లో జనరల్ ఎబిలిటీస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ట మార్కులు 50. పేపర్-2లో నర్సింగ్ (ఏఎన్ఎం) నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు చొప్పున గరిష్ట మార్కులు 100.

హార్టికల్చర్ ఆఫీసర్- ఇందులో పార్ట్-ఏ కింద 450 మార్కులకు రాతపరీక్ష ఉంటుంది. పేపర్-1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు 150 మార్కులకు ఇస్తారు. పేపర్-2లో హార్టికల్చర్ (డిగ్రీ స్థాయి) నుంచి 150 ప్రశ్నలు 300 మార్కులకు ఇస్తారు. ఒక్కో పేపర్‌కు 150 నిమిషాల చొప్పున వ్యవధి కేటాయిస్తారు. రాతపరీక్ష అనంతరం పార్ట్-బీ కింద ఇంటర్వ్యూ 50 మార్కులకు ఉంటుంది. అసిస్టెంట్ లైబ్రేరియన్- మొత్తం 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో పేపర్-1, పేపర్-2ల్లో ఒక్కో దాన్నుంచి 150 చొప్పున 300 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 300 మార్కు లకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి పేపర్-1కు 150 నిమిషాలు, పేపర్-2కు 150 నిమిషాలు.

దరఖాస్తు రుసుం : రూ.280 (అప్లికేషన్ ఫీ-రూ.200+ఎగ్జామినేషన్ ఫీ-రూ.80); మాజీ సైనికోద్యోగ, దివ్యాంగ కేటగిరీలతోపాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, 18-44 ఏళ్ల లోపున్న నిరుద్యోగుల (సంబంధిత పత్రం సమర్పించాలి)కు ఎగ్జామినేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఉంది.

దరఖాస్తు విధానం : టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో.

దరఖాస్తు చివరి తేదీ : ఫిబ్రవరి 28, 2018.

వెబ్‌సైట్: www.tspsc.gov.in

ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో 1896 ఉద్యోగాలు

ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీఎంఆర్‌సీఎల్).. వివిధ విభాగాల్లోని ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలకు చెందిన 1,896 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. డీఎంఆర్‌సీఎల్‌ను కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీటీ ఢిల్లీ ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

పోస్టు-ఖాళీలు : మొత్తం పోస్టులను నాలుగు సెక్షన్లుగా విభజించారు. ఇందులో ఏ, బీ సెక్షన్లలోని పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన; సీ, డీ సెక్షన్లలోని పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు.

వివరాలు..

1. సెక్షన్ 'ఏ' (ఎగ్జిక్యూటివ్)లో...

అసిస్టెంట్ మేనేజర్-49 (ఎలక్ట్రికల్-21ఎస్ అండ్ టీ-12+ ఆపరేషన్స్-8 ఫైర్-2+స్టోర్స్-2ఎన్విరాన్‌మెంట్-+ఐటీ-3).

2. సెక్షన్ 'బీ' (నాన్ ఎగ్జిక్యూటివ్)లో...

జూనియర్ ఇంజనీర్-440 (ఎలక్ట్రికల్-192+ఎలక్ట్రానిక్స్-135+మెకానికల్-87+సివిల్-24+ఎన్విరాన్‌మెంట్-2); అసిస్టెంట్ ప్రోగ్రామర్-



9; లీగల్ అసిస్టెంట్-4; ఫైర్ ఇన్‌స్పెక్టర్-10; లైబ్రేరియన్-2; మెయింటైనర్-1058 (ఎలక్ట్రీషియన్ -317+ఎలక్ట్రానిక్ మెకానిక్-530+రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ మెకానిక్-33+ఫిట్టర్-178).

3. సెక్షన్ 'సీ' (ఎగ్జిక్యూటివ్)లో...

అసిస్టెంట్ మేనేజర్-92 (ఎలక్ట్రికల్-25+ఎస్ అండ్‌టీ- 22సివిల్-44+అలైన్‌మెంట్ డిజైన్-1).

4. సెక్షన్ 'డీ' (నాన్ ఎగ్జిక్యూటివ్)లో...

జూనియర్ ఇంజనీర్-205 (ఎలక్ట్రికల్-7+ఎలక్ట్రానిక్స్-102+సివిల్-96)ఆఫీస్ అసిస్టెంట్-14; స్టోర్ అసిస్టెంట్-13.

వేతనశ్రేణి : అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.20,600-రూ.46,500; జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ప్రోగ్రామర్, లీగల్ అసిస్టెంట్, ఫైర్ ఇన్‌స్పెక్టర్, లైబ్రేరియన్- రూ.14,000-రూ.26,950; మెయిం టైనర్- రూ.10,170-రూ.18,500; ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ అసిస్టెంట్-రూ.45,000.

అర్హతలు : అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు సంబంధిత విభాగాల్లో కనీసం 60 శాతం మార్కులు/ తత్సమాన గ్రేడ్‌తో బీఈ/ బీటెక్/ ఎంబీఏ/ బీఎస్సీ/ గేట్-2017 క్వాలిఫై; జూనియర్ ఇంజనీర్‌కు సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ డిప్లొమా; అసిస్టెంట్ ప్రోగ్రామర్‌కు ఇంజనీరింగ్ డిప్లొమా (కంప్యూటర్ సైన్స్)/ బీసీఏ (కంప్యూటర్ అప్లికేషన్స్)/బీఎస్సీ (ఐటీ); లీగల్ అసిస్టెంట్‌కు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ; ఫైర్ ఇన్‌స్పెక్టర్‌కు బీఎస్సీ+ఏడాది ఫైర్ సేఫ్టీ కోర్స్; లైబ్రేరియన్‌కు కనీసం 60 శాతం మార్కులతో బీ.లైబ్; మెయింటైనర్‌కు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ (ఎన్‌సీవీటీ/ఎన్‌సీవీటీ); ఆఫీస్ అసిస్టెంట్‌కు బీఏ/బీఎస్సీ/ బీకామ్; స్టోర్ అసిస్టెంట్‌కు ఇంజనీరింగ్ డిప్లొమా (ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ సివిల్)/ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత. అలాగే అన్ని పోస్టులకూ రైల్వే నిబంధనల ప్రకారం తగినంత ఆరోగ్యం, కొన్ని పోస్టులకు నిర్దేశిత శారీరక ప్రమాణాలూ ఉండాలి.

వయసు : 2018, జనవరి 1 నాటికి అన్ని పోస్టులకూ 18-28 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : ఎగ్జిక్యూటివ్ పోస్టులకు సీబీటీ (రెండు పేపర్లు), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా; నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు సీబీటీ (రెండు పేపర్లు), మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులోని మెయింటైనర్ పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ పరీక్ష (సీబీటీ) ఒక పేపర్‌కు మాత్రమే నిర్వహిస్తారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానం : దీన్ని రెండు పేపర్లకు (మెయింటైనర్ పోస్టులకు మినహా) నిర్వహిస్తారు. పేపర్-1లో జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (మెయింటైనర్ పోస్టులకు జనరల్ ఇంగ్లిష్), అభ్యర్థి ఎంచుకున్న విభాగం నుంచి 120 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. పేపర్-1 వ్యవధి 90 నిమిషాలు. పేపర్-2లో జనరల్ ఇంగ్లిష్ నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. పేపర్-2 వ్యవధి 45 నిమిషాలు. పేపర్-1, పేపర్-2లోని అన్ని ప్రశ్నల కీ సమాన మార్కులు కేటాయించారు. అలాగే ప్రతి తప్పు సమాధానానికీ 1/3 వంతు మార్కు కోత విధిస్తారు. సీబీటీలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుం : రూ.500; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మహిళలు-రూ.250.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 26

వెబ్‌సైట్: www.delhimetrorail.com

విశాలాంధ్ర బిజినెస్

-286.71 ▼ సెన్సెక్స్	-93.20 ▼ నిఫ్టీ	-50 ▼ బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	200 ▲ వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
34,010.76	10,452.30	29,350	29,280	40,000	41,700	64.21
		22 క్యారెట్లు, 10 గ్రాములు	ప్రొద్దుటూరు 29,280 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	కిలో (రూపాయల్లో)	ప్రొద్దుటూరు 41,856 కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోటక్ మహీంద్ర	1,051.75	1.04
ఇన్ఫోసిస్	1,124.85	0.96
రెడ్డీ ల్యాబ్స్	2,212.75	0.83
ఏషియన్ పెయింట్స్	1,146.15	0.62
టీసీఎస్	2,999.00	0.39

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్‌బీఐ	271.75	-2.55
ఎస్ బ్యాంక్	311.90	-2.52
ఐసీఐసీఐ బ్యాంక్	321.00	-2.31
భారతీ ఎయిర్‌టెల్	432.45	-2.07
మారుతి సుజుకి	9,076.00	-2.00

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.91	64.21
యూరో	79.78	80.06
పౌండ్	88.89	90.16
ఆస్ట్రేలియా డాలర్	50.63	51.04
సింగపూర్ డాలర్	48.71	49.01

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,280	31,315
చెన్నై	29,400	31,443
బెంగళూరు	28,700	30,695
ముంబై	30,060	32,149
విజయవాడ	29,350	31,700
విశాఖపట్నం	29,280	31,941
ప్రొద్దుటూరు	29,280	30,740

ముడి చమురు	64.33

నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

కుదేలైన బ్యాంకుల షేర్లు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వారం ముగింపులో నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ప్రభావంతో లాభాల్లో ప్రారంభమైనప్పటికీ సూచీలు తీవ్ర ఒడిదుడుకుల్లో ముగిసాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం నేపథ్యంతో ప్రభుత్వరంగ బ్యాంకింగ్ షేర్లు కుదేలయ్యాయి. ఆటోమొబైల్, ఆర్థికరంగాల షేర్లు నష్టాల్లో ఉండటంతో సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఇ సెన్సెక్స్ 0.84శాతం తక్కువగా 286.71 పాయింట్ల నష్టంతో 34,010.76 వద్ద నమోదైంది. నిఫ్టీ 0.88 శాతంతో 10,452.30 వద్ద ముగిసింది. బెంచ్‌మార్కు ఈక్విటీ సూచీలు బీఎస్‌ఇ సెన్సెక్స్, ఎన్ఎస్‌ఇ నిఫ్టీల ఐటీ స్టాక్స్ లాభాల్లో నమోదయ్యాయి. వరుసగా మూడవరోజు పీఎన్‌బీ షేర్లు మరింత దిగజారి 1.68శాతంతో రూ.126.10 వద్ద ముగిసాయి. నిఫ్టీ పిఎస్‌యు బ్యాంకు ఇండెక్స్ 2.49శాతంతో 3189.05 వద్ద ముగిసింది. 2018 జనవరి భారతీయ వాణిజ్యలోటు మార్కెట్లపై ప్రభావం చూపింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడంకూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఎన్ఎస్ఈలో అంబుజా సిమెంట్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, డాక్టర్ రెడ్డీస్ షేర్లు స్వల్పంగా లాభపడగా.. ఎస్‌బీఐ, యస్ బ్యాంక్, ఐషర్ మోటార్స్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. ముడిచమురు అవసరాలు ముడి చమురు దిగుమతులను పెంచడంతో దేశీయ వాణిజ్యలోటును మరింత పెంచినట్లు తెలుస్తోంది. అమెరికా స్టాక్ మార్కట్లు ముందు సెషన్‌లో లాభాల్లో నమోదుకావడంతో దేశీయ మార్కెట్లపైప్రభావం చూపింది. ప్రథమార్థంలో లాభాల్లో నమోదైన మార్కెట్లు అనంతరం రెడ్‌లో నమోదయ్యాయి. సెక్టరల్ సూచీల్లో ఎస్అండ్‌పీ బీఎస్‌ఇ మిడ్‌కాప్ సూచీలు 0.93శాతానికి దిగజారాయి. బీఎస్‌ఇ స్మాల్‌కాప్ ఇండెక్స్ 1.16శాతానికి దిగజారింది. బీఎస్‌ఇలో 2,067 షేర్లు నష్టాల్లో నమోదుకాగా 651 షేర్లు లాభాల్లో ముగిసాయి. 116షేర్లలో ఎటువంటి మార్పులేదు. పబ్లిక్ సెక్టార్ రంగం కోల్ మైనింగ్ అయిన మేజర& కోల్ ఇండియా 0.5శాతం నష్టపోయింది.

మెటల్, మైనింగ్‌స్టాక్స్ కూడా నష్టాల్లో ముగిసాయి. హిందుస్తాన్‌జింక్, వేదాంత, హిందాల్కో జిందాల్, టాటాస్టీల్, హిందుస్తాన్ కాపర్, ఎన్ఎమ్‌డిసి, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా నష్టాల్లో నమోదుకాగా జెఎస్‌డబ్ల్యు స్టీల్ 0.49శాతం లాభాల్లో ముగిసింది.

ఐటీ నిపుణుల సహకారంతో

టాలెంట్ స్ప్రింట్



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: సాంకేతిక, ఆర్థిక నిపుణుల కోసం ఫిన్‌టెక్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీలలో ఫౌండేషన్ కోసం అత్యాధునిక ప్రోగ్రామ్ 'టాలెంట్ స్ప్రింట్'ను ప్రవేశపెట్టింది. ఇది ఆన్‌లైన్, కాంటాక్ట్, యాక్షన్‌లతో కూడిన హైబ్రిడ్ ప్రోగ్రామ్. రిప్పల్, పేపాల్, పేటీఎమ్ పేమెంట్స్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండియన్ ఏంజిల్ నెట్‌వర్క్‌తో కలిసి దీనిని చేపట్టినట్లు టాలెంట్ స్ప్రింట్ సీఈవో శాంతను పాల్ తెలిపారు.

ఫిన్‌టెక్, బ్లాక్‌చెయిన్ పరిశ్రమ నిపుణులతో కలిసి పని చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అదేవిధంగా అధిక ప్రభావంగల, ప్రపంచ వ్యాప్తంగా వర్తించే ఈ ప్రోగామ్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. రాబోయే నూతన సాంకేతిక విప్లవంలో పాల్గొనాలకునే టెక్నాలజీ, ఫైనాన్స్ నిపుణుల కోసం దీనిని రూపొందిచామన్నారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఎండీ, సీఈవో రేణుసత్తి మాట్లాడుతూ దేశం డిజిటల్ చెల్లింపుల దిశగా అడుగులు వేస్తోందని, నూతన పేమెంట్ బ్యాంకులు ఈ ఉద్యమంలో ముందు వరుసలో ఉన్నాయని అన్నారు. పేపాల్ ఇండియా ఎండీ అనుపమ్ పహూజా, ఇండియన్ ఎంజిల్ నెట్‌వర్క్ కో ఫౌండర్ పద్మజ రూపారెల్ మాట్లాడుతూ ప్రస్తుత, భవిష్యత్తు వ్యవస్థాపకులను ఆకర్షించే సామర్థ్యంగల కార్యక్రమంటూ ప్రశంసించారు. కొత్త స్టార్టప్‌లకు పెట్టుబడి, మార్గదర్శకం, మార్కెటు అందుబాటు కోసం ఐఏఎన్ సహాయపడుతోందన్నారు.

మోటో జెడ్ 2 విడుదల



విజయవాడ: స్మార్ట్ ఫోన్ అనుభవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే దిశలో మోటోరాలా సరికొత్త స్మార్ట్‌ఫోన్ లిమిటెడ్ ఎడిషన్ మోటో జెడ్ 2 ఫోర్స్‌ను, టర్బో పవర్ ప్యాక్ ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఫిబ్రవరి 15 అర్ధరాత్రి నుంచి అన్ని మోటో పబ్‌ల్లోనూ, ఫ్లిప్‌కార్ట్‌లోనూ కేవలం రూ.34,999లకే అందుబాటులోకి తీసుకు వచ్చింది. పగిలిపోని, ముక్కలు కాని డిస్ప్లే స్క్రీన్ దీని ప్రత్యేకత.

రెండు రోజులపాటు డిచ్చార్జ్ కానీ 6220 ఎఎంహెచ్‌ల సామర్థ్యం బ్యాటరీ దీని సొంతం. 12 ఎంపీ డ్యూయల్ కెమెరా, వేగవంతమైన డేటా స్పీడ్, క్వాల్‌కాంలోని అత్యంత వేగపు స్నాప్ డ్రాగన్ ప్రాసెసర్‌తో అత్యున్నత ఆవిష్కరణల ఒలమానాన్ని సృష్టించింది. మోటోషార్టర్ షీల్డ్ సాంకేతికతో 13.97 సెంటీ మీటర్ల క్వాడ్ హెచ్‌డీ అమోడ్ డిస్ప్లే పగిలిపోదు. ముక్కలు కాదు. పవర్+:ప్యాక్‌తో బ్యాటరీ సమస్యలన్నింటిని అధిగమించినట్టే.

నష్టాల్లో గీతాంజలి జెమ్స్ షేర్లు

ముంబై: పంజాబ్ నేషనల్ బ్యాంకు మోగా స్కాం రేపిన ప్రకంపనలు దేశం యావత్తు జ్యుయలరీ షేర్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. వేలకోట్ల స్కాంలో కీలక నిందితుడైన మెహుల్ చెక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ శుక్రవారం తీవ్ర నష్టాల్లో మునిగింది. వరుసగా మూడో సెషన్‌లో అమ్మకాల వెల్లువ సాగడంతో 52వారాల కనిష్టాన్ని తాకింది. గీతాంజలి జెమ్స్ 20శాతం కుదేలైంది. ఇతర ఆభరణాల షేర్లలో తంగమైయిల్ జ్యువెలరీ 5 శాతం , త్రిభువన్ దాస్ భీంజీ జవేరి (టీబీజెడ్) 3శాతం, రాజేష్ ఎక్స్‌పోర్ట్ 1 శాతం నష్టపోయింది. పీసీ జ్యువెలర్స్ మాత్రం పాజిటివ్‌గా ట్రేడ్‌అయింది. ప్రభుత్వ రంగ దిగ్గజం (పీఎన్‌బీ ముంబై బ్రాంచీలో జరిగిన 177 కోట్ల డాలర్ల (సుమారు రూ. 11,400 కోట్లు) కుంభకోణంలో గీతాంజలి జెమ్స్‌పై కూడా కేసు నమోదు కావడంతో ఇన్వెస్టర్లు ఈ కౌంటర్లో మరో సారి భారీ అమ్మకాలకు తెరతీశారు. గీతాంజలి, గిన్ని, నక్షత్ర, నీరవ్‌మోదీ లాంటి అతిపెద్ద జ్యువెలర్స్‌ను పరిశీలిస్తున్నామని సీనియర్ అధికారి ప్రకటించారు. వివిధ బ్యాంకులతో వారి లావాదేవీలను సీబీఐ, ఈడీ పరిశీలిస్తోందని చెప్పారు. మరోవైపు ముంబై బ్రాంచీలో కుంభకోణం పీఎన్‌బీ షేరు సైతం వరుసగా మూడో రోజూ నష్టాలతోనే ముగిసి 2శాతం పతనమైంది. ఈ భారీ స్కాం వెలుగు చూడటంలో మార్కెట్ రెగ్యులేటరీ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) విచారణ ప్రారంభించింది.


బలహీనంగా బ్యాంకింగ్ వ్యవస్థ : అసోచామ్

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు భారీ స్కాం భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థయొక్క దుర్బలత్వాన్ని సూచిస్తోందని ప్రముఖ రేటింగ్ ఏజన్సీ అసాచోమ్ వెల్లడించింది. పిఎన్‌బిలో జరిగిని 1.8 బిలియన్ డాలర్ల కుంభకోణానికి సంబంధించి ప్రభుత్వ రంగ సంస్థల బ్యాంకింగ్ పనితీరును తీవ్రంగా విమర్శించింది. రూ.11,300 కోట్ల కుంభకోణాన్ని పిఎన్‌బి బ్రాంచి నుండి సంబంధిత బ్యాంకింగ్ అధికారుల ద్వారానే జరగడం దేశ ఆర్థికవ్యవస్థ పని తీరుపై ప్రతికూల ప్రభావం చూపనుందని అసాచోమ్ ఒకప్రత్యేక ప్రకటనలో పేర్కొంది. పిఎన్‌బి ఉదంతంతో డిపాజిట్ దార్లలో విశ్వాసాన్ని కోల్పోకపోగా రానున్న ఎఫ్ఆర్‌డిఐ బిల్లుపై ప్రజల్ని మరింత ఆందోళనకు గురిచేస్తాయని తెలిపింది. భారతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నకొలదీ, బ్యాంకింగ్, ఇతర ఆర్థికవ్యవస్థలోని లోపాలు అంటువ్యాధిలాగా పెరిగిపోతున్నాయనీ వీటిని సంస్కరించుకోవలసిన తక్షణ అవశ్యకత ఉందని తెలిపింది. పీఎన్‌బీ సంఘటన ఇప్పటికైనా మన కళ్లు తెరిపించాలి.

హాస్యాస్పదంగా రెగ్యులేటర్ అయిన ఆర్‌బీఐ సమయానికి సమస్యనుగుర్తించలేదు. రొటీన్‌గా జరిగి సమస్యలో భాగంగానే అన్ని బ్రాంచీలలో ఆర్‌బీఐ తనిఖీ ఒకసాధారణ వ్యవహారంగానే సాగుతుందని అసోచామ్ సెక్రటరీ జనరల్ డిఎస్ రావత్ పేర్కొన్నారు.

ఆర్టీసీ పిండేసింది!

- 'స్పెషల్' పేరుతో ఘరానా దోపిడీ
- కాసులు కురిపించిన 'కోటప్పకొండ'
- టికెట్ చార్జీ నూరుశాతం పెంపు
- బెంబేలెత్తిన సామాన్య యాత్రికులు
- చర్చనీయాంశమైన యాజమాన్యం తీరు



విశాలాంధ్రబ్యూరో- అమరావతి: పండగొస్తే చాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కి కాసుల వర్షం కురుస్తోంది. ప్రశ్నించేవారులేకపోవడంతో ఇష్టారాజ్యంగా టికెట్ చార్జీలను పెంచేస్తూ లాభాలను ఆర్జిస్తోంది. గతంలో దసరా, సంక్రాంతి పర్వదినాలకు నడిపిన ప్రత్యేక బస్సులకు టికెట్ చార్జీపై 50 శాతం అదనంగా వసూలు చేసిన ఆర్టీసీ మహాశివరాత్రికి మరింత బరితెగించింది. రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాలకు ఆయా ప్రాంతాల నుంచి స్పెషల్ బస్సులను ఆర్టీసీ నడిపింది. ముఖ్యంగా శ్రీశైలం, శ్రీకాళహస్తి, పంచారామాలు, పట్టిసీమ, యాగంటి, మహానంది, కోటప్పకొండ.. ఇలా అనేక క్షేత్రాలకు భక్తులు లక్షలాదిగా తరలి వచ్చారు. ప్రసిద్ధి చెందిన కోటప్పకొండలో కొలువైయున్న శ్రీత్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందకు వచ్చే భక్తుల జేబులను ఖాళీ చేసింది. టికెట్ చార్జీని ఒక్కసారిగా రెట్టింపు చేసి పెనుభారాన్ని మోపింది. ఉన్నత, మధ్య తరగతి వర్గాలు పట్టించుకోలేదు కానీ.. సామాన్యులు పెరిగిన ధరలను చూసి బెంబేలెత్తిపోయారు. వృద్ధులు, పిల్లలతో వచ్చినవారు తప్పనిసరై స్పెషల్ బస్సుల్లోనే ప్రయాణించగా, మరికొందరు భారాన్ని భరింలేక కాలినడకనే కొండకు చేరుకోవాల్సిన పరిస్థితి. సాధారణ రోజుల్లో నరసరావుపేట నుంచి కోటప్పకొండపైకి టికెట్ చార్జి రూ. 23లు ఉంటుంది. పండగ రద్దీని దృష్టిలో పెట్టుకొని సంస్థ విజయవాడ, గుంటూరు రీజియన్లలోని పలు డిపోల నుంచి వందలాది బస్సులను రప్పించింది. అలాగే ఘాట్ రోడ్‌లో నడిపేందుకు తిరుమల ఘాట్‌రోడ్‌లో నడిచే 300 బస్సులను చిత్తూరు రీజియన్ నుంచి సమకూర్చింది. అంతా బాగానే ఉన్నప్పటికీ చార్జీలను ఒక్కసారిగా రెట్టింపు చేయడంతో యాత్రికులు కంగుతిన్నారు. నరసరావుపేట నుంచి కోటప్పకొండకు రూ. 25లు, అక్కడ నుంచి కొండపైకి వేరొక బస్సులో వెళ్లేందుకు రూ. 25లు చొప్పున మొత్తం రూ. 50లు వసూలు చేసింది. దీనికోసం కొండ కింద టోల్‌గేట్ పరిసరాల్లో తాత్కాలికంగా బస్‌స్టేషన్లను ఏర్పాటు చేసి ప్రత్యేక క్యూలైన్లలో భక్తులను బస్సుల్లో కొండపైకి సిబ్బంది తరలించారు. టికెట్ చార్జీలు ఒక్కసారిగా రెట్టింపు చేసిన ఆర్టీసీ తీరుపై విమర్శలు గుప్పించారు. వీఐపీలకు రాచమర్యాదలతో సూపర్ లగ్జరీ బస్సుల్లో కొండకు పంపడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా శ్రీశైలానికి నడిపిన స్పెషల్ బస్సుల్లో ఆయా కేటగిరిలను బట్టి 50 శాతం అదనంగా వసూలు చేశారు. ఇప్పటికే ఘాట్‌రోడ్ చార్జీల పేరుతో భారీగా దండుకుంటూ సగం చార్జీని అదనంగా వసూలు చేయడంపైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. శివరాత్రి సందర్భంగా ఆర్టీసీ వ్యవహరించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ప్రయాణీకులతో సేవాభావంతో వ్యవహరించాల్సిన ఆర్టీసీ పండగల్లో స్పెషల్ పేరుతో చేస్తున్న దోపిడీకి ప్రభుత్వం చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు. నష్టాల్లో ఉన్న సంస్థలను గట్టెక్కించేందుకు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా పండగలు, సెలవు రోజుల్లో అదనపు భారాన్ని మోపడం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అన్ని రకాల పండుగలకు ఇదే విధానాన్ని వర్తింప చేయాలి, లేకుంటే పూర్తిగా తొలగించాలనే డిమాండు క్రమంగా తెరపైకి వస్తోంది. దీనిపై త్వరలోనే కార్యాచరణ రూపొందించేందుకు కొన్ని సంస్థలు సిద్ధమవుతున్నాయి.

నిలదొక్కుకున్న రూపాయి



ముంబై: డాలర్ మారకంతో రూపాయి విలువ వరుసగా నాలుగో రోజు 63.81 వద్ద ముగిసింది. గత రెండువారాల్లో రూపాయి అత్యధికంగా నమోదై నట్లు తెలుస్తోంది. గురువారం రూపాయి 18పైసల లాభంతో 63.91 వద్ద ముగిసింది. అమెరికా డాలర్ విలువ వరుసగా నాలుగురోజులనుండి దిగజారుతూ ప్రధాన కరెన్సీలతో పోల్చి చూసుకుంటే మూడేళ్ల కనిష్టానికి దిగజారింది. డొమెస్టిక్ ఈక్విటీ మార్కెట్‌కూడా రూపాయి బలపడేందుకు దోహదపడింది.

రూపాయి విలువ పెరిగేందుకు...


▸ దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో బ్యాంకులు, ఎగుమతిదారుల ద్వారా డాలర్ డిమాండ్ పెరిగింది.

▸ డాలర్ ఇండెక్స్ 88.37కు పడిపోవడం, దీనితో ఈ వారం 2శాతానికి పైగా డాలర్ నష్టపోయింది. గత రెండేళ్లలో ఇదే అతి పెద్ద నష్టం. అమెరికాలో పెరుగుతున్న దిగుమతుల నేపథ్యంలో డాలర్‌విలువ పడిపోయింది.

ఒనిడా నుంచి నూతన ఇన్వర్టర్ ఎయిర్ కండీషనర్లు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: లీడింగ్ కన్స్యూమర్ డ్యూరబుల్ కంపెనీగా పేరొందిన మైక్రో ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (ఒనిడా) తాజాగా 84 మోడళ్ల నూతన ఇన్వర్టర్ ఎయిర్ కండీషనర్ మోడళ్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ విభాగంలో రూ.720 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకునేలా వీటిని ఆవిష్కరించినట్లు సంస్థ సీఈఓ సుందర్ తెలిపారు. ఈ నూతన ఎయిర్ కండీషనర్లు 170 శాతం పవర్‌ఫుల్ కూలింగ్‌ను అందించడంతో పాటు విద్యుత్‌ను ఆదాచేస్తాయని, పర్యావరణ హితానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఎయిర్ కండీషనర్ల మార్కెట్‌లో సంస్థ 8 శాతం వాటాను కలిగివుందని, ఇప్పుడు దీని స్థాయి పెరగనుందని తెలిపారు.

రూ.9కే అపరిమిత కాల్స్!



న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ మరో బ్రహ్మాండమైన ఆఫర్‌ను ప్రకటించింది. రిలయన్స్ జియో రూ.19కి పోటీగా కేవలం రూ.9కే రోజంతా అపరిమితంగా కాల్స్ చేసుకునేలా సరికొత్త ఎంట్రీ లెవల్ రీచార్జ్ ప్యాక్‌ను ప్రకటించింది. ఈ ప్యాక్‌లో భాగంగా ఒక రోజు కాలపరిమితితో అపరిమిత కాల్స్, 100 ఎంబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు పొందవచ్చు. ఎయిర్‌టెల్‌లో ఇప్పటికే రూ.23 ప్యాక్ ఉంది. ఈ రీచార్జ్ ప్యాక్‌లో ఖాతాదారులు రెండు రోజుల పాటు అపరిమితంగా లోకల్/ఎస్టీడీ కాల్స్ చేసుకోవచ్చు. 200 ఎంబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. ఎయిర్‌టెల్ రూ.9 ప్లాన్‌ను కంపెనీ మొబైల్ అప్లికేషన్ నుంచి కానీ, వెబ్‌సైట్ నుంచి కానీ పొందవచ్చని ఎయిర్‌టెల్ తెలిపింది. రిలయన్స్ జియో రూ.19 ప్యాక్‌లో వినియోగదారులకు ఒక రోజు కాలపరిమితితో అపరిమిత కాల్స్, 20 ఎస్సెమ్మెస్‌లు, 150 ఎంబీ డేటా లభిస్తుండగా ఎయిర్‌టెల్ రూ.9 ప్యాక్‌లో అపరిమిత కాల్స్‌తో పాటు 100 ఎంబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి.

విజ్ఞానం

గుండె శస్త్రచికిత్స జరిగిన

పిల్లల్లో వినికిడిలోపం



గుండె శస్త్ర చికిత్సతో చిన్నారుల్లో వినికిడి లోపానికి దారితీయ వచ్చునని తెలుస్తోంది. శిశువుల్లో పెరుగుతున్న గుండె వ్యాధులు నాలుగేళ్ల వయసువచ్చేనాటికి భాష సమస్యతోపాటు పలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసివస్తుందని పరిశోధకులు వెల్లడించారు. 348మంది ప్రిస్కూల్ పిల్లలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వారిలో 21శాతం మందికి వినికిడిలోపం ఉన్నట్లు గ్రహించారు. సాధారణ పిల్లలతో పోలిస్తే 20రెట్లు ఈ సమస్యల అధికంగా ఉందని చెప్పవచ్చు. చిన్నారుల్లోని న్యూరోడెవలప్‌మెంటల్ సమస్యలతోపాటు 75 మందికి వినికిడి సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. 37వారాల కన్నా ముందుపుట్టిన శిశువుల్లో జనెటిక్ ఇబ్బందులతోపాటు దీర్ఘకాల ప్రసవానంతర నిడివి ఎక్కువగాఉండటం వంటి సమస్యలతో వినికిడి సమస్యల రావచ్చునని ఫిలడెల్ఫియాలోని పిల్లల ఆసుపత్రి నిపుణులు వెల్లడించారు. గుండె వ్యాధులుఉన్న పిల్లల్లో ఆపరేషన్ తరువాత,ముందు కూడా అత్యంత జాగరూకత వహించవలసిఉందని నిపుణులు సూచిస్తున్నారు.

సౌర వ్యవస్థ వెలుపల 100 గ్రహాలా...!



మన సౌర వ్యవస్థకు వెలుపల సుమారు 100 నూతనగ్రహాలు ఉన్నట్లు తెలుస్తోంది. డెన్మార్క్ టెక్నికల్ యూనివర్సిటీకి చెందిన ఆండ్ర్యూ మాయో చేపట్టిన అధ్యయనంలో 95శాతం గ్రహాలు నూతనంగా అన్వేషించినవేనని తెలిపారు. 2014లో కెఈ విడుదల చేసిన డేటాను ప్రాతిపదికగా తీసుకుని వీరు అధ్యయనం చేసినట్లు ఆస్ట్రోనామికల్ జర్నల్‌లో వెలువడింది. మాయో కొలీగ్స్ చేపట్టిన అన్వేషణలో గ్రహాల నుండి వెలువడే వందలాది సిగ్నల్స్ ద్వారా వీరు పరీక్షలు చేపట్టారు. ఇవిరావడానికి కారణాలను అన్వేషించారు. కొన్ని స్పేస్‌క్రాఫ్ట్ నుండి వెలువడే ధ్వనుల ద్వారా ఈ సిగ్నల్స్‌వస్తున్నాయా లేదా నక్షత్రాల సమూహం నుండి వస్తున్నాయా అనే దానిపై విశ్లేషణ చేపట్టారు. జూపిటర్ అంతకన్నా పెద్దవిగా ఉన్నటు వంటి గ్రహాల ద్వారానే ఈ సిగ్నల్స్ వస్తున్నట్లు గ్రహించారు. ఒక గ్రహం అయితే అత్యంత వెలుగ్గా ప్రకాశవంతమైన నక్షత్ర కక్ష్యలో ఉన్నట్లు తెలుస్తోంది.

శ్రీచైతన్యకు అధిక ర్యాంకులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌టీఎస్‌ఈ స్టేజ్-1 (2017) పరీక్షలో అన్ని కేటగిరీల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు నుంచి 10వ ర్యాంకు వరకు మొత్తం 20 ర్యాంకులను శ్రీచైతన్య విద్యార్థులు కైవసం చేసుకున్నారు. రాష్ట్రం నుంచి ఎంపికైన 118 మందిలో 30మంది తమ విద్యార్థులేనని శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఏపీలో 1, 2, 3 ర్యాంకులతో పాటు టాప్ 10 ర్యాంకులనూ కైవసం చేసుకున్నారన్నారు. ఏడేళ్లుగా శ్రీచైతన్య స్కూల్-టెక్నో కరిక్యులమ్ ఎన్‌టీఎస్‌ఈలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ నెం.1గా కొనసాగుతున్నామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి విద్యాసంస్థల చైర్మన్ డా.బీఎస్ రావు అభినందనలు తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సి-బ్యాచ్, సి-ఐపిఎల్, మెడికాన్, ఎంపిల్ వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్ వల్లే ఇలాంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయన్నారు.



మొండి బకాయిలు చెల్లించాలని

కార్పొరేషన్ బ్యాంకు ఉద్యోగుల ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఖాతాదారుల చైతన్యానికి కార్పొరేషన్ బ్యాంకు కార్యక్రమాన్ని చేపట్టింది. మొండి బకాయిలు చెల్లించాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని రాఘవ మల్టీస్పెషల్ ఆసుపత్రి వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఖాతాదారులు తీసుకున్న రుణాలన్నింటినీ సకాలంలో చెల్లించాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు కొనసాగనున్నది. మొండి బకాయిల వసూళ్ల కోసం కార్పొరేషన్ బ్యాంకు ఈ కార్యక్రమం చేపట్టింది. హల్లాబో ప్రచారం పేరుతో బ్యాంకు ఉద్యోగులు ప్లకార్డులు చేబూని ప్రదర్శన నిర్వహించారు. కార్పొరేషన్ బ్యాంకును పరిరక్షించండి, మొండి బకాయిలు చెల్లించండి అంటూ నినదించారు. ఆసుపత్రికి చెందిన డా॥ కేవీ రమణారావు 1995లో కార్పొరేషన్ బ్యాంకు నుంచి రూ.5 లక్షలు రుణం తీసుకున్నారు. వైద్య పరికరాల కోసం తీసుకున్న రుణాన్ని దాదాపు 23 ఏళ్లు గడుస్తున్నా చెల్లించడం లేదు. తీసుకున్న రుణాన్ని చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అనేక విచారణలు పూర్తయినప్పటికీ రుణం తీసుకున్నవారు రుణాలు చెల్లించేందుకు ముందుకు రాకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో ప్రదర్శన నిర్వహించినట్లు బ్యాంకు సీజీఎం అనిత వెల్లడించారు.

పియర్‌ల వినియోగంతో ఆరోగ్య ప్రయోజనాలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: పియర్‌ల వినియోగంతో పేగు ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడుతుందని, సంబంధిత ఆరోగ్య ప్రయోజనం చేకూర్చేందుకు అవకాశం ఉంటుందని నిరూపితమైందని పియర్స్ సంస్థ నేడొక ప్రకటనలో తెలిపింది. పియర్‌లో పీచు పదార్థం ఎక్కువగా ఉండి, అత్యధిక విటమిన్ సితో పాటు 100 కేలరీల శక్తిని అందిస్తుంది. డా॥ స్లేవిన్, రైల్యాండ్ పియర్లపై నిర్వహించిన అధ్యయనంలో వాటిలో ఎక్కువగా ఫ్రక్టోజ్, స్టోరిబాల్, దయటరీ ఫైబర్ ఉంటాయని గుర్తించారు. పియర్‌లను తీసుకోవటం వల్ల కలిగే ఆరోగ్య ఫలితాలు, శరీరంపై అవి చూపే ప్రభావాలపై సాక్ష్యాలు పరిమితంగా ఉన్నప్పటికీ, యూఎస్ఏ పియర్స్ ఆమోదంతో నిర్వహించిన అధ్యయనాలు పియర్‌లతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విస్తృతంగా తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని సంస్థ తెలిపింది.

స్క్రీన్ షేరింగ్ కోసం





కంప్యూటర్‌లో ఏదైనా సమస్యను పరిష్కరించడానికి గానీ, లేదా ఇతర అవసరాలకుగానీ వేరే ప్రదేశంలో ఉన్న మిత్రులతో మన కంప్యూటర్ స్క్రీన్‌ని షేర్ చేయదలచుకుంటే అందరికీ మొదట గుర్తుకు వచ్చేది 'టీమ్ వ్యూయర్'. దానికి బదులుగా ఇంకా అనేక స్క్రీన్ షేరింగ్ టూల్స్ లభిస్తున్నాయి. వాటిగురించి తెలుసుకుందాం.

AnyDesk

http://anydesk.com అనే లింక్‌నుండి ఈ సాఫ్ట్‌వేర్‌ని పొందవచ్చు. మన రోజువారీ స్క్రీన్ షేరింగ్ అవసరాలకు ఇది సరిపోతుంది. Windows, Linux, Mac, Free BSD, Android, iOS వంటి అన్ని రకాల పాపులర్ ఆపరేటింగ్ సిస్టమ్‌లను ఇది సపోర్ట్ చేస్తుంది. అవతలి కంప్యూటర్‌లో ప్లే అవుతున్న ఆడియో, వీడియోని కూడా ఇది ప్రసారం చేస్తుంది. అలాగే రెండు డివైజ్‌లకి మధ్య ఫైళ్లని కూడా ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు.

Lite Manager

www.litemanager.com/produkts/LiteManager Free అనే లింక్‌లో లభించే అత్యంత శక్తివంతమైన స్క్రీన్ షేరింగ్ సాఫ్ట్‌వేర్ ఇది. ఇది సర్వర్, వ్యూయర్ అనే రెండు వెర్షన్లుగా లభిస్తుంది. వ్యూయర్‌లో 30 కంప్యూటర్ల వరకు మానిటర్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఐ.టి. మేనేజర్లకి ఇది బాగా పనికివస్తుంది. విండోస్, Mac, iOS లను ఇది సపోర్ట్ చేస్తుంది.

Remote Utilities

www.remoteutilities.com/product/ అనే లింక్‌లో ఇది లభిస్తుంది. ఛాట్, స్క్రీన్ రికార్డింగ్, రిమోట్ రిజిస్ట్రీ వంటి అనేక ఆప్షన్లను ఇది అందిస్తుంది.

మొబైలే... కంప్యూటర్‌లా



స్మార్ట్‌ఫోన్ తెర, యాప్ ఐకాన్లు లాంటివాటిలో మార్పులు తీసుకొచ్చే లాంచర్లు చాలా ఉన్నాయి. అయితే మొబైల్‌ను ఏకంగా కంప్యూటర్‌లా మార్చేవి మాత్రం కొన్నే ఉన్నాయి. వాటిలో Leena Desktop UI ఒకటి. దీన్ని మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే స్క్రీన్ కంప్యూటర్ తరహాలో కనిపిస్తుంది. మెనూ బార్ కనిపించే విధానం నుంచి, యాప్ ఐకాన్‌లు వరకు అన్నీ మారిపోతాయి. ఒకేసారి స్క్రీన్ మీద ఒకటికిమించి యాప్‌లు ఓపెన్ చేసుకోవచ్చు.* https://goo.gl/BF3xyk

'ఐ'తో రెండు మొబైళ్లు




ఐఫోన్‌లో ఆండ్రాయిడ్... ఈ మాట చాలా రోజులుగా వినిపిస్తోంది. అయితే అది లాంచర్ల వరకు పరిమితమైపోయింది. ఆండ్రాయిడ్ తరహా లాంచర్ వేసుకోవడం వల్ల ఐఫోన్ స్క్రీన్, ఐకాన్లు కనిపించే విధానం మాత్రమే మారుతుంది. ఇప్పుడు ఏకంగా ఐఫోన్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌గా వాడుకోగలిగే గ్యాడ్జెట్ సిద్ధమవుతోంది. దీని పేరు Eye. మొబైల్ బ్యాక్ కేస్‌లా ఉండే ఈ గ్యాడ్జెట్‌ను జోడించి మీ ఆపిల్ ఫోన్‌ను, ఆండ్రాయిడ్ ఫోన్‌గానూ వాడుకోవచ్చు. తాకే తెర, సిమ్ స్లాట్ లాంటి అంశాలతో ఈ బ్యాక్ కవర్ అచ్చంగా మొబైల్ లాగే కనిపిస్తుంది. మీ ఐఫోన్‌ను దీనికి కనెక్ట్ చేస్తే.. గ్యాడ్జెట్ తెర యాక్టివేట్ అవుతుంది. ఆ తర్వాత ఒకేసారి ఒకవైపు ఆపిల్ ఫోన్, మరోవైపు ఆండ్రాయిడ్ ఫోన్‌ను వాడుకోవచ్చు. 'ఐ' స్పెసిఫికేషన్లు చూస్తే... అమోలెడ్ డిస్‌ప్లే ఉంటుంది. డ్యూయల్ సిమ్ స్లాట్, ఎన్ఎఫ్‌సీ, ఇన్‌ఫ్రారెడ్, వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయాలుంటాయి. దీని ధర సుమారు 189 డాలర్లు. ప్రస్తుతానికి ఐఫోన్ 6,7 సిరీస్ మొబైళ్లకు ఈ కేస్ సపోర్టు చేస్తుంది.



కదిపితే మోత మోగుతుంది

జనసందోహం ఎక్కువగా ఉన్నచోట జేబు దొంగలు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఎక్కువగా మొబైల్స్ దొంగిలిస్తుంటారు. జేబు నుంచి మొబైల్ తీశారో లేదో వెంటనే సైరన్ మోగితే... ఎలా ఉంటుంది? మీ మొబైల్‌లో Pocket Sense యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే అదే జరుగుతుంది. ఈ యాప్ ఇన్‌స్టాల్ అయి ఉన్న మొబైల్‌ను జేబు నుంచి తీసిన వెంటనే దాని నుంచి సైరన్ మోగుతుంది. అంతేకాదు చాలా సేపటి నుంచి కదపకుండా ఉన్న ఫోన్‌ను ఏ మాత్రం కదిపినా ఇదే సూచన వస్తుంది.* https://goo.gl/ugZexK



సులువుగా... దారి!

మూడో ఫ్లోర్‌లోకి ఎంటర్ అవ్వగానే కుడివైపు నాలుగు అడుగులేయ్... ఆ తర్వాత ఎడమవైపు పది అడుగులేస్తే... అదే మీకు కావల్సిన డిపార్ట్‌మెంట్. చాలా ఆఫీసుల్లో అడ్రస్‌లు ఇలానే చెబుతుంటారు. ఇకపై ఇలాంటి ఇబ్బందులు అక్కర్లేదు. ఆఫీసులు, పెద్ద ఇల్లు, షాపింగ్ మాల్స్‌లో దారి చెప్పడానికి వీలుగా PathGuide పేరుతో మైక్రోసాఫ్ట్ ఓ యాప్‌ను విడుదల చేసింది. ఈ యాప్ తొలుత దారిని రికార్డు చేసుకుంటుంది. దీని కోసం నమోదు ప్రక్రియ ప్రారంభంలో మీరు నిల్చున్న స్థానంలో ఉన్న ల్యాండ్‌మార్క్‌ను ఫొటో తియ్యాలి. మళ్లీ లక్ష్యానికి చేరగానే మరో ఫొటో తియ్యాలి. మధ్యలో మీరు వేసిన అడుగుల సంఖ్య, తిరిగిన మలుపుల్ని యాప్ రికార్డు చేసుకుంటుంది. ఆ వివరాల్ని సామాజిక అనుసంధాన వేదికల్లో షేర్ చేసుకోవచ్చు.

* https:///goo.gl/oTXSmL

అన్నీ నోట్ చేస్తుంది

- ఆఫీసు మీటింగ్‌లో మీరు మాట్లాడిందంతా ఎవరైనా నోట్ చేసిస్తే బాగుండనిపించిందా?
- జాగింగ్ చేస్తుండగా వచ్చిన ఆలోచనలు రాద్దామంటే పరుగు ఆపాల్సి వస్తోందా?



మీకూ ఎప్పుడో ఒకసారి ఇలాంటి పరిస్థితులు వచ్చే ఉంటాయి. ఇలా రాసుకోలేని పరిస్థితుల్లో మీరు చెప్పిన విషయాలు రికార్డు అయి, తర్వాత వినగలిగితే, ఆ మాటలను అక్షరాల రూపంలో చూడగలిగితే బాగుంటుంది కదా. Senstone వాయిస్ రికార్డర్ ఈ పని చేసి పెడుతుంది. పెద్దసైజు చొక్కా బటన్‌లా ఉండే దీన్ని కాలర్‌కు తగిలించుకోవాలి. ఆ తర్వాత మీరు ఏదైనా రికార్డు చేయాలనుకున్నప్పుడు దానిపై తడితే చాలు. మీ మాటల్ని అది రికార్డు చేసుకుంటుంది. మళ్లీ తడితే రికార్డింగ్ ఆగిపోతుంది. బ్లూటూత్‌తో మొబైల్‌కు కనెక్ట్ చేస్తే ఆ సమాచారమంతా అనుబంధ మొబైల్‌లో ఆప్‌లో నిక్షిప్తమైపోతుంది. వాయిస్‌తోపాటు, టెక్స్ట్ కూడా ఆప్‌లో కనిపిస్తుంది. ప్రయోగ దశలో ఉన్న ఈ రికార్డరును త్వరలో మార్కెట్‌లోకి తీసుకొస్తారు. ఇది 11 భాషలను గుర్తిస్తుంది.

క్లిక్ చేయ్... సెర్చ్ చేయ్

ప్రయాణంలో ఏదో పుస్తకం చదువుతున్నారు... అందులోని సమాచారంలో ఏదో సందేహం వచ్చింది... వెంటనే మొబైల్‌లో గూగుల్ ఆన్ చేసి దాని కోసం సెర్చ్ చేస్తారు. సమాచారం శోధన వరకు సరే కానీ... దాని కోసం పుస్తకం పట్టుకొని కీబోర్డు మీద టైప్ చేయాలంటే ఇబ్బంది.

అలాకాకుండా ఆ సందేహం లేదా ప్రశ్నను ఫొటో తీస్తే సమాధానం వచ్చేలా ఉంటే బాగుంటుంది కదా.

Socratic- Homework answers యాప్‌తో ఈ పని చేయొచ్చు. దీంట్లోని కెమెరా ఐకాన్‌తో ఆ ప్రశ్నను ఫొటో తీస్తే... అది ఇంటర్నెట్‌లో దానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి మీకు అందిస్తుంది.

* https://goo.gl/wMECpm



అ... సంథింగ్ స్పెషల్ సినిమా !

నటీనటులు: కాజల్, రెజీనా, నిత్యామీనన్, ఇషా, అవసరాల, మురళీశర్మ, సంగీత దర్శకుడు మార్క్ కె రాబిన్, సినిమాటోగ్రఫీ కార్తీక్ ఘట్టమనేని, బ్యానర్ వాల్ పోస్టర్ సినిమా, నిర్మాత పశాంతి తిపిర్నేని, ఎడిటింగ్ గౌతమ్ నేరేడు, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం ప్రశాంత్ వర్మ

కొత్త కథ, కొత్త కాన్సెప్ట్, తెలుగుతెరపై ఇప్పటివరకు ఎవరూ చూడలేదు. ఏ జానర్‌కూ చెందని సినిమా ఇది. సినిమాలో ప్రతి సన్నివేశం "అ!" అనిపిస్తుంది. ఈ మూవీకి సంబంధించి మేకర్స్ చెబుతూ వచ్చిన మాటలివి. మరి వాళ్లు చెప్పే రేంజ్‌లో సినిమా ఉందా..? థియేటర్లలోకొచ్చిన "అ!" ఎక్స్‌క్లూజివ్ రివ్యూ

కథ

స్టోరీ విషయానికొస్తే ఓ రెస్టారెంట్‌లో ప్రియదర్శి ఓ షెఫ్. కిచెన్‌లో ఓ ఎక్వేరియం ఉంటుంది. అందులో చేపలా నాని ఉంటాడు. ఎక్వేరియం పక్కనే ఓ బొన్సాయ్ చెట్టు ఉంటుంది. ఆ చెట్టు రవితేజ. ఇక రెస్టారెంట్‌లో పనిచేసే అమ్మాయిగా రెజీనా కనిపిస్తుంది. అదే రెస్టారెంట్‌లో వాచ్‌మెన్‌గా అవసరాల శ్రీనివాస్ కనిపిస్తాడు. వృత్తిపరంగా వాచ్‌మెన్ అయినా, వ్యక్తిగతంగా సైంటిస్ట్ కూడా. అలాంటి రెస్టారెంట్‌కు ఇషా, నిత్యామీనన్ వస్తారు. వాళ్లనుంచే సినిమా స్టార్ట్ అవుతుంది. నిత్యామీనన్‌ను తను పెళ్లాడతానంటుంది ఇషా. అది విన్న ఇషా తల్లిదండ్రులు షాక్ అవుతారు. ఇదొక ప్లాట్ నడుస్తుంటుంది. మరోవైపు అవసరాల శ్రీనివాస్ తన తల్లిదండ్రుల్ని కలుసుకోవడం కోసం టైంమెషీన్ కనిపెట్టడానికి ప్రయత్నిస్తుంటాడు. ఇదొక ట్రాక్ నడుస్తుంది. మరోవైపు డబ్బు సంపాదించి లైఫ్ సెటిల్ అయిపోవాలనే ట్రాక్‌లో రెజీనా కనిపిస్తుంది. వీళ్లంతా కాజల్‌తో ఎలా కనక్ట్ అయ్యారు. అసలు వీళ్లకు కాజల్‌కు సంబంధం ఏంటి. ఇంతకీ కాజల్ ఎవరనేది ఈ సినిమా స్టోరీ.

ఈ సినిమా కథను ఇంతకంటే చెప్పేయడం సబబు కాదు. కానీ ప్రేక్షకుల అవగాహన కోసం పాత్రలు, కథాంశాన్ని మాత్రం వివరించాం. చిన్నతనం నుంచి లైంగిక వేధింపులకు గురైన ఓ మహిళ ఎలా ఆ ప్రభావానికి లోనతువుంది.. దాన్నుంచి బయటపడేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసింది. అనేది ఈ సినిమా బేసిక్ లైన్. కథ మొత్తం కాజల్ చుట్టూ తిరుగుతుంది. ఆ విషయం కూడా క్లయిమాక్స్‌లో తెలుస్తుంది.

ప్లస్ పాయింట్స్: ఈ సినిమా కథ, నాని, రవితేజ వాయిస్ ఓవర్, సామాజిక సందేశం, అద్భుతమైన సినిమాటోగ్రఫీ,అత్యద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోరీ, అదరగొట్టిన ఆర్ట్ వర్క్, నటీనటుల పెర్ఫార్మెన్స్

మైనస్ పాయింట్స్: కాన్సెప్ట్ అర్థంకాకపోతే సినిమా ఎక్కదు, కథ చాలామందికి నచ్చదు, అసలైన థ్రెడ్ ఏదైతో ఉందో అది బోర్ కొట్టిస్తుంది,

ఈ కాన్సెప్ట్ కు రీచ్ తక్కువ, బి, సి సెంటర్లకు బోర్





ఇక నటీనటుల విషయానికొస్తే ఇందులో ఎవర్నీ తక్కువ చేయడానికి వీల్లేదు. అంతా తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ఇషా, నిత్యామీనన్, కాజల్, రెజీనా.. ఇలా ఎవరి పాత్రలకు వాళ్లు న్యాయం చేశారు. ఎవరూ ఎక్కువ కాదు, ఎవరూ తక్కువ కాదు. కాకపోతే కీలకమైన అవసరాల పాత్రను ఇంకాస్త డీటెయిల్డ్ గా వివరించి ఉంటే బాగుండేది. సినిమాపై నెగెటివ్ కామెంట్స్ పడడానికి ఇదొక కారణం

ఇక టెక్నికల్‌గా కూడా సినిమా ఉన్నతంగా ఉంది. మరీ ముఖ్యంగా ఆర్ట్ వర్క్ అద్భుతం. చిన్న చిన్న విషయాల్లో కూడా ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. ఇక కార్తీక్ సినిమాటోగ్రాఫీ మరో హైలెట్. వీటికి తోడు రాబిన్ సంగీతం అందర్నీ కనెక్ట్ చేస్తూ, బాగా సింక్ అయింది.

అసలు వీళ్లందరికంటే సాంకేతికంగా ముందుగా అభినందించాల్సిన వ్యక్తి దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఇలాంటి కథ రాసుకోవడమే సాహసం అనుకుంటే, దానితో నానిని ఒప్పించడం మరో సాహసం. ఇలాంటి కథకు తనే నిర్మాతగా మారడం మరో సాహసం. ఇలా చెప్పుకుంటూ పోతే సినిమాలో చాలా సాహసాలే కనిపిస్తాయి. కానీ కథ కొత్తదే అయినా అందరికీ కనెక్ట్ మాత్రం కాదు. మరీ ముఖ్యంగా థ్రెడ్ మిస్ అయిన వాళ్లకు అస్సలు అర్థం కాదు. కాస్త కొత్తదనం కోరుకునే వాళ్లకు మాత్రమే ఈ సినిమా నచ్చుతుంది. దీనికితోడు బి, సి సెంటర్లలో ఆడే స్టఫ్ ఇందులో లేదు. నాని చెప్పినట్టు ఇందులో కమర్షియల్ ఎలిమెంట్స్ మచ్చుకైనా కనిపించవు.



ఇంతకుముందే చెప్పుకున్నట్టు ఈ సినిమా కథ నిజంగానే కొత్తగా ఉంది. కాకపోతే అక్కడక్కడ మనమంతా, చందమామకథలు లాంటి సినిమాలతో పాటు పలు హాలీవుడ్ సినిమాల ఛాయలు కనిపిస్తూనే ఉంటాయి. కానీ క్లయిమాక్స్‌లో అసలు విషయాన్ని ఒక్కసారిగా రివీల్ చేసిన విధానం చాలా బాగుంది.

ఫైనల్ గా చెప్పాలంటే ఇది సస్పెన్స్ సినిమా కాదు, హారర్ మూవీ కాదు, థ్రిల్లర్ సబ్జెక్ట్ కాదు, రొమాంటిక్ మూవీ కాదు, యాక్షన్ మూవీ కాదు.. కానీ ఇవన్నీ ఇందులో ఉన్నాయి. అందుకే "అ!" సినిమా సంథింగ్ స్పెషల్ గా నిలిచిపోతుంది. అయితే ఇది కమర్షియల్‌గా ఎంత సక్సెస్ అవుతుందనేది అప్పుడే చెప్పలేం.

బాటమ్ లైన్ నిజంగానే "అ!" అనిపించింది

'ఇదం జగత్'లో ఫొటోజర్నలిస్ట్‌గా సుమంత్



సక్సెస్ కోసం వైవిధ్యభరిత కథాంశాల వెంట పడుతున్నాడు సుమంత్. ఈ క్రమంలో సుమంత్ నటిస్తోన్న కొత్త సినిమాకు ఓ డిఫరెంట్ టైటిల్‌ను ఫిక్స్ చేసేశారట. కొన్నేళ్ల నిరీక్షణ తర్వాత 'మళ్లీ రావా' సినిమాతో తిరిగి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నాడు సుమంత్. ఈ సినిమా తర్వాత వెంటనే మరో యువదర్శకుడితో సినిమా మొదలెట్టిన సుమంత్ తాజాగా షూటింగ్ కూడా కంప్లీట్ చేసేశాడట. అనిల్ శ్రీకంఠం దర్శకుడిగా పరిచయం అవుతోన్న ఈ సినిమాకు తాజాగా టైటిల్ ను ఖరారు చేశారట. 'ఇదం జగత్' అనే వైవిధ్యమైన టైటిల్‌ను ఈ సినిమాకు ఫైనల్ చేసినట్టు తెలుస్తోంది. థ్రిల్లర్ జానర్‌లో రూపొందుతోన్న 'ఇదం జగత్' చిత్రంలో సుమంత్ ఫొటోజర్నలిస్ట్‌గా నటిస్తున్నాడట. అంతేకాక నెగటివ్ టచ్ ఉండే పాత్రలో సుమంత్ కనిపిస్తాడనే ప్రచారం కూడా జరుగుతోంది. ఈ తరహా పాత్రల్లో నటించడం సుమంత్‌కు ఇదే తొలిసారి. మలయాళ హిట్ మూవీ 'ప్రేమమ్'లో నటించిన అంజు కురియెన్.. సుమంత్ సరసన కథానాయికగా కనిపించబోతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోన్న ఈ మూవీని వేసవిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. మరి ఈ సినిమాతో సుమంత్ కెరీర్ కు ఓ బెస్ట్ హిట్ లభిస్తుందేమో చూడాలి.

తొలిప్రేమ టీమ్‌ని అభినందించిన చిరంజీవి



వరుణ్ తేజ్ తొలిప్రేమ సెకండ్ వీక్ సక్సెస్ ఫుల్ గా ప్రదర్శించబడుతోంది. వెంకీ అట్లూరి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా, యూత్ తో పాటు ఫ్యామిలీస్ ని కూడా అదే రేంజ్ లో ఎంటర్ టైన్ చేస్తోంది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి 'తొలిప్రేమ' టీమ్‌ని అభినందించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ మాట్లాడుతూ "పవన్ 'తొలిప్రేమ' టైటిల్ తో వచ్చిన ఈ సినిమాపై బిగినింగ్ నుండే క్యూరియాసిటీ రేజ్ అయింది. కాకపోతే నేను కాస్త ఆలస్యంగా చూశాను. చాలా ఇన్స్ పైరింగ్‌గా ఉంది మూవీ. కథ కన్నా సిచ్యువేషనల్ గానే సినిమా అంతా ఉంటుంది. ఇలా సినిమా చేయడం డైరెక్టర్‌కి చాలా పెద్ద ఛాలెంజిగ్. సినిమా ఇంత ఫ్రెష్‌గా ఉందంటే కంప్లీట్ క్రెడిట్ డైరెక్టర్ కే దక్కుతుంది. సినిమాని ఒక కొత్త యాంగిల్‌లో ప్రెజెంట్ చేశారు. ఇలాంటి డైరెక్టర్స్ ఇండస్ట్రీకి రావాలి." అన్నారు. బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమాలో వరుణ్ తేజ్ సరసన రాశిఖన్నా నటించింది. తమన్ మ్యూజిక్ కంపోజర్.

దిల్ రాజు బ్యానర్‌లో నాని



'నేను లోకల్', 'యంసిఎ' లాంటి బ్లాక్ బస్టర్స్ తరవాత మరోసారి దిల్ రాజు బ్యానర్‌లో సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు నాని. సంవత్సరానికి మినిమం 3 సినిమాలు కంపల్సరీ అనే రూల్ ని స్ట్రిక్ట్ గా ఫాలో అయిపోతున్న నాని, రీసెంట్‌గా దిల్ రాజు చెప్పిన స్టోరీ లైన్ విని ఇంప్రెస్ అయ్యాడని తెలుస్తోంది. ఈ నెల 24 న పూజా కార్యక్రమాలతో లాంచ్ కానున్న శ్రీరామ్ ఆదిత్య మూవీలో నాగార్జునతో కలిసి నటించనున్న నాని, మరో వైపు దిల్ రాజు రీసెంట్ గా ఒక స్టోరీ లైన్ చెప్పాడని, దానికి నాని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడనే రూమర్ కాస్త గట్టిగానే వినిపిస్తోంది. ఈ ఇంట్రెస్టింగ్ రూమర్ అఫీషియల్‌గా ట్రాన్స్ ఫామ్ అయితే కానీ, ఈ సినిమా డైరెక్టర్ విషయంలో క్లారిటీ రాదు. ప్రస్తుతం కృష్ణార్జున యుద్ధం సెట్స్ పై ఉన్న నాని, ఇప్పటికే హను రాఘవపూడి, విక్రమ్ కుమార్‌లతో సినిమాలకి కమిట్ అయి ఉన్నాడు.

47 డేస్ లోని క్యా కారోన్ పాటకు సూపర్ రెస్పాన్స్



టైటిల్ కార్డ్ ఎంటర్‌టైన్మెంట్‌లో మ్యూజిక్ డైరెక్టర్ రఘు కుంచె నిర్మాతగా మారి నిర్మిస్తున్న సినిమా "47 డేస్".. "ది మిస్టరీ అన్ ఫోల్డ్స్" అనేది ట్యాగ్ లైన్. సత్యదేవ్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమా ద్వారా ప్రదీప్ మద్దాలిన దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో ఈ సినిమా తెరకెక్కబోతోందని సమాచారం. హరితేజ, రవివర్మ, శ్రీకాంత్ అయ్యంగార్,ఇర్ఫాన్, బేబి అక్షర, ముక్తార్ ఖాన్, సత్య ప్రకాష్, కిరీటి, అశోక్ కుమార్ వంటి నటులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ మూవీ ఆడియన్స్‌కు డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతుందని తెలుస్తోంది. ఈ సినిమాలోని క్యా కరోన్ పాటను పూరి జగన్నాధ్ విడుదల చేశారు. సాంగ్ రిలీజ్ అయిన కొద్దిసమయంలోనే పాపులర్ అయ్యింది. ముఖ్యంగా ఈ పాటలోని లిరిక్స్ ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ రచయిత లక్ష్మి భూపాల ఈ పాటను రచించడం విశేషం.

ఎన్డీటీవీ వ్యవస్థాపకుడు రాయ్ పలాయనం : స్వామి

న్యూఢిల్లీ : బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి, ఎన్డీటీవీ వ్యవస్థాపకుడు-ప్రమోటర్ ప్రణయ్ రాయ్ మధ్య ఘర్షణ రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. అయితే స్వామి తాజాగా వ్యాఖ్యలతో అది ఉగ్రరూపం దాల్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాయ్ కోసం లుకవుట్ నోటీసులు జారీ చేయాల్సిందిగా స్వామి ట్విట్టర్ ద్వారా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఐటీ శాఖను కోరారు. రాయ్ దేశం నుంచి పారిపోయారని, ఆయన దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు వెళ్లివుంటారంటూ స్వామి ట్వీట్ చేశారు. పత్రికాస్వేచ్ఛను పెంపొందించే విధంగా ఎన్డీటీవీపై ఆర్థిక మోసాల కేసులలో సీబీఐ దర్యాప్తును నిలిపివేయాలని కోరుతూ రాయ్ ఇంతకుముందు ప్రధాని మోడీకి లేఖ రాశారు. స్వామి ట్వీట్‌పై వెంటనే స్పందించిన రాయ్ 'స్వామి ఒట్టి అబద్ధాలకోరు' అని విమర్శించారు. 2017, జూన్‌లో రాయ్ ఇంటిపై సీబీఐ దాడులు చేయడం తెలిసిందే. మొన్న మద్యం వ్యాపారి విజయ్‌మాల్యా, నిన్న వజ్రవ్యాపారి నీరవ్‌మోడీ వంటి బ్యాంకు ఎగవేతదారుల బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న నేపథ్యంలో ఎన్డీటీవీ ప్రమోటర్ రాయ్‌పై స్వామి ట్వీట్లు సంధించారు.

రేపిస్టుకు మద్దతుగా జాతీయ జెండాతో ర్యాలీ : ముఫ్తీ మండిపాటు

శ్రీనగర్ : కథువాలో బాలికపై అత్యాచారం, హత్య కేసులో అరెస్టు అయిన పోలీసు అధికారిని విడిచి పెట్టాలంటూ మతవాదులు నిర్వహించిన ర్యాలీలో భాగంగా త్రివర్ణపతాకాన్ని వినియోగించడాన్ని జమ్మూకాశ్మీర్ సీఎం ముఫ్తీ తీవ్రంగా ఖండించారు. జాతీయ జెండాను అపవిత్రం చేశారంటూ మండిపడ్డారు. జనవరిలో కథువా జిల్లాలో ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం, ఆపై హత్యకు సంబంధించిన కేసులో అరెస్టు అయిన ప్రత్యేక పోలీసు అధికారి దీపక్ ఖజూరియాను విడుదల చేయాలంటూ 'హిందూ ఏక్తా మంచ్' గురువారం జమ్మూలో భారీ ప్రదర్శన నిర్వహించింది. 'ఒక కీచకుడికి మద్దతుగా నిరసనలు, ప్రదర్శనలు చేయడం ఆందోళనకరం. నిరసనకారులు జాతీయ జెండా చేబూని ప్రదర్శనలు చేయడం మరింత భయాన్ని కలిగిస్తోంది. అది అపవిత్రీకరణ కాక మరేమిటి?' అంటూ మెహబూబా ముఫ్తీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. పోలీసుల నిర్బంధంలో ఉన్న నిందితుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని సీఎం ట్వీట్ చేశారు.



మతాలకు అతీతంగా గుప్తా – సత్తార్‌ల బంధం

అహ్మదాబాద్ : దేశంలో మతాలు- కులాల కుంపట్లతో ఒకవైపు మారణకాండ జరుగుతుండగా, గుజరాత్‌లో సంయుక్త వ్యాపారా లు చేస్తూ దేశానికి ఆదర్శంగా ఉంటున్న రెండు విభిన్న మతాలకు చెందిన స్నేహ జీవితం వెలుగులోకి వచ్చింది. 40 ఏళ్ల నుంచి రాధేశ్యాం లజ్జారాం గుప్తా - బెష్లిం మొహ్మద్ ఇక్బాల్ సత్తర్‌లు వ్యాపార భాగస్వాములుగా ఉంటూ అహ్మదాబాద్‌లోని సరస్‌పూర్ ప్రాం తంలో 'గుప్తా రక్షా బంధన్' పేరుతో పండు గలకు అలంకరణ వస్తువులు అమ్ముతున్నారు. ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న వీరు ఒకరి మతానికి మరొకరు గౌరవాన్ని ఇచ్చుకుంటూ పండుగలు జరుపుకుంటున్నారు. మా ఇద్దరి మధ్య డబ్బు, లేదా మతాలకు సంబంధించిన గొడవలు ఇన్నేళ్ల నుంచి ఎప్పుడూ రాలేదని వారు చెప్పుకొచ్చారు. రెండు మతాలకు సంబంధించిన ఆలయాలకు కూడా ఇద్దరం కలిసే వెళతామని, అలానే అజ్మీర్ దర్గా, మహాకాలేశ్వర్ ఆలయాలను సందర్శించామని, ఒకరికి ఒకరు ఎప్పుడూ బాసటగా నిలుస్తామని వారిరువురూ వెల్లడించారు.

గీతాంజలి చోక్సీపై సీబీఐ కేసు..!

విశాలాంధ్ర ప్రతినిధి - న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.11,400 కోట్ల కుంభకోణంలో పాత్రధారి వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ ఆస్తులను ఈడీ జప్తు చేస్తుంటే... సీబీఐ కేసుల మీద కేసులు నమోదు చేస్తోంది. అతడు ఎక్కడున్నా పట్టుకునేందుకు రంగం సిద్ధం చేస్తోంది. తాజాగా నీరవ్ మోడీ భాగస్వామి గీతాంజలి గ్రూప్ ప్రమోటర్ మెహుల్ చోక్సీపై సీబీఐ కేసు నమోదు చేసింది. అక్రమ లావాదేవీలతో రూ.4,886 కోట్ల మేరకు తమ బ్యాంకును ముంచాడంటూ మెహుల్ చోక్సీపై పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ శుక్రవారం ముంబై, పుణె, సూరత్, జైపూర్, హైదరాబాద్‌ల్లో మొత్తం 20 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. గీతాంజలి గ్రూప్ సంస్థల కార్యాలయాలు, డైరెక్టర్ల ఇళ్లు, మెహుల్ చోక్సీ సంబంధీకుల ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టినట్టు సీబీఐ అధికార ప్రతినిధి తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన ముంబయిలోని ఓ శాఖలో రూ.11,400 కోట్ల కుంభకోణం వెలుగుచూసిన విషయం తెలిసిందే. నీరవ్ మోడీ, మరో ఆభరణాల కంపెనీ తమ బ్యాంకు ద్వారా మోసపూరిత లావాదేవీలకు పాల్పడినట్లు పీఎన్‌బీ ఫిర్యాదు చేసింది.

అక్రమంగా రుణాలు

పీఎన్‌బీ నుంచి అక్రమంగా లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్‌లను తీసుకెళ్లి విదేశాల్లోని భారతీయ బ్యాంకుల నుంచి రుణాల పొందినట్లు పేర్కొంది. దీంతో విచారణ చేపట్టిన ఈడీ అధికారులు గురువారం నీరవ్ మోడీకి



చెందిన పలు షోరూంలు, ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు చేపట్టింది. 50 సంస్థలపై దాడులు, పాస్‌పోర్టుల సస్పెన్షన్ ఈ తనిఖీల్లో రూ.5,100 కోట్ల వజ్రాలు, నగలు, బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. శుక్రవారం కూడా నీరవ్ మోడీకి చెందిన 50కిపైగా సంస్థలపై దాడులు జరుపుతున్నారు. కాగా, నీరవ్, ఆయన భార్య, సోదరుడు, చోక్సీపై ఈడీ కేసు నమోదు చేసింది. ఈడీ సూచన మేరకు నీరవ్ మోడీ, చోక్సీల పాస్‌పోర్ట్‌లను నాలుగు వారాలపాటు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సస్పెండ్ చేసింది. ఇదిలా ఉంటే, వారంలోపు తమ ఎదుట హాజరు కావాలని నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీకి ఈడీ నోటీసులు జారీ చేసింది. దేశంలో అందుబాటులో లేనందున వీళ్ల వ్యాపార సంస్థల డైరెక్టర్లకు మనీ లాండరింగ్ యాక్ట్ ప్రకారం నోటీసులు అందజేశారు.

అమెరికాలో జల్సా..!

విదేశీ వాణిజ్యం పేరుతో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో వేల కోట్ల దగా లావాదేవీలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ న్యూయార్క్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కుంభకోణం వెలుగులోకి రావడానికి చాలా రోజుల ముందే నీరవ్, ఆయన కుటుంబ సభ్యులు భారత్ విడిచి వెళ్లి పోయారు. ఈ ఏడాది జనవరి 1న ఆయన స్విట్జర్లాండ్‌కు వెళ్లినట్లు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఆయన న్యూయార్క్‌లో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. న్యూయార్క్‌లోని లగ్జరీ జేడబ్ల్యూ మరియట్ ఎస్సెక్స్ హౌస్ హోటల్‌లో నీరవ్ ఉన్నట్లు తెలుస్తోంది. నీరవ్‌కు చెందిన మాడిసన్ అవెన్యూ జువెల్లరీ రిటైల్ స్టోర్‌కు సమీపంలోనే ఈ హోటల్ ఉంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. ఇదిలాఉండగా నీరవ్ ఆచూకీ కోసం కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అధికారులు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు. నీరవ్‌పై ఈ మేరకు డిఫ్యూషన్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను సీబీఐ కోరినట్లు అధికారిక వర్గాల సమాచారం. ఈ డిఫ్యూషన్ నోటీసును ఇంటర్‌పోల్ సభ్యత్వం ఉన్న దేశాలకు పంపిస్తారు. దాని ద్వారా పోలీస్ విచారణ చేపట్టి వ్యక్తుల ఆచూకీని కనిపెట్టి చెబుతారు. త్వరలోనే నీరవ్ ఆచూకీ కనిపెడతామని సీబీఐ చెబుతోంది.

విద్యార్థులపై కోర్టుకెళ్లిన జేఎన్‌యూ

న్యూఢిల్లీ : కోర్టు ఆదేశాలను విద్యార్థులు ధిక్కరిస్తున్నారని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) పాలకవర్గం శుక్రవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. పరిపాలనా భవనానికి వంద మీటర్ల దూరంలో ఎటువంటి నిరసనలు తెలపరాదని కోర్టు జారీచేసిన ఆదేశాలను విద్యార్థులు పాటించడంలేదని యూనివర్సిటీ పాలకవర్గం పేర్కొంది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించే వారిపై కోర్టు ధిక్కారణ క్రింద చర్యలు తీసుకోవాలని కోరింది. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సి. హరి శంకర్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. ధర్మాసనం విచారణకు ఈ పిటిషన్‌ను అనుమతించింది. విశ్వవిద్యాలయం పరిపాలనా భవనానికి వంద మీటర్ల దూరంలో ఎటువంటి ఆందోళనలు నిర్వహించవద్దని 2017 ఆగస్టు 9వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రస్తుతం జరుగుతున్న నిరసనలు ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నాయని జేఎన్‌యూ పేర్కొన్నది. నిర్బంధ హాజరు, రెక్టార్ల భవనాన్ని వదిలిపెట్టడం నిలిపివేసే అంశాలపై చర్చించేందుకు వైస్‌ఛాన్సలర్‌తో సమావేశం జరపాలన్న డిమాండుపై గురువారం విశ్వవిద్యాలయం పరిపాలనా భవనాన్ని విద్యార్థులు ఘెరావ్ చేశారు. ఈ పరిపాలనా భవనంలో వైస్‌ఛాన్సలర్‌తో సహా అనేక మంది అధికారుల ఇళ్లు ఉన్నందున పరిపాలన భవనానికి వంద మీటర్ల దూరంలో ఎటువంటి నిరసనలు తెలపరాదని కోర్టు గత ఏడాది ఆగస్టు 9న ఆదేశాలు జారీచేసింది. విద్యార్థులు నిరసనలు తెలిపేందుకు విశ్వవిద్యాలయంలో ఇప్పటికే స్థలాన్ని కేటాయించారని, 'సబర్మతి హాస్టల్ లాన్స్'లో విద్యార్థులు ధర్నాలు నిర్వహించుకోవచ్చని ఆ పిటిషన్‌లో విశ్వవిద్యాలయం తెలిపింది, అకడమిక్ నియమ. నిబంధనల ప్రకారం ఎకడమిక్ కాంప్లెక్స్, పరిపాలనా భవనానికి 200 మీటర్ల లోపు నిరసనలు తెలపవద్దని జేఎన్‌యూ సిబ్బంది, విద్యార్థి సంఘం (జేఎన్‌యూఎస్‌యూ) నాయకులను విశ్వవిద్యాలయం పాలకవర్గం కోరిందని ఆ పిటిషన్ తెలిపింది.

నాగాలాండ్, మేఘాలయ, త్రిపురల్లో

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించండి : సీఈసీ

షిల్లాంగ్ : శాసనసభ ఎన్నికల్లో నిష్పాక్షికంగా, నిర్భయంగా ఓటింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని నాగాలాండ్, మేఘాలయ, త్రిపురల్లో ఎన్నికల యంత్రాగాలను ప్రధాన ఎన్నికల అధికారి ఓంప్రకాష్ రావత్ శుక్రవారం కోరారు. ఫిబ్రవరి 18న త్రిపురలో, ఫిబ్రవరి 27న మేఘాలయ, నాగాలాండ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. 'మూడు రాష్ట్రాలు తమ సొంత విశేషాలను కలిగి ఉన్నాయి. ఎన్నికలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని చర్యలూ చేపట్టింది' అని రావత్ మేఘాలయ ఎన్నికల అధికారులతో సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. 'ఎన్నికలను ఎవరి ప్రభావం లేకుండా స్వతంత్రంగా, నిష్పాక్షికంగా, తటస్థంగా నిర్వహించాలని ఎన్నికల యంత్రాంగాలను ఆదేశించాం. ఎన్నికల అధికారులకు ప్రవర్తనా నియమావళిని నిర్వచించడం, వారిని తొలగించడం నిరంతరం ఎన్నికల కమిషన్



పరిశీలనలో ఉంటుంది' అని రావత్ పేర్కొన్నారు. 'పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం, మాదక ద్రవ్యాల అక్రమ సరఫరా, ఇతర అక్రమ వస్తువుల రవా ణాను నిరోధిం చేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేశాం. మేఘా లయ సరిహద్దు జిల్లాల అంతర్జాతీయ సరిహద్దులు, అంతర్రాష్ట సరిహద్దులు కూడా నిఘాలో ఉన్నాయి' అని ఆయన తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత మేఘాలయలో 20 వేల లీటర్లకుపైగా మద్యం, 17.25 లక్షల రూపాయలను ఎన్నికల యంత్రాంగం సీజ్ చేసినట్లు రావత్ చెప్పారు.

ఈ జవానుకు నిండు నూరేళ్లు

సాంబ (జమ్ముకాశ్మీర్) : జమ్ముకాశ్మీర్‌లోని సాంబలో మాజీ జవాను రుమాల్ సింగ్, తన వందో పుట్టిన రోజును కుటుంబికులు, స్నేహితుల మధ్య గురువారం ఘనంగా జరుపుకున్నాడు. ఊరంతా వచ్చి ఆయన్ను ఆశీర్వదించింది. ఆయన మనువళ్లు, మునిమనవళ్లతో కలసి 3 కేకులను కట్ చేశారు. ఆయన కొడుకులు కోడళ్లు, కూతుళ్లతో కలిపి 30 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. అందరికంటే చిన్నదైన మునిమనవరాలు అంబికా మరో వందేళ్లు జీవించాలని శుభాకాంక్షలు తెలిపారన్నారు. 1958లో మిలటరీ నుంచి రిటైరైన రుమాల్ తన ఆరోగ్య రహస్యాన్ని వెల్లడిస్తూ ఎల్లప్పుడూ కష్టపడుతుండటం వల్లనే 100వ పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోగలిగానన్నారు.

పీఎన్‌బీ స్కామ్‌పై ముమ్మర చర్యలు : రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో వెలుగుచూసిన భారీ కుంభకోణం నిందితులపై గట్టి చర్యలు తీసుకుంటామని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం స్పష్టంచేశారు. కేంద్రప్రభుత్వంపై ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్న నేపథ్యంలో మంత్రి స్పందించారు. కాగా, ఇప్పటికే చర్యలను చేపట్టామన్నారు. రూ. 11,300కోట్ల మోసాన్ని తట్టుకోగల సామర్థ్యం పీఎన్‌బీకి ఉందని ఆర్థికశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ కుంభకోణం ప్రభావం బ్యాంకు రీక్యాపిటలైజేషన్‌పై ఏ మాత్రం ఉండదని తెలిపాయి. గతంలో కేటాయించిన విధంగా బ్యాంకు రీక్యాపిటలైజేషన్ వాటా రూ.5000 పీఎన్‌బీకి దక్కుతుందని పేర్కొన్నాయి. తాజాగా మరో ఎనిమిది మందిని పీఎన్‌బీ యంత్రాంగం సస్పెండ్ చేసింది. వీరితో కలిపి మొత్తం 18మందిపై వేటు పడింది. ఇందులో జనరల్ మేనేజర్ స్థాయి అధికారులుండడం గమనార్హం. వజ్ర వ్యాపారీ, కుంభకోణంలో ప్రధాన నిందితుడు నీరవ్ మోడీపై అంతర్గత దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ ఇంటర్‌పోల్ ఆయనపై డిఫ్యూజన్ నోటీసు జారీచేసింది. విస్తృత ప్రాంతాల్లో తనిఖీ చేసేందుకు వీలుగా నీరవ్‌తో పాటు ఆయన భార్య అమీ మోడీ, సోదరుడు నిషాల్ మోడీ, వ్యాపార భాగస్వామి, మేనమామ మెహుల్ చోక్సీలపై నోటీసులు జారీ చేసింది. ఓ వ్యక్తిని అరెస్టు చేసేందుకు అనుమతిని కోరాలన్నా, వారు ఎక్కడున్నా రన్నది తెలుసుకోవాలన్నా



లేదా పోలీసు విచారణకు సంబంధించి అదనపు సమాచారం కావాలన్నా గానీ ఈ విధంగా డిఫ్యూ జన్ నోటీసులు జారీ చేస్తారు. 24 గంటలు గడిచినప్పటికీ ముంబైలోని కాలాఘోడాలోని నీరవ్‌మోడీ బొటీక్‌లో సోదాలు కొనసాగుతున్నాయి. నీరవ్‌మోడీ, ఆయన అనుబంధ కంపెనీలు కలిసి పంజాబ్ నేషనల్ బ్యాంకును హామీగా పెట్టి 1.7బిలియన్ డాలర్ల మోసానికి పాల్పడినట్టు ఆరోప ణలున్నాయి. విదేశాల నుంచి రుణాన్ని పొందేందుకు వారిలా చేసినట్టు తెలుస్తోంది. గురువారం నీరవ్‌మోడీకి సంబంధించిన ఆస్తులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న గీతాంజలి జెమ్స్ స్టోర్లపై ఈడీ అధికా రులు దాడులు చేసిన విషయం తెలిసిందే.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..

విద్యార్థులకు మోడీ ఉద్బోధ



న్యూఢిల్లీ : పరీక్ష రాయడానికి కూర్చున్నప్పుడు మీ ధ్యాసంతా పరీక్ష మీదే ఉండాలని, మీ భవిష్యత్‌ను నిర్ణయించేది మీరే, ఇతరులు కాదని విద్యార్థులనుద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. భయాన్ని అధిగమించాలని, ఆత్మవిశ్వాసం ఉంటే ఎటువంటి కష్టం వచ్చినా దానిని సులభంగా అధిగమించగలరని చెప్పారు. 10వ తరగతి, 12 బోర్డు ఎగ్జామ్స్ జరగనున్న నేపథ్యంలో పరీక్షల ఒత్తిడిని ఎలా జయించాలనే దాని గురించి ఆయన శుక్రవారం ఢిల్లీలోని తల్కోతోరా స్టేడియంలో 'పరీక్షా పే చర్చా' పేరుతో విద్యార్థులతో చర్చా గోష్ఠిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మీరు ఈ రోజు దేశ ప్రధానమంత్రితో మాట్లాడడంలేదు. మీ స్నేహితుడితో మాట్లాడుతున్నారు. ఈ రోజు నేను ఓ విద్యార్థిని.. మీరు ఎగ్జామినర్లు అయితే.. 10 మార్కులకు నాకు ఎన్ని ఇస్తారో చెప్పాలి" అని విద్యార్థులను అడిగారు. 'ఏకాగ్రత అనేది ప్రత్యేకంగా నేర్చుకునేది కాదు. ప్రతీ ఒక్కరూ ఏదో ఒక దాని మీద తమ మనసును లగ్నం చేస్తారు. అది చదవడం, పాటలు వినడం, స్నేహితులతో మాట్లాడటం ఇలా ఏదైనా కావచ్చు. ఏదైనా పనిని మనం ఏకాగ్రతతో చేయడానికి మంచి మార్గం యోగా. దీన్ని కొంతమంది వ్యాయామం అంటారు. కానీ అది అన్నింటికంటే ఎక్కువ అని నేను భావిస్తాను. యోగా ద్వారా మనం ఏకాగ్రతను పొందవచ్చు" అని మోడీ చెప్పారు. 'ఇతరులతో మీరు పోటీ పడకండి. మీతో మీరే పోటీపడండి. ఒకవేళ ఇతరులతో మీరు పోటీపడాల్సి వస్తే మీ ప్రత్యర్థులను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకోండి. మీ స్నేహితులు రోజు మొత్తం మీద ఎన్ని గంటలు చదువుతున్నారనేది కాదు. మీరు రోజు మొత్తం మీద చదువుకు ఎన్ని గంటలు కేటాయిస్తున్నారనేది అంచాన వేసుకోండి. దాన్ని మరుసటి రోజుకు కొద్ది కొద్దిగా పెంచుకుంటూ వెళ్లండి. మీ సామర్థ్యమేమిటో మీరు గుర్తుంచుకోండి" అని విద్యార్థులకు సూచించారు. మా మీద తల్లిదండ్రులు చాలా అంచనాలు పెట్టుకుంటారు. పరీక్షల సమయంలో అది మరీ ఎక్కువగా ఉంటుందనేది తెలుసు కోండి, మీ కోసం మీ తల్లిదండ్రులు అన్నింటినీ త్యాగం చేస్తారనే విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోండి. మీ మీదే కాదు తల్లిదండ్రుల మీద ఒత్తిడి ఉంటుంది. తమ పిల్లల కోసం ఏదో ఒకటి చేయాలని వాళ్లు కలలు కంటారు. వాళ్ల ఉద్దేశాలను మనం ఎప్పుడూ అనుమానించకూడదు. వారి వైఫల్యాలు పిల్లల మీద పడకుండా చాలా జాగ్రత్తగా చూసుకుంటారు. తల్లిదండ్రులు పిల్లలను వేరే వాళ్లతో పోల్చుతారు. అలా చేయకుండా మీ పిల్లలతో మీరు మాట్లాడండి. ప్రతి ఒక్క చిన్నారికి ప్రత్యేక ప్రతిభ ఉంటుంది. అది గుర్తించాలి. విద్యార్థులు సాధించే విజయాలను సోషల్ స్టేటస్‌గా చూడొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నాను. 'పరీక్షల సమయంలో కొన్ని ఇళ్లలో కర్ఫ్యూ వంటి పరిస్థితుల ఉంటాయని, అటువంటి పరిస్థితులు ఉన్నంత మాత్రాన మంచి ఫలితాలు వస్తాయనుకోవడం సరికాదని హితవు పలికారు. పరీక్షల సమయంలో మీరు ఏది చేస్తే బాగుంటుందో అదే చేయండి. మీ ఐక్యూని, ఈక్యూని సమపాళ్లలో ఉండేలా చూసుకోండి. ఐక్యూ మీరు విజయం సాధించడానికి ఉపయోగ పడుతుంది. కానీ ఈక్యూ మీరు సాహసాలను స్వాగతిం చేందుకు ఉపయోగపడుతోంది' అని మోడీ విద్యార్థులకు సూచించారు. ఈ చర్చా కార్యక్రమాన్ని దేశంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులు చూసే విధంగా ప్రత్యక్ష ప్రసారాన్ని ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వేరే ప్రాంతాల్లో ఉండే విద్యార్థులు కూడా మోడీని ప్రశ్నలు అడిగే విధంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులతో మోడీ ఉత్సాహంగా మాట్లాడి వారిలో సరికొత్త ఉత్తేజాన్ని నింపారు.

పర్యావరణ పరిరక్షణకు నిబద్ధత

వృద్ధిపై భారత్‌కు విశ్వాసం ఉందని, అయితే, పర్యావరణ పరిరక్షణకు నిబద్ధతతో ఉన్నదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు చేయాల్సిందంతా చేస్తామని చెప్పారు. "కఠిన వాస్తవాలపై' ప్రపంచం చర్చించాల్సిన అవశ్యం ఉందని అన్నారు. భారత్ ఆచరణీయమైన మార్పు తీసుకువస్తుందని తెలిపారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ప్రపంచ సుస్థిర అభివృద్ధి శిఖరాగ్ర సమావేశంలో మోడీ మాట్లాడారు. "ప్రకృతిని గౌరవించడం భారత సంస్కృతిలో భాగం. భూమిని తల్లిగా మనం భావిస్తాం. వృద్ధిని భారత్ విశ్వసిస్తుంది. అయితే, పర్యావరణ పరిరక్షణకు కూడా నిబద్ధతతో ఉన్నది" అని మోడీ తెలిపారు. "మనకు అవసరమైన వాటిని అందించడానికి మేము చేయగలిగి నంతా చేస్తాం. అందరి ప్రయోజనాల ప్రాతిపదికన ఇతరులు కూడా నిబద్ధత పరిపూర్తికి చేతులు కలుపుతారని ఆశిస్తున్నాం. అయితే, బాధ్యతలు, సమానత్వం వేరుకా వచ్చు" అని ఎవరి పేరునూ ప్రస్తావించకుండా మోడీ అన్నారు. అన్ని వనరులు, సంపద ప్రకృతికి చెందినవే, దాని సృష్టేనని అన్నారు. "మనం కేవలం ఈ సంపద ట్రస్టీలు లేదా మేనేజర్లం మాత్రమే" అని చెప్పారు. మహాత్మాగాంధీ కూడా ఈ సిద్ధాంతాన్ని సమర్థించారని చెప్పారు.

కాంగ్రెస్ ప్లీనరీకి స్టీరింగ్ కమిటీ ఇదే

న్యూఢిల్లీ : రాబోయే కాంగ్రెస్ ప్లీనరీ సెషన్‌కు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి బదులు స్టీరింగ్ కమిటీని పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ శుక్రవారం ప్రకటనలో తెలిపింది. కాంగ్రెస్ అధ్యక్షుడు, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, పార్టీ ప్రధాన కార్యదర్శులతోపాటు 34 మంది సభ్యులతో కూడిన స్టీరింగ్ కమిటీ శనివారం సమావేశం కానుంది. ఈ ప్లీనరీ సెషన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి బదులుగా స్టీరింగ్ కమిటీ పనిచేస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ ద్వివేది ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్టీరింగ్ కమిటీలో ఇంకా సీనియర్ నాయకులు ఏకే ఆంటోనీ, అహ్మద్ పటేల్, దిగ్విజయ్‌సింగ్ , గులాంనబీ ఆజాద్, అంబికా సోని, ద్వివేది, అశోక్ గెహ్లాట్, సుశీల్ షిండే, పి.చిదంబరం, ఆస్కార్ ఫెర్నాండెజ్, ఆనంద్ శర్మ, ఏఐసీసీ ప్రధాన ప్రతినిధి రణదీప్‌సింగ్ సురజేవాలాలు ఉన్నారు.

మిజోరాం మంత్రి రాజీనామాకు డిమాండు

ఐజ్వాల్ : మిజోరాంలో వంతెన కూలిన ఘటనలో ఒక వ్యక్తి మృతిచెందిన ఘటనకు ఆ రాష్ట్ర పబ్లిక్ వర్క్స్‌శాఖ మంత్రి లాల్ తంజార నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండు చేశాయి. మిజో నేషనల్ ఫ్రంట్, మిజో పీపుల్స్ పార్టీ గురువారం మంత్రి తంజారా రాజీనామాకు పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం తంజారా విలేకరులతో మాట్లాడుతూ, ఇది దురదృష్టకరమైన ఘటన అని, ఇందుకు తాను బాధ్యత వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అయితే ముఖ్యమంత్రి, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సెక్రటరీ తనను రాజీనామాపై తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని, నియోజకవర్గ ప్రజలు రాజీనామా చేయాలని కోరలేదని చెప్పారన్నారు. మంగళవారం ఐజ్వాల్ జిల్లాలో త్వైరుసీ నదిపై నిర్మాణంలో ఉన్న బరైలీ వంతెన కుప్పకూలింది.

యోగి ఇంటి ముందు రైతు ఆత్మహత్యాయత్నం...

లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారిక నివాసం ముందు ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. యూపీ ప్రభుత్వం శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెడుతున్న తరుణంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం కలకలం సృష్టించింది. ఎట్టకేలకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆ రైతును శాంతింపజేయడంతో కథ సుఖాతమైంది. యూపీలోని లలిత్‌పూర్‌కి చెందిన రామ్‌రాజ్ ఉదయం తన కుమారుడితో కలిసి సీఎం అధికారిక నివాసం 5– కాళిదాస్ మార్గ్‌కు వచ్చాడు. అక్కడే ఉన్న 100 అడుగుల ఎత్తైన చెట్టు ఎక్కి ఉరివేసుకునేందుకు సిద్ధపడ్డాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని అతడిని కిందికి దించేందుకు ప్రయత్నించారు. అయితే తనకున్న రూ.1.5 లక్షల రుణం మాఫీ చేస్తానని హామీ ఇస్తేనే కిందికి దిగుతానంటూ రామ్‌రాజ్ చెప్పాడు. గంటసేపు ఈ హైడ్రామా కొనసాగింది. రుణమాఫీపై అధికారులు హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు రైతు చెట్టు దిగాడు. అనంతరం అతడిని పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

ఆలయానికి ముస్లిం పొలం దానం

న్యూఢిల్లీ : కేరళలో మతసామరస్యతకు మార్గదర్శిగా ఓ ముస్లిం నిలిచాడు. తనకు గల కొంత భూమిని ఆలయం వద్ద కోనేరుకు ఉచితంగా అందజేశాడు. భిన్న మతాలున్న మన సమాజంలో ఆ మతాల ప్రజల మధ్య శాంతి, సామరస్యాలు కొనసాగాలంటే అందుకు అందరి కృషి, సాయం అవసరం. కేరళలోని మల్లప్పురం జిల్లా చంతన్ గొట్టుపురం గ్రామంలో కుందాడ శివాలయం ఉంది. ఆ శివాలయానికి అవసరమైన కోనేరు లేదు. ఆలయానికి కోనేరు తవ్వేంత స్థలం లేదు. పక్కనే నంబియార్తోడి అలీ ముస్లింకు 4.7 ఎకరాల పొలం ఉంది. అందులో కోనేరులాగా ఉపయోగపడే చిన్న కుంట ఉంది. దాన్ని కొనేందుకు అడగాలని శివాలయం కమిటీ నిర్ణయించింది.

ఐఎన్‌ఎక్స్ కేసులో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ : ఐఎన్‌ఎక్స్ మీడియా నగదు లావాదేవీల కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శుక్రవారం చెన్నైలో తాజాగా సోదాలు జరిపింది. ఈ కేసులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం, ఇతరులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పీఎంఎల్ చట్టం, నగదు బదిలీ వ్యతిరేక చట్టం నిబంధనలు కింద చెన్నైలోని ఈడీ మూడు ప్రాంతాల్లో సోదాలు జరిపింది. ఈ కేసులో గురువారం ఈడీ ఢిల్లీలో కార్తీని పది గంటలపాటు విచారించింది.

గ్యాస్ లీకేజీతో ఒకరి మృతి

థానే : మహారాష్ట్రలో పరిశ్రమలో గ్యాస్ లీక్ అవడంతో ఒక వ్యక్తి మృతి చెందగా, 11 మంది అస్వస్థతతో ఆసుపత్రిపాలయ్యారు. ఈ ఘటన థానే జిల్లాలో కళ్యాణ్‌లోని సాహద్‌లో రేయాన్ తయారీ పరిశ్రమలో గురువారం రాత్రి చోటుచేసుకుందని పోలీసులు శుక్రవారం తెలిపారు. పరిశ్రమలో మూడు రకాల గ్యాస్‌లను కలపడం జరుగుతుందని, ఈ క్రమంలో కొంతమంది వర్కర్లకు కళ్లు దురదలు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయని, వెంటనే వారిని ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. దర్యాప్తు జరుగుతుందని తెలిపారు.

ఎంపీలో 984 గ్రామాలు అతలాకుతలం

భోపాల్ : ఇటీవల కురిసిన వడగళ్ల వానలకు మధ్యప్రదేశ్‌లో 984 గ్రామాలు అతలాకుతలమయ్యాయని, పంట తీవ్రంగా దెబ్బతిన్నదని అధికారులు శుక్రవారం తెలిపారు. వడగళ్లతో నెలకొన్న పరిస్థితిపై ఉపముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఆదివారం, సోమవారం కురిసిన వడగళ్ల వానలకు సీహోర్, భోపాల్, హోషంగ్‌బాద్, శివపురి, అశోక్‌నగర్, రైసెన్, ఇతర జిల్లాల్లో పంట నష్టంపై సర్వే నిర్వహించాలని అధికారులను, సర్పంచ్‌లను ఆదేశించారు.

యూపీ మాజీ మంత్రి కన్నుమూత

ఆలీఘర్ : ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి, సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు ఖాజ్వా హలీం(75) గుండెపోటుతో న్యూఢిల్లీలోని ఆసుపత్రిలో మృతి చెందినట్టు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.హలీంకు గత శుక్రవారం గుండెనొప్పి రావడంతో వెంటనే ఆలీఘర్‌లోని నెహ్రూ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఆయన గురువారం రాత్రి మృతి చెందినట్టు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

బస్సు ప్రమాదంలో విద్యార్థిని, కండక్టర్ మృతి

అంబాలా : హర్యానాలోని అంబాలాలో పాఠశాల బస్సు ప్రమాదానికి గురవ్వడంతో విద్యార్థిని, బస్సు కండక్టర్ మృతిచెందారు. ఈ ఘటన అంబాలా-నారైన్‌ఘర్ హైవేపై శుక్రవారం జరిగిందని పోలీసులు తెలిపారు. పంజోఖ్రా సమీపంలోని ఎస్‌సీసీ పబ్లిక్ పాఠశాల సమీపంలో 40 మంది విద్యార్థులతో వస్తున్న పాఠశాల బస్సు బోల్తా పడిందని చెప్పారు. సైక్లిస్ట్‌ను తప్పించబోయి డ్రైవర్ వాహనంపై అదుపుతప్పడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారని, ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. 30 మంది విద్యార్థులను ఆసుపత్రికి తరలించగా, వారిలో 21 మంది డిశ్చార్జ్ అయినట్టు తెలిపారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

బడ్జెట్ ప్రవేశపెట్టిన యూపీ ప్రభుత్వం

లక్నో : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. సభలో ఆర్థిక మంత్రి రాజేష్ అగర్వాల్ మాట్లాడుతూ, ఈ వార్షిక సంవత్సరానికి రూ.4,28,384.52 లక్షల కోట్లు బడ్జెట్‌ను కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఇది గత వార్షిక సంవత్సరం కంటే 11.4 శాతం ఎక్కువని తెలిపారు. బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు రూ.650 కోట్లు, గోర్కాపూర్ లింక్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు రూ.550 కోట్లు, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేకు రూ.1000 కోట్లు, రూ.ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేకు రూ.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

గుండెపోటుతో విచారణ ఖైదీ మృతి

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా జైలులో విచారణలో ఉన్న ఖైదీ గుండెపోటుతో మృతిచెందినట్టు జైలు అధికారి శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే, హత్య కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఖైదీ సచిన్ (30)కు గుండెపోటు రావడంతో వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించామని అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారని జైలు సూపరింటెండెంట్ ఏకే సక్సేనా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్టు చెప్పారు.

అశాస్త్రీయ సర్క్యులర్ ఉపసంహరణకు పోరు



విశాలాంధ్ర - భీమవరం : సత్వర కేసుల పరిష్కారం పేరుతో న్యాయ మూర్తులను, కక్షిదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేలా సుప్రీం కోర్టు విడుదల చేసిన అశాస్త్రీయ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకునేలా లాయర్లు ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరిజిల్లా భీమవరంలోని స్నేహ లా ఛాంబర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో చలసాని మాట్లాడుతూ వివిధ హైకోర్టుల్లో 44 శాతం, సుప్రీంకోర్టులో 19 శాతం న్యాయమూర్తుల ఖాళీలున్నాయని, వాటిని భర్తీ చేయకుండా కేసులు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. పలు స్థాయిల్లో భర్తీలు చేయకపోవడంతో దిగువ స్థాయి కోర్టుల్లో 2,53,54,325 కేసులు, వివిధ హైకోర్టుల్లో 40,54,000, సుప్రీంకోర్టులో 60,000 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. ఫాస్ట్‌ట్రాక్‌కు సంబంధించి జిల్లా స్థాయిలో, సబ్‌కోర్టుల పరిధిలో పలు ఖాళీలు భర్తీ చేయాల్సి ఉందని ఆయన ఉదహరించారు. లా కమిషన్, పార్లమెంటరీ కమిటీల సిఫార్సులు చేసిన విధంగా సత్వరమే న్యాయమూర్తులను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం చలసానిని స్థానిక ఐఏఎల్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లబోయిన రంగారావు, కామన రామకృష్ణ, కామన నాగేశ్వరరావు, అద్దంకి రాజేష్, స్వర్ణ, భవాని పాల్గొన్నారు.

ప్రభుత్వాలపై పోరును ఉధృతం చేద్దాం



విశాలాంధ్ర - విజయవాడ రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీల అమలులో విఫలమైనందున అర్చకులు సంఘటితంగా పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి అగ్ని హోత్రం ఆత్రేయబాబు పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో శుక్రవారం అర్చక ఆత్మావలోకన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా ఆత్రేయబాబు మాట్లాడుతూ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల అమలులో టీడీపీ, బీజేపీ నేతలు విఫలమయ్యారన్నారు. గొల్లపూడి పంచాయతీలోని సూరాయపాలెం వీరాంజనేయస్వామి దేవస్థానానికి చెందిన 2.50 ఎకరాల్లో దివంగత అర్చకనేత రామాచార్యులు పేరుతో అర్చకుల సంక్షేమ భవనం నిర్మించాలన్నారు. రాష్ట్రంలోని 90 శాతం దేవాలయాల్లో అర్చకులకు పీఆర్సీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. స్కేల్స్ లేని అన్నిచోట్లా గౌరవ వేతనం రూ. 15 వేలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య కృష్ణాజిల్లా కార్యదర్శి మామిళ్ళపల్లి నాగేంద్రం డిమాండ్ చేశారు. అర్చక సమాఖ్య కర్నూలుజిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసాచార్యులు, సమాఖ్య కృష్ణాజిల్లా అధ్యక్షుడు అగ్ని హోత్రం ఫణిగోపాల్, సమాఖ్య అనంతపురం జిల్లా నాయకుడు అంజన్ కుమార్, సమాఖ్య సహాయ కార్యదర్శి నారాయణం బాల లక్ష్మీనర సింహాచార్యులు తదితరులు మాట్లాడుతూ హెల్త్‌కార్డు, అర్చక గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. బీజేపీ నేత రఘునాథ బాబు, ఏపీ అర్చక సమాఖ్య ఉత్తరాంధ్రశాఖ అధ్యక్షుడు రొంపిచర్ల సింగరా చార్యులు ప్రసంగించారు.

కేఈ తనయుడిపై కేసు నమోదుకు ఆదేశం

విశాలాంధ్ర-డోన్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తి తనయుడు, టీడీపీ పత్తికొండ నియోజకవర్గం ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబుపై కేసు నమోదు చేయాలంటూ శుక్రవారం డోన్ కోర్టు ఆదేశించింది. గత ఏడాది మే 21వ తేదీన కర్నూలు జిల్లా వైసీపీ పత్తికొండ నియోజకవర్గ సమన్వయకర్త చెరుకులపాడు నారాయణరెడ్డితోపాటు ఆయన ముఖ్య అనుచరుడు బోయ సాంబశివుడు క్రిష్ణగిరి వద్ద దారుణహత్యకు గురయ్యారు. నారాయణరెడ్డి కారు డ్రైవర్ జి. క్రిష్ణమోహన్ ఫిర్యాదుతో అప్పట్లో క్రిష్ణగిరి పోలీస్‌స్టేషన్‌లో 15 మందిపై కేసు నమోదు చేశారు. కేఈ శ్యాంబాబు, ఆస్పరి జెడ్పీటీసీ సభ్యురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, అప్పటి వెల్దుర్తి ఎస్సై నాగతులసీ ప్రసాద్ ప్రమేయంతోనే హత్య జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు శ్యాంబాబు, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఎస్సై నాగతులసీ ప్రసాద్ ప్రమేయం లేదంటూ చార్జిషీట్‌లో వారి పేర్లు తొలగించారు. దీంతో నారాయణరెడ్డి సతీమణి శ్రీదేవి గత ఏడాది హైకోర్టు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డితో కలసి డోన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన భర్త రాజకీయంగా ఎదుగుతున్న నేపథ్యంలో జీర్ణించుకోలేని డిప్యూటీ సీఎం తనయుడు కేఈ శ్యాంబాబు కక్షకట్టి తన కుటుంబంపై భౌతిక దాడులు చేయించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇసుక మాఫియా నడిపిస్తూ తమ ఇంటిపై దాడులూ చేయించారని, విషయాన్నింటినీ వెల్దుర్తి ఎస్సై తులసీ నాగప్రసాద్‌కు వివరించినప్పటికీ పట్టించుకోలేదని వివరించారు. తన భర్త నారాయణరెడ్డికి ప్రభుత్వం అనుమతితో ఉన్న రివాల్వర్‌ను రెన్యువల్ పేరుతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. కనీసం ఆత్మరక్షణ కోసం రివాల్వర్ లేదన్న సమాచారంతో ప్రత్యర్థులు పెళ్లికి హాజరు కాబోతున్న తన భర్తను కాపుకాసి అతికిరా తకంగా హత్య చేశారన్నారు. కేఈ శ్యాంబాబు, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, అప్పటి వెల్దుర్తి ఎస్సై నాగతులసీప్రసాద్ ప్రమేయంతోనే హత్య జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నప్పటికీ చార్జిషీట్‌లో వారి పేర్లు తొలగిం చారన్నారు. డోన్ న్యాయస్థానంలో కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఆంజనేయులు వారిని కూడా కేసులో ముద్దాయిలుగా చేర్చాలని శుక్రవారం ఆదేశించింది.

విభజన హామీల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సిన వాటికి పూర్తి నిధులు కేంద్రమే ఇవ్వాల్సి ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లపాటు ఒత్తిడి తీసుకురాకుండా స్వార్థ ప్రయోజనాల కోసం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు ఒత్తిడి తెస్తున్నామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అనవసర ఖర్చులు చేస్తూ ప్రజలను మభ్య పెడుతూ వచ్చారన్నారు. నూతన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా అన్ని రంగాల్లో అవినీతిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వెనకబడిన జిల్లా అయిన ప్రకాశంజిల్లాలో రామాయపట్నం వద్ద పోర్టు నిర్మాణం చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కానీ సీఎం దుగరాజుపట్నంలో కట్టకపోతే రాష్ట్రానికి కోస్టల్ ఎంప్లాయ్‌మెంట్ జోన్ మంజూరు చేయాలని కోరారని ఇందులో పలు అనుమానాలు ఉన్నాయన్నారు. రాజధానిని నిర్మించడంతోపాటు మౌలిక వసతులు కూడా కేంద్రమే నిధులు ఇవ్వవలసి ఉందన్నారు. కేంద్రం రూ.3,500 కోట్లు మాత్రమే ఇస్తామని పదేపదే చెబుతున్నా పట్టించుకోకుండా ఈ నాలుగేళ్లు ఐకాన్ ఆకృతుల పేరుతో కాలం గడుపుతూ తాత్కాలిక సెక్రటేరియట్, అసెంబ్లీల కోసం రూ. 800 కోట్లు వృథా చేశారన్నారు. పోలవరం ఎడమ కాలువ పనిపై దృష్టి పెట్టకుండా అవసరం లేని పురుషోత్తమపట్నం పథకంపై వేలాది కోట్ల రూపాయలు వెచ్చించడం వెనుక ఆంతర్యం తెలపాలన్నారు. ఇటువంటి అనేక సమస్యలను పరిష్కరించకుండా చంద్రబాబు గాలిలో మేడలు కడుతూ ప్రజలను మభ్యపెడుతూ వచ్చారన్నారు. ఇప్పటికైనా విభజన హామీలను కేంద్రం నుండి సాధించే దిశగా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని ఆయన సూచించారు.

గుప్తనిధుల తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు



విశాలాంధ్ర - తుగ్గలి : కర్నూలు జిల్లా చెన్నంపల్లి కోటలో గుప్తనిధుల తవ్వకాల్లో శుక్రవారం పురాతన సీతారామలక్ష్మణుల పంచలోహ విగ్రహాలు, రాజులు పూజకు వినియోగించిన రాగి సామాగ్రి బయటపడ్డాయి. మొదటిదశ తవ్వకాల్లో ఏనుగు దంతాలు, గుర్రం ఎముకలు, టెంకం లభించాయి. రెండో దశలో మట్టికుండ, పురాతన గోడ, తుప్పు పట్టిన ఆయుధాలు, ఫిరంగి గుండ్లు, శివలింగాలు లభించాయి. మూడవ దశ తవ్వకాల్లో విగ్రహాలు బయట పడటంతో పర్యవేక్షిస్తున్న అధికారుల్లో ఉత్సాహం పెరిగింది. తప్పనిసరిగా గుప్త నిధి బయట పడుతుందనే ఉద్దేశంతో తవ్వకాలను ముమ్మరం చేశారు.విగ్రహాలను స్వాధీనం చేసుకున్న ఆదోని ఆర్డీవో ఓబులేసు, డిప్యూటీ కలెక్టర్ సుబ్బారెడ్డి పురావస్తుశాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

ఏవోబీ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి



విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆంధ్రా-ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు ప్రాంతంలోని సూక్మా జిల్లా సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో ఒకరు విశాఖ ఏజెన్సీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వీరి నుంచి భారీగా ఆయుధాలు, కిట్‌బ్యాగ్‌లు, మందులు, రెండు ఏకే 47 గన్లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు.





మానవహారాన్ని అడ్డుకుని సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు , మానవహారానికి తరలివచ్చిన ప్రజలు



శవయాత్ర నిర్వహిస్తున్న సీపీఐ కార్యకర్తలు

నిరసనకారులపై నిర్బంధకాండ

- అనంతపురంలో మానవహారంపై పోలీసుల దాడి
- మహిళలపైనా దురుసు ప్రవర్తన
- ముగ్గురు సీపీఐ కార్యకర్తలకు గాయాలు
- నడిరోడ్డుపై కూర్చొని మహిళల నిరసన

విశాలాంధ్ర ప్రతినిధి- అనంతపురం : రాష్ట్ర విభజన చట్టంలోని అంశాల అమలు, అనంతపురం జిల్లాలో విద్య, వైద్య సంస్థలు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్, పోలవరం, రాజధాని నిర్మాణాలకు నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలో చేపట్టిన నిరసన ప్రదర్శన, మానవహారాన్ని అడ్డుకునేందుకు పోలీసుల ఓవర్ యాక్షన్ స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. సీపీఐ జిల్లా సమితి పిలుపుతో ధర్మవరం, కదిరి, హిందూపురం, గుంతకల్లు ప్రాంతాలతో పాటు జిల్లావ్యాప్తంగా మానవహారంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, రైతు సంఘం, మహిళా సమాఖ్య కార్యకర్తలతోపాటు విద్యా ర్థులు, యువకులు, మహిళలు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో పోలీసుల ఓవర్ యాక్షన్‌తో మానవహారం ఉద్రిక్తతకు దారి తీసింది. క్లాక్ టవర్ వద్ద పోలీసుల దాడిలో ముగ్గురు సీపీఐ కార్యకర్తలు గాయపడ్డారు. మానవహారంలో పాల్గొనేందుకు క్లాక్ టవర్ వద్దకు విద్యార్థులతో కలిసి వస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్సన్‌బాబుపై రెండవ పట్టణ ఎస్సై శివగంగాధరరెడ్డి దాడి చేయడంతోపాటు బ్యానర్‌ను చించివేయడం వివాదానికి దారితీసింది. అడ్డుకోవడానికి యత్నించిన జాన్సన్‌బాబుపై లాఠీతో దాడి చేసిన పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శవయాత్ర చేస్తున్న సీపీఐ కార్యకర్తలపైనా పోలీసులు విరుచుకుపడ్డారు. శవయా త్రను అడ్డుకుంటూ ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహులు, కార్యకర్తలు మున్నా, శ్రీనివాసులుపై దాడి చేయడంతో గాయపడ్డారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్ బృందాన్ని బలవంతంగా లాక్కెళ్లారు. మహిళలపై సైతం పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. మూడవ పట్టణ సీఐ మురలీకృష్ణ మహిళలను ఇష్టానుసారంగా హెచ్చరించడంతో ఆగ్రహించిన కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు. మగ పోలీసులతోనే మహిళలను లాక్కెళ్లడం, అనుచితంగా ప్రవర్తించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా- ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తే పోలీసులు అరెస్టు చేయడం దారుణమని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవహారంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ విభజన హామీలను అమలు చేయకుండా ఉద్యమకారులను అడ్డుకోవడం ఏమిటన్నారు. పాలకులు, పోలీసులు ఇలా వ్యవహరిస్తే ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు.

అనంత పోలీస్‌స్టేషన్‌లో సీపీఐ నేతల బైఠాయింపు

శాంతియుత నిరసన కార్యక్రమంపైనా పోలీసులు నిరంకుశంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్ నేతృత్వంలోని ఆందోళనకారులు పోలీస్‌స్టేషన్‌లోనే బైఠాయించారు. డీఎస్పీ జె.వెంకట్రావు, మూడవ పట్టణ సీఐ మురలీకృష్ణలను తక్షణం సస్పెండ్ చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన మధ్యాహ్నం మూడు గంటల వరకూ కొనసాగింది. ఇలాంటి పరిస్థితి మళ్లీ పునరావృతం కాకుండా చూసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ సందర్భంగా జగదీష్ మీడియాతో మాట్లాడుతూ అనంత పోలీసులు మానవహారం వద్ద సాగించిన దమనకాండ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకే జరిగిందన్నారు. ప్రత్యేక హోదా అడుగుతున్న తమపై ఉక్కుపాదం మోపడం, నిరసనగళాలను నొక్కిపెట్టే చర్యలను సహించబోమన్నారు. ముఖ్యమంత్రికి దమ్ము ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి బీజేపీ మంత్రులను తప్పించి మార్చి 6వ తేదీన నిర్వహించబోయే చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలని హితవు పలికారు.

ఇక సామూహిక ఆత్మహత్యలే

'ఫాతిమా'కు చెల్లించిన డబ్బు మార్చి ఒకటి నాటికి ఇవ్వకుంటే ఇదే నిర్ణయమని విద్యార్థుల తల్లిదండ్రుల ప్రకటన



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఫాతిమా కళాశాల యాజమాన్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తమను మోసగించిందని, తిరిగి ఇస్తామన్న డబ్బు మార్చి 1వ తేదీ నాటికి ఇవ్వకపోతే సామూహిక ఆత్మహత్యలకు పాల్పడతామని ఫాతిమా కళాశాల విద్యార్థుల తల్లిదం డ్రులు స్పష్టం చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఎల్. వెంకటాద్రి, రాబోలు యాదగిరి విలేకరులతో మాట్లాడుతూ ఫాతిమా కళాశాల యాజమాన్యం తమ బిడ్డల భవిష్యత్తును నాశనం చేసిందన్నారు. న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రిని నంద్యాల ఎన్నికల సమయంలో కలసి విన్నవించగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఫాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల 2015-16 బ్యాచ్‌కు చెందిన 99 మంది విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశం కల్పిస్తామని సీఎం స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. అంతేకాకుండా వైద్య,ఆరోగ్యశాఖామంత్రి పిల్లల భవిష్యత్తు నాశనం కాకుండా చూస్తామని చెప్పారన్నారు. కానీ సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. తమ పిల్లల భవిష్యత్తు అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు జరిపి ప్రత్యేక జీవో ద్వారా తమ పిల్లలకు మెడికల్ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తామన్నారు. కానీ అది సాధ్యంకాదని స్పష్టం కావడంతో తాము కాలేజీకి చెల్లించిన డబ్బును తిరిగి ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరగా అందుకు సానుకూలంగా స్పందించారన్నారు. ఇచ్చిన హామీ మేరకు తమకు చెల్లించకుండా రోజులు గడుపుతున్నారన్నారు. తక్షణం కళాశాల వారినుండి ఇప్పించడం కానీ ప్రభుత్వమైనా కానీ చెల్లించాలి లేకుంటే తాము సామూహిక ఆత్మహత్యలకు పాల్పడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రతాప్‌రెడ్డి, నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వెలుతురులో శస్త్రచికిత్సపై మంత్రి ఆరా



విశాలాంధ్ర-గుంటూరు (జిల్లాపరిషత్) : గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుతురులో శస్త్ర చికిత్స చేసిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆరా తీశారు. శుక్రవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను ఆయన పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేసి, శస్త్ర చికిత్స జరిగిన రోగి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి మంత్రి కామినేని శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ ఘటనపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ అందిన వెంటనే విచారణకు డీఎంఈను ఆదేశించామన్నారు. కుక్క దాడిలో గాయపడిన మహిళకు జీజీహెచ్‌లో శస్త్ర చికిత్స చేస్తున్న సందర్భంలో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, ఆరోజు రెండో శనివారం అయినందున విద్యుత్ సరఫరా నాలుగు సార్లు ఆగినట్లు చెప్పారు. విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడిన సమయంలో జనరేటర్ ఉన్నప్పటికీ ఆపరేషన్ థియేటర్‌లో ఎంసీబీ స్విచ్ ట్రిప్ అయ్యి విద్యుత్‌సరఫరా నిలిచిపోగా అయిదు నిమిషాల వ్యవధిలో లోపం సరిచేయడమైందని డీఎమ్ఈ జరిపిన ప్రాథమిక విచారణలో నివేదిక ఇచ్చినట్లు వెల్లడించారు. పూర్తి నివేదిక అందిన తరువాత తప్పు జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ చాలా బాగున్నదని, ఈ ఆపరేషన్ థియేటర్‌ను రూ.30 లక్షలతో ఆధునీకరించడమైందన్నారు. మొత్తం 25 ఆపరేషన్ థియేటర్‌లు ఉన్నట్లు చెప్పారు. ఈ ఆపరేషన్ థియేటర్ల ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ కోసం కూడా దరఖాస్తు చేయడమైందన్నారు. కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ సుబ్బారావు, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర-విశాఖసిటీ : గాలికొండ ఏరియా దళానికి చెందిన ఇద్దరు మావోయిస్టలతోపాటు మరో ఇద్దరు మిలీషియా సభ్యులు శుక్రవారం విశాఖ జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ ఎదుట లొంగిపోయారు. విశాఖలోని తన కార్యాలయంలో ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ కొయ్యూరు మండలానికి చెందిన వంతల లక్ష్మణరావు అలియాస్ దాసు ల్యాండ్‌మైన్ అమర్చుతూ నేరాలకు పాల్పడ్డాడన్నారు. ఇతనిపై రూ.లక్ష రివార్డు ఉందన్నారు. జీకే వీధికి చెందిన పాంగి లక్ష్మణ్ అలియాస్ వెంకట్ మిలీషియా కమాండర్‌గా పనిచేస్తూ నేరాలలో పాల్గొన్నాడన్నారు. మిలీషియా సభ్యులు పాంగి సోంబ్రా, పాంగి రెల్లిబాబులు మావోయిస్టలకు సహకరిస్తూ వస్తున్నారన్నారు. ఈ నలుగురిపై ఎటువంటి వేధింపులు, కేసులు ఉండబోవన్నారు.

నేడు జపాన్‌కు పార్లమెంటరీ కమిటీలో జయదేవ్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ఇండో-జపాన్ స్నేహ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు మన దేశ పార్లమెంటరీ కమిటీ ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు జపాన్‌లో పర్యటించనున్నట్లు గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ శుక్రవారం ఇక్కడ విడుదల చేసిన ఒక పేర్కొన్నారు. ఆరుగురు లోక్‌సభ సభ్యులతో కూడిన ఈ కమిటీ జపాన్ పర్యటనలో కీలక సమావేశాల్లో పాల్గొననున్నట్లు వివరించారు. కమిటీలో తనతో పాటు బైజయంత్ పాండా, సుగటా బోస్, ప్రేమ్ దేశ్ రాయ్, భరతేంద్ర సింగ్, వివేక్ కె టంకాలు సభ్యులుగా వున్నట్లు తెలిపారు. జపాన్ మంత్రుల బృందంతో కూడా కమిటీ భేటీ కానున్నట్లు ఎంపీ గల్లా జయదేవ్ తెలిపారు.

ఎస్టోనియాతో ఏపీ దోస్తీ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎస్టోనియా దేశం డిజిటల్ వేదికపై సాధించిన విజయం నవ్యాంధ్రప్రదేశ్‌కు స్ఫూర్తిగా తీసుకుంటామని సీఎం చంద్రబాబు అన్నారు. సీఎంని కలిసేందుకు వచ్చి బడ్జెట్ సన్నాహక సమావేశంలో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న ఎస్టోనియా ప్రభుత్వ ప్రతినిధులను ఉన్నతాధికారులకు పరిచయం చేస్తూ, సాంకేతిక అంశాల్లో ఏపీకి సహకరించేందుకు ఈ చిన్న దేశం ముందుకొచ్చిందని చెప్పారు. పాలనా వ్యవహారాలలో వారక్కడ అమలుచేస్తున్న అత్యుత్తమ అభ్యాసాలను నవ్యాంధ్రప్రదేశ్‌కు అందించేందుకు సిద్ధంగా వున్నారని తెలిపారు. రిలయెన్స్ జియో, ఎస్టోనియా, ఏపీ కలిసి త్వరలో ఒక అవగాహన ఒప్పందం చేసుకోబోతున్నట్టు ప్రకటిం చారు. అంతకుముందు సీఎంతో భేటీ అయిన ఎస్టోనియా ప్రతినిధుల బృందం 15 ఏళ్ల వ్యవధిలో తమ దేశం సాంకేతికంగా ఎలా అభివృద్ధి చెందినదీ వివరించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై 15 ఏళ్లలో తాము సాధించిన విజయాల కంటే కేవలం మూడున్నరేళ్లలో నవ్యాంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతి తమను మరింత ఆశ్చర్యపరుస్తోందని వారీ సందర్భంగా సీఎం చంద్రబాబును ప్రశంసించారు. 13 లక్షల జనాభా, ప్రజలలో డిజిటల్ వ్యవహారాల పట్ల ఉన్న ఆసక్తి తమకు కలిసొచ్చిందని, ఏపీలో ఆ స్థాయిలో అభివృద్ధి చెందేందుకు ముఖ్యంగా ప్రజానీకంలో మార్పు రావాల్సివుందని వారు అభిప్రాయపడ్డారు. ఆధార్, బయో మెట్రిక్స్, ఇ-గవర్నెన్స్ తరహా విధానాలన్నీ తమ దేశంలో ఇంతకుముందే అమలు చేశామని, ప్రభుత్వ పాలనా వ్యవస్థ మొత్తం ఆన్‌లైన్ ద్వారా నడిపించిన తొలి దేశం తమదేనని చెప్పారు. సీఎంని కలిసిన వారిలో ఎస్టోనియా మాజీ సీఐవో టాపీ కోట్కా ఆర్థిక వ్యవహారాలు, కమ్యూనికేషన్ల వ్యవహారాల ప్రతినిధి మైలీ మష్లోపూ రిలయెన్స్ సంస్థ ప్రతినిధులు అనీశ్ షా, రాజన్‌లుథ్రా, సురభీ సంచేటి, కిరణ్ థామస్, పీవీఎల్ మాధవరావు, వి సదా బాబు, మహేశ్ కుమార్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

'తంబీ'లకు సుప్రీం షాక్



న్యూఢిల్లీ : కావేరీ జలాల వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. తమిళనాడుకు 177.25 టీఎంసీల జలాలు కేటాయించగా, కర్ణాటకకు 184.75 టీఎంసీల జలాలను అత్యున్నత న్యాయస్థానం కేటాయించింది. ఆ ప్రకారం కర్ణాటకకు అదనంగా 14.5 టీఎంసీల నీరు లభిస్తుంది. కేరళ, పుదుచ్చేరికి జలాల కేటాయింపుల్లో మార్పు లేదు. జలాలపై ఏ రాష్ట్రానికీ యాజమాన్య హక్కులు లేవని కూడా చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం తీర్పులో స్పష్టం చేసింది. 1956 అంతరాష్ట్ర జల వివాదాల చట్టం ప్రకారం పార్లమెంటులో కావేరీ వివాదాన్ని పరిష్కరిస్తామన్న కేంద్రం వాదనను ధర్మాసనం పట్టించుకోలేదు. 1882, 1924లో మద్రాసు, మైసూరు ప్రెసిడెన్సీల మధ్య ఒప్పందం ప్రకారం కావేరీ జలాలపై బేరాసారాలు చేసేందుకు కర్ణాటకకు లాంటి హక్కు లేదని, స్వాతంత్ర్యానికి పూర్వమే, భారత రాజ్యాంగం అమలోకి రాకముందే కుదిరిన ఈ ఒప్పందంపై కర్ణాటక వ్యతిరేకించటం ఎంత వరకూ సబబని ధర్మాసనం ప్రశ్నించింది. కావేరీ పరివాహిక రాష్ట్రాలకు సుప్రీంకోర్టు జలాలను సరికొత్తగా పంపిణీ చేసింది. కావేరీ నది మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించింది. వివిధ రాష్ట్రాలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కేటాయింపులు ఇలా ఉన్నాయి. బెంగళూరుకు 4.75 టీఎంసీల సహా కర్ణాటకకు 284.75 టీఎంసీలు, తమిళనాడుకు 404.25 టీఎంసీలు, కేరళకు 30 టీఎంసీలు, పుదుచ్చేరికి ఏడు టీఎంసీల చొప్పున ధర్మాసనం కేటాయించింది. తమిళనాడు రైతులకు రుణమాఫీ కోరుతూ ఢిల్లీలో 100 రోజులు ఆందోళన జరిపిన దేశియా థెనిండియా నడిగల్ ఇన్నైప్పు వివసాయిగళ్ సంఘం అధ్యక్షుడు పి.అయ్యంకన్ను సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించారు. కావేరీ బోర్డు ద్వారా తమిళనాడు వాటా దక్కేలా చూడాలని, కర్ణాటక తన సాగు విస్తీర్ణం పెంచకుండా అడ్డుకట్ట వేయాలని డిమాండు చేశారు. జలాల వినియోగం విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన హక్కులు ఉన్నాయని, ఏ రాష్ట్రమూ నీటిపై పూర్తి హక్కును కలిగి ఉండదని ధర్మాసనం స్పష్టం చేసింది. 1924 తరువాత మెట్టూర్ జలాశయం ఒప్పందం 1974తో ముగిసిపోయిందని, 1882, 1924 కావేరీ జలాల పంపిణీలో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవని, కేవలం ప్రజల ప్రయోజనమే ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. బెంగళూరులో కురిసే వర్షంలో 60 శాతం నీరు కావేరీలో కలుస్తున్నందునే బెంగళూరుకు 4.75 టీఎంసీలు కేటాయించినట్టు సుప్రీంకోర్టు వివరించింది. బిలిగుండ్లు ప్రాజెక్టు నుంచి తమిళనాడుకు 177.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటకను ఆదేశించింది. కావేరీ జలాలపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బెంగళూరు వ్యాప్తంగా 15వేల పోలీసులను మోహరించినట్టు నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. వీరితో పాటు కర్ణాటక స్టేట్ రిజర్వ్ పోలీస్, ఇతర బలగాలను కూడా మోహరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అల్లర్లు చోటుచేసు కోకుండా ముందు జాగ్రత చర్యలు చేపట్టామన్నారు. ఇక మైసూరు నుంచి హోసూర్ సరిహద్దు వరకు 5 వేల మంది రిజర్వ్ పోలీసు బలగాలను రంగంలోకిదించారు. ఎలాంటి ఆంక్షలు లేనప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా తమిళనాడు-కర్ణాటక మధ్య బస్సు సర్వీసులను నిలిపివేశారు. 2007 నుంచి కావేరీ వివాదం కొనసాగుతున్నా 2016లో ఇది తీవ్ర రూపం దాల్చిన విషయం తెలిసిందే. తమిళనాడుకు నీటిని విడుదల చేయాలని సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ విషయంపై కర్ణాటకలో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. మరోవైపు 2017లోనూ తమిళనాడు రైతులు ఢిల్లీ వెళ్లి రోజుల తరబడి దీక్షలు చేసిన విషయం తెలిసిందే. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం.. శుక్రవారం సంచలన తీర్పు వెల్లడించింది. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ, సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. నీటి కేటాయింపుల్లో తమకు అదనంగా 14 టీఎంసీలకు పైగా వాటా లభించిందని, ఈ తీర్పు 15 ఏళ్లు అమలులో ఉంటుందని, తమ ప్రాంత రైతులకు లబ్ధి చేకూరిందన్నారు.

కర్ణాటకలో ఆనందోత్సాహాలు.. తమిళనాట ఆందోళనలు

కావేరీ నదీ జలాల వివాదంపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో కర్ణాటకలో హర్షాతిరేకం వ్యక్తమవుతుంటే... తమిళనాడులో ఆందోళనలు రాజుకున్నాయి. కావేరీ నదీ జలాల విషయంలో తమిళనాడు వాటాను తగ్గించి.. కర్ణాటకకు 14.75 టీఎంసీల అధికంగా కేటాయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటంతో కర్ణాటక శాసనసభలో ఎమ్మెల్యేలు సంబరాలు చేసుకున్నారు. తీవ్ర నీటి ఎద్దడితో తల్లడిల్లుతున్న తమ నగరానికి శాశ్వత నీటి పరిష్కారం లభించడంతో.. బెంగళూరు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక తమిళనాడు రాజకీయ నాయకులు, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ క్రమంలో ఇరు రాష్ట్రాల మధ్య ముందస్తు జాగ్రత్తగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కమల్ అసంతృప్తి..!

కావేరీ నదీ జలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సూపర్‌స్టార్ కమల్ హాసన్ కూడా స్పందించారు. సుప్రీం తీర్పు తనను షాక్‌కు గురి చేసిందని చెప్పాడు. నీటి వాటాను తగ్గించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తీర్పునకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలుసుకోవాలని, ఏ రాష్ట్రం కూడా నీటిపై హక్కును సొంతం చేసుకోలేదని కోర్టు చెప్పడం మాత్రమే కాస్త ఊరట కలిగించే విషయమని కమల్ చెప్పారు.

రూ.12కోట్ల అవినీతి..!

- 'నన్నయ్య వర్సిటీ' పనుల్లో అక్రమాలు
- వర్కు ఆర్డరు నిలుపుదలకు ప్రభుత్వం ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనుల అవకతవకలపై పెద్దఎత్తున దుమారం నెలకొంది. అవినీతిపై పెద్దఎత్తున ఆరోపణలు రావడంతో ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లు వెత్తాయి. వర్కు ఆర్డరు ఉపసంహరణకు రాష్ట్ర ప్రభు త్వం ఆదేశించడం చర్చానీయాంశమైంది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్‌దాస్ జీవో నంబరు 23జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమం డ్రిలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో పలు అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆటోమేషన్‌లో నిర్వహించిన పనులలో రూ.12కోట్ల అవకతవకలు ప్రాథమికంగా రుజువైనట్లు తెలిసింది. ఈ పనుల టెండర్లను ఎస్‌ఆర్‌బటీ ఇండియా లిమిటెడ్ దక్కించుకుంది. అవినీతి వ్యవహారంపై పలువురు న్యాయవాదులు, ప్రజా సంఘాల ప్రముఖులు ప్రభుత్వానికీ, ఉన్నత విద్యామండలి చైర్మన్‌కూ ఫిర్యాదు చేశారు. విచ్చలవిడిగా కొనసాగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని విన్నవించారు. ఈ ఫిర్యాదులపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ స్పందించి విచారణకు ఆదేశించారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న పనులపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే.. మరింత అవినీతి భాగోతం వెలుగు చూసే అవకాశ ముందని ప్రజాసంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. అవినీతి ఆరోపణలపై ఉపకులపతి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో విశ్వ విద్యాలయం కులపతి గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దోషులపై చర్యలు తీసుకోవాలి : ముప్పాళ్ల సుబ్బారావు

రాజమండ్రి నన్నయ్య విశ్వవిద్యాలయం అభివృద్ధి పనుల్లో అవినీతికి పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావుశుక్రవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. విశ్వ విద్యాలయ ఉపకులపతిపై వస్తున్న ఆరోపణలపై గవర్నరు జోక్యం చేసుకోవాలని కోరుతూ, రూ.12కోట్ల అవకతవ కలపై సమగ్రంగా విచారించాలని విజ్ఞప్తి చేశారు.

రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించిన జగన్

ప్రకాశం జిల్లా నేతలతో తొలిరోజు ప్రజాసంకల్ప పాదయాత్ర



విశాలాంధ్ర-కందుకూరు: వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ఐదు జిల్లాలు ముగించుకుని శుక్రవారం ప్రకాశం జిల్లాలలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాలోని వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలు ఆయన్ని ఆహ్వా నించారు. కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తూమాటి మాధవరావు ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడికి చెరుకున్న వైసీపీ నాయకులను ఆయన కలుసుకుని మాట్లాడారు. ఉదయం 9:45 గంటల సమయంలో రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి ఆయన పాదయాత్ర కొనసాగింది. రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. తమకు పింఛన్లు రావటంలేదని, సబ్సిడీ లోన్‌లు అందటం లేదని కొందరు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో తమ పార్టీ అధికారంలోని వచ్చిన తరువాత అన్ని వస్తాయని సమాధానం చెప్పారని ఆయనను కలుసుకున్న మహిళలు చెబుతున్నారు. రాళ్లపాడు, పెంట్రాల, వాకమల్ల వారి పాలెం, జంపాలవారిపాలెం, లింగసముద్రంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొని ఆయన జెండాలను ఎగురవేశారు. కందుకూరు నియోజక వర్గంలోని ప్రధాన సమస్యలైన రాళ్లపాడు ప్రాజెక్టు, రామాయపట్నం పోర్టు గురించి ఆయన పాదయాత్రలో ప్రస్తావిస్తారని భావించిన ప్రజలకు నిరాశ మిగిలి విధంగా జిల్లాలో ఆయన మొదటి రోజు పాదయాత్ర సాగింది. కందుకూరు నియోజకవ ర్గానికి జీవనాడి అయిన రాళ్లపాడు ప్రాజెక్టుకు సోమశిల జలాల నుంచి నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన కాలువ మధ్యలో ఆగిపోయింది. దీనిపై ఆయన స్పందిస్తారని అంతా భావించిన ఆయన పాదయాత్ర పలకరింపులతోనే ముగిసింది. దీంతో ప్రజలు, రాళ్లపాడు ఆయకట్టు రైతులు నిరాశకు గురయ్యారు. పాదయాత్రలో ఆయన వెంట ఒంగోలు ఎంపి వైవి సుబ్బారెడ్డి , నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, సజ్జాల రామకృష్ణ రెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి (వాసు) , మర్కాపురం వైసీపీ ఎమ్మెల్యే జంకె వెంటరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్, అద్దంకి ఇన్‌చార్జీ చెంచు గరటయ్య, చీరాల ఇన్‌చార్జీ యడం. బాలాజీ, కనిగిరి ఇన్‌చార్జీ బుర్రా మధుసూదన్ యాదవ్, దర్శి ఇన్‌చార్జీ బాదం మాధవరెడ్డి , గిద్దలూరు ఇన్‌చార్జీ సాయికల్పన రెడ్డి , పర్చూరు ఇన్‌చార్జీ గోటిపాటి భరత్, కొండపి ఇన్ చార్జీ వరికూటి అశోక్ బాబు, గూడ్లూరు జెడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, లింగసముద్రం మండల అధ్యకుడు పిచ్చపాటి తిరుపతి రెడ్డి , వైసీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ , గంగిరెడ్డి , పోడపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో జీ అధినేత భేటీ

విశాలాంధ్ర అమరావతి:ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జీ గ్రూప్ అధినేత సుభాష్ చంద్ర సీఎంతో శుక్రవారం సమావేశమయ్యారు. వీరి భేటీతో అగ్రిగోల్డ్ వ్యవహారం మరోసారి తెర మీదకి వచ్చింది. అగ్రిగోల్డ్ సంస్థ మోసం బట్ట బయలు కావటం, బాధితులు పోరాట బాట పట్టడం తెలిసిన సంగతే. అయితే అగ్రిగోల్డ్ వ్యవహారం పూర్తిగా కోర్టు పరిధిలోకి వెళ్ళటం, సంస్థ ఆస్తులు అమ్మి బాధితులకి నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించడంతో ప్రభుత్వం ఆ దిశగా చర్యలకు చేపట్టింది. ఈ క్రమంలో జీ సంస్థ అధినేత సుభాష్ చంద్ర అగ్రిగోల్డ్ సంస్థను టేకోవర్ చేసుకునేందుకు ముందుకొచ్చారు., విషయం కోర్టు పరిధిలో ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలసి చర్చించారు. కాగా బాధితులకు అన్యాయం జరగకుండా జరిగే ఏ చర్యకైనా తన సహకారం అందిస్తామని అంతకుముందే హామీ ఇవ్వడంతో ప్రస్తుతం ఈ భేటీ ఆసక్తి కరంగా మారింది. మంత్రి గంటాతో కలసి వచ్చిన సుబాస్ చంద్ర సుదీర్ఘంగా సీఎంతో చర్చించడం ముఖ్యమంత్రి వెళ్లిన తర్వాత కూడా మంత్రులతో చర్చలు కొనసాగించడంతోపాటు వివరాలను గోప్యంగా ఉంచటం చర్చనీయాంశమైంది. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగాలంటే సంస్థ ఆస్తులు అమ్మాల్సి ఉంది.

19 నుంచి 'అగ్రి' రిలే దీక్షలు

ప్రభుత్వం స్పందించకుంటే 'చలో అసెంబ్లీ' : ముప్పాళ్ల



విశాలాంధ్ర-గుంటూరు సిటీ : అగ్రిగోల్డ్ బాధితుల డిపా జిట్ల సొమ్ము తిరిగి చెల్లించడంలో భాగంగా రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4 వేల కోట్ల ప్రత్యేక నిధులను అడ్వాన్స్ రూపంలో కేటాయించాలని డిమాండు చేస్తూ ఈ నెల 19, 20, 21 తేదీలలో అగ్రిగోల్డ్ బాధితులు, వారి కుటుంబ సభ్యులతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రి గోల్డ్ కేసు విషయంలో 20న జరిగే వాయిదాలో ఎక్సెల్ గ్రూపు అగ్రిగోల్డ్‌ను టేకోవర్ చేస్తే అసోసియేషన్ తరఫున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. అలా కాకుండా టేకోవర్ విషయంలో జాప్యం జరిగితే మాత్రం రాష్ట్ర ప్రభుత్వం రూ.4 వేల కోట్లను అడ్వాన్స్ రూపంలో కేటాయించి 20 లక్షల మంది అగ్రి బాధితులను ఆదుకోవాలన్నారు. హైకోర్టు అనుమతితో అగ్రిగోల్డ్ ఆస్తులను విక్రయించి, వచ్చిన ఆదాయంలో ప్రభుత్వం జమ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వంపై వత్తిడిని పెంచడంలో భాగంగా చేపట్టే మూడు రోజుల రిలే నిరాహార దీక్షలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితులు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రానిపక్షంలో నెలాఖరులో సమావేశాన్ని నిర్వహించి అవసరమైతే చలో అసెంబ్లీ కార్యక్రమానికి ముందుకు వెళతామని హెచ్చరించారు. కాగా గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో కరెంటు పోయినప్పటికి సెల్ వెలుతురులో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన జీజీహెచ్ వైద్యులను ముప్పాళ్ల అభినందించారు.

ఈ సంఘటనకు కారణమైన, ప్రత్యామ్నాయానికి ఏర్పాట్లు చేయని ఆ సంస్థ కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండు చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ దీనికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. ఏటీఎంల వద్ద నో క్యాష్ బోర్డులు దర్శనమిస్తున్నాయంటే దీనికి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని ధ్వజమెత్తారు. క్యాష్ లెస్ లావాదేవీలతో ఖాతాదారులు నష్టపోతున్నారని, ఎటువంటి చార్జీలు పడకుండా ఉచిత సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా ఇవ్వకుండా తప్పించుకోవడం బీజేపీ తరం కాదన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు రాజకీయ మనుగడ కోసం పని చేస్తుంటే రాష్ట్ర పురోభివృద్ధి కోసం ప్రత్యేక తరగతి హోదా కావాలని ప్రజల పక్షాన ఆది నుంచి సీపీఐ త్రికరణ శుద్ధిగా పోరాటం చేస్తుందన్నారు. ఈ పోరాటంలో అంతిమ విజయం ప్రజలదేనని స్పష్టం చేశారు. మోడీకి నైతికత ఉంటే ఏపీకి ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలని డిమాండు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే వివిన్న రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కాలయాపన జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వంపై వత్తిడిని పెంచడానికి ఈ నెల 19 నుంచి రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయ వద్ద, జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో అగ్రిగోల్డ్ బాధితులతో ఈ దీక్షలను చేపట్టనున్నట్లు చెప్పారు. బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఓట్లు అడగటానికి రాలేరని అల్టిమేటం జారీ చేశారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని లేని పక్షంలో సీపీఐ బాధితులకు అండగా నిలబడి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, అసోసి యేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.



'కుంభకోణాలు' ఉచితం చేసిన మోడీ : జేవీఎస్ఎన్

విశాలాంధ్ర-నరసన్నపేట: భారతదేశంలో మోడీ సర్కార్ కుంభకోణాలు ఉచితం చేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఎద్దేవా చేశారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంకులో సుమారు రూ.11,400 కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చిందని, దీనికి పాల్పడిన నీరవ్ మోడీని బీజేపీ ప్రభుత్వం భారతదేశ సంపదను దోచిపెడుతుందని విమర్శించారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు చెందిన ఇన్‌కంట్యాక్స్ 5 శాతం తగ్గించిన మోడీ ప్రభుత్వం, మధ్యతరగతికి చెందిన ప్రజలు బ్యాంకుల్లో పెట్టుబడి పెట్టుకున్న డబ్బులపై సుమారు 10శాతం ఇన్‌కంట్యాక్స్ వేసిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తుందని మండిపడ్డారు. విభజన హామీ చట్టంలో పేర్కొన్నట్లుగా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిందని, అలాగే పోలవరం ప్రోజెక్టుకు, అమరావతి రాజధాని నిర్మాణాలకు నిధులు, విశాఖ రైల్వే ప్రత్యేక జోన్, అలాగే రాష్ట్రంలో సుమారు 11 విద్యాసంస్థలు నిర్మాణానికి మంజూరు చేయాల్సిన నిధులు విషయమై ప్రధాని మోడీ కనీసం నోరుమెదపలేదని తెలిపారు. కేంద్ర పాలిత రాష్ట్రాలకు నిధులను ఇష్టానుసారంగా ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వటంలో మొండిచేయి చూపటం ప్రజలు గమనిస్తున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు కేంద్రంపై స్థిరమైన నిర్ణయం తీసుకొని, పోరాటానికి సిద్ధంకావాలని జేవీఎస్ఎన్ కోరారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు పవన్ కళ్యాణ్ ప్రత్యక్ష పోరాటంలోకి దిగాలని జేవీఎస్ఎన్ అన్నారు. రాష్ట్రంపై చిన్నచూపు చూస్తున్న కేంద్రానికి బుద్ధిచెప్పేందుకు అన్ని పార్టీలతో కలిపి పనిచేస్తానని చెబుతున్న పవన్ చేతల్లో చూపించాలని తెలిపారు. విభజన చట్టం అమలు సాధనసమితి ద్వారా రాష్ట్రంలోని పలు సమస్యలకు సీపీఐ పాదయాత్రలు, బంద్‌లు చేశామని, జిల్లాలో వంశధార నిర్వాసితులకోసం, కొవ్వాడ అణు విద్యుత్ పోరాటంలో ప్రజల పక్షాన నిలిచామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు లండ వెంకట్రావ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చిక్కాల గోవిందరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.ప్రభావతి, మొజ్జాడ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలు

- మేం నిజాలు బయటపెడితే.. మీకు కష్టాలే
- టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ఎంపీలకు బీజేపీ బెదిరింపు

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : ప్రత్యేక హోదాతో దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలు లేవని బీజేపీ కొత్త రాగం అందుకుంది. ఈ మేరకు శుక్రవారం న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ, వైకాపా, కాంగ్రెస్ చేస్తున్న ఆందోళనలు రాజకీయ ప్రయోజనాలను ఆశించే చేస్తున్నారని, తాము నిజాలు బయట పెడితే కష్టాలు ఎదురవుతాయని ఆయా పార్టీలను హెచ్చరించారు. ప్రత్యేక హోదా ఇచ్చేస్తే మిగతా నిధులు ఏమీ అడగకుండా ఉంటారా అని ప్రశ్నించారు. ఏడు జిల్లాలకు సెప్టెంబరు 30 ,2016న సీబీడీటీ వెనుకబడిన జిల్లాలకు రాయితీలు ఇస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని,విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం నుంచి త్వరలో ఒక ప్రకటన వెలువడనున్నదని బీజేపీ ఎంపీ హరిబాబు స్పష్టం చేశారు. పవన్‌కల్యాణ్ ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీపై తమకు నమ్మకం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, వైసీపీ ఎంపీల రాజీనామాల అంశాన్ని అధిష్టానమే చూసుకుంటుందని ఏపీ విభజనచట్టం 2014 అమలు చేయడంలో కేంద్రం చిత్తశుద్ధితో పని చేస్తోందని స్పష్టం చేశారు. 10 ఏళ్ళ లోపు ఏపీ చట్టం 2014 అమలు చేయాలని ఉన్నప్పటికీ కేంద్రం మాత్రం నాలుగేళ్లలో ఏపీ అభివృద్ధికి కృషి చేసిందన్నారు. ఏపీ విభజన చట్టం 2014లో ఆరు అంశాలను పరిశీలించాలని కేంద్రం సూచించిందని, కేంద్రం రాష్ట్రానికి ఏమి ఇచ్చిందో యథార్థంగా ఒప్పుకోవాలని, ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని ఏపీలో అభివృద్ధి సాధ్యమైందంటే.. ఆ ఘనత కేంద్రానిదేనన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృది బీజేపీ ఏం చేసిందో తాము ప్రజల ముందుకు తీసుకువెళ్తామని వారు పేర్కొన్నారు.

ఆదాయ వనరులు వెల్లడించాల్సిందే

సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ:ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు సుప్రీం కోర్టు చారిత్రాత్మక ఆదేశం జారీ చేసింది. అనేక రాష్ట్రాలు ఎన్నికలకు వెళ్లనున్న నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులు తమ ఆదాయ వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే ఇప్పటి వరకు అభ్యర్థులు కేవలం తమ ఆదాయాన్ని మాత్రమే వెల్లడించేవారు, వనరులను కాదు. ఇకపై ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారి ఆదాయ వనరుల వివరాలను, వారి కుటుంబ సభ్యుల ఆదాయ వనరులను వెల్లడించాల్సి ఉంటుంది. ఈ మేరకు అభ్యర్థులు తమ ఆస్తుల వివరాలను స్పష్టంగా చెప్పాలంటూ లోక్ ప్రహరి అనే ఎన్జీవో వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తమ ఆస్తుల వివరాలతో ఉన్న అఫిడవిట్‌ను దాఖలు చేస్తారు. ఇందులో వ్యక్తిగత, భాగస్వాములు, పిల్లలు ఇతర కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను పొందుపరుస్తారు. అయితే ఆ ఆదాయమంతా వారికి ఎక్కడి నుంచి వస్తుందనే విషయాన్ని మాత్రం అభ్యర్థులు వెల్లడించరని లోక్‌ప్రహరి ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.శుక్లా పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందో కూడా చెప్పేవిధంగా నామినేషన్‌లో కాలమ్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసు విచారణ సమయంలో ఆదాయపు పన్ను విభాగం డైరెక్టర్ జనరల్ ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్ల 'మొదటి అభిప్రాయ ధ్రువీకరణ'లో ఏడుగురు లోక్‌సభ ఎంపీలు, 98 మంది ఎమ్మెల్యేలు సమర్పించిన ఆదాయ వివరాలలో తేడాలు ఉన్నాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఒక అఫిడవిట్‌లో సోమవారం న్యాయస్థానానికి తెలిపింది. పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం కేంద్రం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజకీయ నాయకుల ఆస్తులు అమాంతం పెరిగినా, ఎలా పెరిగాయనే విషయంపై కేంద్రం ఎలాంటి దర్యాప్తు చేపట్టలేదని చురకలంటించింది. అభ్యర్థులు తమ ఆదాయ వనరులను చెప్పాల్సిందేనని స్పష్టం చేస్తూ జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విధంగా తీర్పు వెలువరించింది. ప్రస్తుత లోక్‌సభకు చెందిన నలుగురు ఎంపీల ఆస్తులు 12 రెట్లు పెరిగాయని, మరో 22 మంది ఆస్తుల్లో ఐదు రెట్లు పెరుగుదల ఉందని ఈ కేసులో ఒక పక్షంగా ఉన్న, ఎన్నికల సంస్కరణలపై పని చేస్తున్న అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) తెలిపింది.

కులాంతర వివాహాలు అడ్డుకుంటే చర్యలు

న్యూఢిల్లీ : యువతీయువకులు పరస్పర అంగీకారంతో చేసుకున్న కులాంతర వివాహాన్ని నిరసించే వారిపై చర్యలు తీసుకోవాలని అమికస్ క్యూరీ(ప్రభుత్వం తరఫు న్యాయవాది) రాజురామచంద్రన్ శుక్రవారం పేర్కొన్నారు. కాప్ పంచాయతీల ద్వారా పరువు హత్యల కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు ముందు ఈ మేరకు తన వాదన వినిపించారు. అయితే 'ఖాప్' అనే పదం వినియోగించకుండా 'వ్యక్తుల సమావేశం' అని నివేదికలో వాడారు. ఈ అంశంపై ఫిబ్రవరి 5న జరిగిన విచారణలో ఖాప్ పంచాయతీల విషయమై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. పరువు పేరుతో హత్యలకు పాల్పడుతూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్న వారిపై చర్యలు చేపట్టాలని సూచించింది.

విశాలాంధ్ర

క్రీడలు

టీ20ల్లో సరికొత్త రికార్డు

అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఆసీస్



ఆక్లాండ్: అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. న్యూజిలాండ్‌పై అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ఛేదించి చరిత్ర సృష్టించింది. ఆక్లాండ్‌లో న్యూజిలాండ్-ఆస్ట్రేలియాల మధ్య జరిగిన టీ20 మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 6 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆసీస్ 5 వికెట్లు మాత్రమే నష్టపోయి ఇంకా ఏడు బంతులు మిగిలి ఉండగానే 245 పరుగులు చేసి లక్ష్యాన్ని చేరుకుంది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో షార్ట్ 76, వార్నర్ 59, ఫించ్ 36, మాక్స్‌వెల్ 31, లిన్ 18 పరుగులతో రాణించారు. ఈ విజయంతో ఆసీస్ అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించి టీ20ల్లో రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకూ ఈ రికార్డు వెస్టిండీస్ పేరుపై ఉంది. 2015 జనవరిలో జోహానెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20లో విండీస్.. ప్రత్యర్థి జట్టు నిర్దేశించిన 231 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో ఛేదించింది. విండీస్ ఈ మ్యాచ్‌లో 6 వికెట్లు నష్టపోయి 236 పరుగులు చేసింది. ఇప్పుడు ఈ రికార్డును ఆసీస్ అధిగమించింది. ఈ జాబితాలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. 2009లో మొహాలీలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 206 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత లంక 7 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేస్తే.. అనంతరం భారత్ 4 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.

అదరగొట్టిన అమ్మాయిలు

2-0తో సిరీస్ ముందంజ



బఫెల్లో పార్కు: గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత మహిళల క్రికెట్ జట్టు మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో 2-0తో ముందడుగు వేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు భారత బౌలర్లను దీటుగానే ఎదుర్కొంది. నిర్ణీత 20ఓవర్లలో ఏడు వికెట్లు నష్టానికి 142పరుగులు చేసింది. అనంతరం 143పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టుకు ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. మిథాలీ రాజ్ 76నాటౌట్(61బంతుల్లో 8×4) చివరి వరకూ నిలిచి జట్టును విజయపథంలో నడిపింది. మరో ఓపెనర్ స్మృతి మంథాన 57(42 బంతుల్లో, 4×4, 3×6) ధాటిగా ఆడే ప్రయత్నంలో దక్షిణాఫ్రికా బౌలర్ డేనిల్స్ చేతిలో ఎల్బీగా వెనుదిరిగింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 7(12బంతుల్లో), మిథాలీ రాజ్‌తో కలిసి లాంఛనం పూర్తిచేసింది. అంతకుముందు బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టులో ఓపెనర్లు లీ 15(12బంతుల్లో, 3×4), కెప్టెన్ డేన్ వాన్ 15(18బంతుల్లో, 2×4) మంచి శుభారంభమే ఇచ్చారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సునే లస్ 33(32బంతుల్లో, 2×4), మరో క్రికెటర్ డి కెర్క్ 26(28బంతుల్లో, 1×4)కలిసి నిలకడగా ఆడటంతో దక్షిణాఫ్రికా జట్టు భారత్ ముందు 143లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. భారత బౌలర్లలో పూనమ్ యాదవ్, అనూ పాటిల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



కోహ్లి.. మరో గంగూలీ : సెహ్వాగ్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాలో తొలిసారి సిరీస్ విజయం సాధించిన కోహ్లిసేనపై ప్రశంసల వర్షం కొనసాగుతోంది. తాజాగా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనదైన శైలిలో కోహ్లిని పొగడ్తల్లో ముంచెత్తాడు. విరాట్ కెప్టెన్సీ స్టైల్ తననెంతో ఆకట్టుకుందన్నాడు. ముఖ్యంగా కోహ్లి దూకుడును చూస్తుంటే.. గంగూలీ అప్‌గ్రేడెడ్ వెర్షన్‌లా ఉన్నాడని కొనియాడాడు. గంగూలీ కెప్టెన్సీలో మనం విదేశాల్లో ఎన్నో సిరీస్ విజయాలను చూశాం. ఇప్పుడు అలాంటి ధోరణి కోహ్లిలో కనిపిస్తోంది. అతని నాయకత్వంలో భారత్ సాధించిన విజయాలు.. అతన్ని ఉత్తమ కెప్టెన్లలో ఒకడిగా నిలబెట్టాయి. గత ఎనిమిది సిరీస్ విజయాలను పరిశీలిస్తే కోహ్లి నం.1 సారథి అని చెప్పక తప్పదు. అయితే ఈ సమయంలో గత ఉత్తమ కెప్టెన్లతో అతన్ని పోల్చడం ఇక్కడ సమంజసం కాదు. అలా పోల్చాలంటే కోహ్లికి ఇంకా సమయం, మరింత అనుభవం కావాలి' అని సెహ్వాగ్ అన్నాడు. 'కెప్టెన్‌గా కోహ్లి ఏ మాత్రం ఒత్తిడికి గురికాడు. బాధ్యతతో తన ఆటను మెరుగుపరుచుకున్నాడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలలో కూడా కోహ్లిసేన అద్భుతాలను సృష్టిస్తుందని నేను బలంగా నమ్ముతున్నా. కోహ్లి కెప్టెన్సీ గొప్పతనం ఏంటంటే.. ఒక్కో ఆటగాడి నుంచి అతను అత్యుత్తమ ప్రతిభను వెలికితీస్తాడు. అతని బలం ప్రస్తుతం ఉన్న బౌలింగ్ లైనపే. ఏ రోజైతే బౌలర్లు సరిగ్గా ప్రదర్శన చేయరో ఆ రోజు కోహ్లి పతనం ప్రారంభమవుతుంది' అని సెహ్వాగ్ అన్నాడు.

ధోనీ అరుదైన రికార్డు



సెంచూరియన్: టీం ఇండియా మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ ఎంఎస్ ధోని మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. సూపర్ స్పోర్ట్స్ పార్క్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఆరు వన్డేలో శార్దూల్ బౌలింగ్‌లో ఆమ్లా క్యాచ్ అందుకున్న ధోని అంతర్జాతీయ క్రికెట్‌లో ఆరు వందల క్యాచ్‌లు అందుకున్న తొలి భారత కీపర్‌గా నిలిచాడు. గతంలో ఈ రికార్డును సౌతాఫ్రికా మార్క్ బౌచర్, ఆస్ట్రేలియా కీపర్ అడం గిల్‌క్రిస్ట్ తర్వాత ఈ ఫీట్ సాధించిన మూడో ఆటగాడిగా ధోని చరిత్ర సృష్టించాడు. కాగా ఈ మ్యాచ్‌లో 10వేల పరుగుల మైలురాయికి ధోని 33 పరుగుల దూరంలో ఉన్నాడు.



శార్దూల్ పంజా

- 4 వికెట్లతో రాణించిన ఠాకూర్
- ఒంటరిగా పోరాడిన జాండో
- బ్యాట్ ఝుళిపించిన పెహ్లుక్‌వాయో
- రాణించిన బౌలర్లు

సెంచూరియన్: భారత్‌తో జరుగుతున్న చివరిదైన ఆరో వన్డేలో దక్షిణాఫ్రికా 205 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టీమిండియా బౌలర్ల విజృంభణకు సఫారీలు కుప్పకూలారు. ఆద్యంతం ఆకట్టుకున్న భారత బౌలర్లు.. దక్షిణాఫ్రికాకు ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. ప్రొటీస్ ఆటగాళ్లలో జాండో(54), పెహ్లుక్‌వాయో(34)లు మినహా మిగతా వారు ఆశించిన స్థాయిలో ఆడలేదు. దాంతో దక్షిణాఫ్రికా 46.5 ఓవర్లలో 204 పరుగులకే చాపచుట్టేసింది. భారత బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లు సాధించి అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయగా, చాహల్, బూమ్రాలు చెరో రెండు వికెట్లు తీశారు. పాండ్య, కుల్దీప్‌లకు తలో వికెట్ దక్కింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను మర్‌క్రామ్, హషీమ్ ఆమ్లాలు ఆరంభించారు. అయితే జట్టు స్కోరు 23 పరుగుల వద్ద ఆమ్లా(10) తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆపై మరో 20 పరుగుల వ్యవధిలో మర్‌క్రామ్(24) కూడా అవుట్ అయ్యాడు. ఆ తరుణంలో డివిలియర్స్-జాండో జోడి ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను తీసుకున్నారు. ఆ జోడి 62 పరుగుల జోడించిన తరువాత డివీ(30) మూడో వికెట్‌గా పెవిలియన్ బాటపట్టాడు. స్పిన్నర్ చాహల్ వేసిన బంతిని కట్ చేయబోయి బౌల్డ్ అయ్యాడు. కాగా, జట్టు స్కోరు 135 పరుగుల వద్ద క్లాసెన్(22) నిష్క్రమించాడు. బూమ్రా బౌలింగ్‌లో కోహ్లి అద్భుతమైన క్యాచ్ పట్టడటంతో క్లాసెన్ భారంగా మైదానాన్ని వీడాడు. ఇక్కడ 16 పరుగుల వ్యవధిలో దక్షిణాఫ్రికా నాలుగు వికెట్లను కోల్పోవడంతో స్కోరు మందగించింది. కాగా, మోర్నీమోర్కెల్(20)- పెహ్లుక్‌వాయో జోడి దూకుడుగా ఆడే యత్నం చేసింది. ఈ జోడి 36 పరుగుల జోడించిన తర్వాత మోర్కెల్ ఎనిమిదో వికెట్‌గా పెవిలియన్ చేరగా, ఆపై వెంటనే తాహీర్(2) కూడా అవుటయ్యాడు. అయితే ఫెహ్లుకోహియో బ్యాట్‌ను ఝుళిపించి దక్షిణాఫ్రికా స్కోరును రెండొందలు దాటించాడు. శార్దూల్ ఠాకూర్ వేసిన 47 ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. అయితే అదే ఓవర్ ఐదో బంతికి శార్దూల్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెహ్లుక్‌వాయో చివరి వికెట్‌గా పెవిలియన్ చేరడంతో సఫారీల ఇన్నింగ్స్ ముగిసింది.

ఐపీఎల్ వేళలపై మల్లగుల్లాలు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-11 సీజన్‌కు సంబంధించి ఒకే రోజు రెండేసి జరిగే మ్యాచ్‌ల సమయాల్లో మార్పులు లేకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఈ సీజన్‌లో రాత్రి 8 గం.లకు 48 మ్యాచ్‌లు, సాయంత్ర 4 గం.లకు 12 మ్యాచ్‌లను షెడ్యూల్ చేశారు. ఈ మేరకు మ్యాచ్ వేళల్ని మార్చాలని టోర్నీ ప్రసారుదారు స్టార్ స్పోర్ట్స్ గత నెలలో ఐపీఎల్ పాలక మండలికి విజ్ఞప్తి చేసింది. రోజూ వారీ షెడ్యూల్ ప్రకారం రెండో మ్యాచ్‌ను రాత్రి ఆరంభించాలని, వేసవి వేడి దృష్ట్యా సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభించాలని స్టార్ స్పోర్ట్స్ ప్రతిపాదించింది. అదే సమయంలో రెండో మ్యాచ్‌ను రాత్రి 7.00ని.లకు మార్చాలనుకుంది. దీనికి పాలకమండలి అంగీకారం కూడా తెలిపింది. రాత్రి మ్యాచ్‌లు త్వరగా ఆరంభమై.. త్వరగా ముగిస్తే ప్రైమ్‌టైమ్ కవరేజ్ కూడా వస్తుందని స్టార్‌స్పోర్ట్స్ భావించింది. కానీ ఐపీఎల్ షెడ్యూల్ ప్రకటించే క్రమంలో షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులు లేకుండా గతంలో మాదిరిగానే విడుదల చేసింది. ఇందుకు కారణం తమను సంప్రదించకుండానే ఐపీఎల్ పాలకమండలి.. స్టార్ స్పోర్ట్స్ నిర్ణయానికి ఆమోదం తెలపడంతో ఐపీఎల్ రెవెన్యూ మోడల్‌లో వాటాదారులుగా ఉన్న సగం మంది వ్యతిరేకత వ్యక్తం చేశారు.

ఎందుకు మార్చాలనుకున్నారంటే..

మ్యాచ్ ముగిశాక ప్రేక్షకులు ఇళ్లకు, ఆటగాళ్లు హోటళ్లకు రాత్రి పూట ఆలస్యంగా చేరుకునే సమస్య తీరుతుందని స్టార్ స్పోర్ట్స్ ఆశించింది. అదే సమయంలో రెండో మ్యాచ్ త్వరగా ఆరంభిస్తే ఎక్కువ మంది వీక్షించే అవకాశం ఉంటుందనేది మరొక కారణం. ఒక రకంగా దీనికి ప్రజల నుంచి సానుకూల స్పందనే వచ్చింది. మ్యాచ్ కోసం అర్ధరాత్రి వరకూ మెలకువగా ఉండడం, స్టేడియాలకు వెళ్లిన వారు తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకొనేందుకు పడే ఇబ్బందులు తొలుగుతాయని భావించారు. అయితే, ఫ్రాంచైజీల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో బీసీసీఐ పాత వేళలకే మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్ షెడ్యూల్‌పై పలు ఫ్రాంచైజీలు మల్లగుల్లాలు పడుతున్నాయి.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: స్థానిక ఇందిరాగాంధి మున్సిపల్ స్టేడియంలో ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సహకారంతో కృష్ణాజిల్లా హ్యాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడో రాష్ట్రస్థాయి పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఓఎస్‌డి ప్రత్తిపాటి రామకృష్ణ విశిష్ట అతిథిగా హజరయ్యారు. రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌కు విజయవాడ వేదికగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని రామకృష్ణ అన్నారు. రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్ర కీర్తిని ఇనుమడింప జేయాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న జట్లకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్‌ను ఇస్తున్నామన్నారు. ఇలాంటి రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లను నిర్వహిస్తున్న కృష్ణా జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినంధించారు. ఏపీ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, అసో సియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పి.సత్య నారాయణ రాజు, కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, కోశాధికారి పీఆర్ లెనిన్, కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.సీజర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి వంశీ, కృష్ణాజిల్లా పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి వాకానాగరాజు, వైవీ రాజేంద్రప్రసాద్, జి.సాంబశివ రావు (సోషల్ వర్కర్), పి.దామోదర్ (సోషల్ వర్కర్), డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, శాప్ డిప్యూటీ డైరక్టర్ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు ఫలితాలు :



కడప జట్టుపై విశాఖపట్నం 30-18 స్కోర్ తేడాతో, విజయనగరం జట్టుపై అనంతపురం 27- 17 స్కోర్ తేడాతో, తూర్పుగోదావరి జట్టుపై చిత్తూరు 26-24 స్కోర్ తేడాతో, ప్రకాశం జట్టుపై గుంటూరు 19-7 స్కోర్ తేడాతో, నెల్లూరు జట్టుపై శ్రీకాకుళం 28-10 స్కోర్ తేడాతో విజయం సాధించాయి.

హాకీ వరల్డ్ కప్‌లో పాకిస్థాన్..?

న్యూఢిల్లీ: భారత్‌లో జరగనున్న పురుషుల హాకీ ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పాల్గొనే అవకాశం ఉందని అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్ఐహెచ్) వెల్లడించింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉన్నప్పటికీ ఇది జరగవచ్చని పేర్కొంది. భువనేశ్వర్‌లో నవంబర్ 18 నుంచి డిసెంబర్ 16 మధ్య పురుషుల హాకీ ప్రపంచకప్ జరగనుంది. పాక్‌తో సహా దీనిలో 16 దేశాలు పాల్గొననున్నాయి. భారత్, పాక్ మధ్య సంబంధాలు దిగజారిన నేపథ్యంలో ఆ దేశం పాల్గొనక పోవచ్చనే ఊహాగానాల మధ్య ఎఫ్ఐహెచ్ ఈ విధంగా స్పందించింది. 'ప్రపంచకప్‌కు అర్హత పొందిన ఏ దేశం కూడా భారత్‌కు రాకుండా ఉపసంహరిచుకుంటున్నట్లు వెల్లడించలేదు. అలాగే భారత్ నుంచి కూడా ఏదేశం గురించి అభ్యంతరాలు వ్యక్తంకాలేదు.' అని ఎఫ్ఐహెచ్ పేర్కొంది. 'మా నమ్మకం ప్రకారం దేశాల మధ్య సహృద్భావన పెంచేందుకు హాకీ తోడ్పడుతుంది' అని సమాఖ్య తెలిపింది. జనవరిలో జరిగిన అంధుల ప్రపంచ కప్ కోసం భారతదేశం పాకిస్థాన్ వెళ్లడానికి అంగీకరించలేదు. మ్యాచ్‌లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగేలా భారత్ ఒత్తిడి తీసుకుచ్చింది. రెండు దేశాల మధ్య చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల కారణంగా గత కొన్నేళ్లుగా ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ జరగలేదు. కబాడ్డీ, స్క్వాష్, రెజ్లింగ్‌కు సంబంధించిన టోర్నమెంట్ల కోసం పాక్ మనదేశానికి రాలేదు. హాకీ ప్రపంచ కప్‌లో మంచి రికార్డు ఉన్న పాక్ 2014 ప్రపంచ కప్‌కు మాత్రం అర్హత సాధించలేకపోయింది.

ఓలీని అభినందించిన మోడీ

భారత్ సందర్శించాలని ఆహ్వానం

ఖాట్మండు: నేపాల్ కొత్త ప్రధాన మంత్రి కె.పి.శర్మ ఓలీకి భారత ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భారత్‌ను సందర్శించాల్సిందిగా ఓలీని ఆహ్వానించారు. నేపాల్ 41వ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సీపీఎన్-యూఎంఎల్ చైర్మన్‌కు గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో టెలిఫోన్‌లో మోడీ శుభాకాంక్షలు తెలుపుతూ పదవీ కాలంలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నేపాల్ అభివృద్ధికి అన్ని రకాల సహాయాలు అందజేయడానికి మోడీ హామీ కూడా ఇచ్చారని ఓలీ వ్యక్తిగత సచివాలయం విడుదల చేసిన ఒక ప్రకటన పేర్కొంది. నేపాల్ గత ఎన్నికల్లో ఓలీ పార్టీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్(యూనిఫైడ్ మార్క్సిస్టు-లెనినిస్టు) అతిపెద్ద పార్టీగా అవతరించిన తర్వాత ఈ ఇద్దరు నాయకుల మధ్య ఫోన్ సంభాషణ జరగడం ఇది మూడోసారి. ఫోన్ సంభాషణలో ఓలీ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, శ్రేయస్సు పైనే తన ప్రధాన దృష్టి అని తెలిపారు. రానున్న రోజుల్లో భారత్‌తో మరింత స్నేహసంబంధాలు కొనసాగించడంపై కూడా ఆయన హామీ ఇచ్చినట్లు ఆ ప్రకటన వివరించింది. కాగా నేపాల్‌లోని భారత రాయబారి మన్‌జీవ్ సింగ్ పురి ఓలీ ప్రైవేటు నివాసానికి వెళ్లి ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఓలీ నాయకత్వంలో నేపాల్ ఆర్థికాభివృద్ధి, సుస్థిరత సాధిస్తుందని భారత ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారన్న సందేశాన్ని పురి అందించారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ కూడా గురువారం రాత్రి ఫోన్ చేసి ఓలీని అభినందించారు.

నేపాల్ ప్రధానికి సీపీఐ అభినందన



న్యూఢిల్లీ: నేపాల్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన కమ్యూనిస్టునేత కేపీ ఓలీకి సీపీఐ జాతీయ సమితి తరపున తాను వ్యక్తిగతంగా అభినందనలు తెలియజేస్తున్నానని పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మీ నాయకత్వంలో నూతన ప్రభుత్వం నేపాల్ ప్రజలపైన బ్రహ్మాండమైన ప్రభావం చూపగలదని మేము అభిప్రాయపడుతున్నాం. దేశప్రజలు కోరుకుంటున్న శాంతి, సుస్థిరత, అభివృద్ధి, నూతన రాజ్యాంగ పరిధిలో విప్లవాత్మకమార్పులతో దేశం వేగంగా అభివృద్ధి చెందగలదని భావిస్తున్నాం. నూతన ప్రభుత్వం నేపాల్ ప్రజల సంక్షేమానికి దోహదంచేసే సమస్యలను పరిష్కరించడమేగాక భారతదేశంతో సహా ఇరుగు, పొరుగు దేశాలతో మెరుగైన సంబంధాలను నెలకొల్పగలదని మా పార్టీ చిత్తశుద్ధితో విశ్వసిస్తున్నది. మరోసారి మీకు అభినందనలు తెలియజేస్తూ మీ నూతన లక్ష్యాలను సాధించడంలో విజయంపొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ విప్లవాభినందనలు తెలియజేస్తున్నాం.

నెటిజన్లకు గూగుల్ షాక్

న్యూఢిల్లీ: ఇంటర్నెట్ యూజర్లకు సెర్చింజన్ దిగ్గజం గూగుల్ షాకిచ్చింది. ఇకపై సెర్చ్‌లో కనిపించే ఫొటోలను ఇష్టం వచ్చినట్టు వాడేసుకోకుండా బంధనాలు వేసింది. ఇందుకోసం కొన్ని మార్పులు చేసింది. ఫొటోలపై ఉన్న 'వ్యూ ఇమేజ్' బటన్‌ను తొలగించేసింది. కాపీ రైట్స్‌ను బూచిగా చూపుతూ ఈ ఆప్షన్‌ను తొలగించింది. ఫలితంగా ఇప్పుడు గూగుల్‌లో కేవలం విజిట్, షేర్‌లు మాత్రమే కనిపిస్తున్నాయి. నిన్నటి వరకు గూగుల్‌లో ఏదైనా ఫొటోను ఓపెన్ చేసినప్పుడు విజిట్, షేర్‌తోపాటు 'వ్యూ ఇమేజ్' ఆప్షన్ కూడా కనిపించేది. దానిపైన క్లిక్ చేస్తే మరింత మెరుగైన ఇమేజ్ ఓపెన్ అయి సేవ్ చేసుకునే సౌకర్యం ఉండేది. దానిని యూజర్లు తమ సొంతానికి ఉపయోగించుకునే వారు. అయితే ఇకపై అలా చేయడం కుదరదు. తమ ఫొటోలను యూజర్లు దొంగిలించి వారి సొంత అవసరాలకు వాడుకుంటున్నారని ఫొటోగ్రాఫర్లు, పబ్లిషర్లు కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. ఇమేజ్ సెర్చ్ కారణంగా తమ ఫొటోలు చోరీకి గురవుతున్నారని వాపోతున్నారు. దీంతో స్పందించిన గూగుల్ 'వ్యూ ఇమేజ్' బటన్‌ను తొలగించింది. గూగుల్‌లో నేటి నుంచి కొన్ని మార్పులు చేశామని, వ్యూ ఇమేజ్ బటన్‌ను తొలగించామని గూగుల్ పేర్కొంది. యూజర్లకు, ఆధారిత వెబ్‌సైట్లకు ఉపయోగకరంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ మార్పులు చేసినట్టు వివరించింది. విజిట్ పేజ్ బటన్ ద్వారా యూజర్ ఆధారిత వెబ్‌సైట్‌కు వెళ్తాడని, తద్వారా ఆ వెబ్‌సైట్ ఆదాయం పెరుగుతుందనే ఉద్దేశంతోనే గూగుల్ ఈ మార్పులు చేసినట్టు తెలుస్తోంది. గూగుల్ ఫొటోలు ఓపెన్ చేస్తుంటే 'కాపీ రైట్' సమస్య వచ్చే ప్రమాదం ఉందని ప్రతీ ఫొటో కింద కనిపిస్తుండడంతో యూజర్లు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.